
ఆంధ్ర ప్రదేశ్

అవతరణ దినోత్సవ ప్రత్యేక సంచిక

నవంబర్ 1970

50 పైసలు





ఆంధ్రప్రదేశ్

నవంబరు, 1970

కార్తీకం – మార్గశిరం, 1892 శా. శ

సంపుటి: 15 సంచిక: 1

ప్రధాన సంపాదకులు : పెండ్యాల వామనరావు

ఆంధ్రప్రదేశ్ అవతరణ దినోత్సవ ప్రత్యేక సంచిక



పేజీ

కవరుపేజీ : డిజైన్, శ్రీ రహీం

రెండో అట్ట : నెహ్రూతో మన ముఖ్యమంత్రి

మూడో అట్ట : భారత ప్రజల ప్రియతమ నాయకుడు

వెల : 50 పైసలు

సాలు చందా: 6 రూపాయలు

రిజిస్టర్డ్ నెం. 185

ఆకలితో యుద్ధం

"ఆకలితోచేసే పోరాటంలో విజయం పొందడానికి ఎరువులే మన ఆయుధాలు" అన్నారు ప్రధాన మంత్రి శ్రీమతి ఇందిరాగాంధీ. అక్టోబరు 2వ తేదీన, గాంధీ జయంతి నాడు గోదావరీ తీరాన గల రామగుండం దగ్గర గోదావరి గని వద్ద 71 కోట్ల రూపాయల ఖర్చుతో నిర్మిస్తున్న ఎరువుల ఫ్యాక్టరీకి శంకుస్థాపన జరిగిన సందర్భంలో పంపిన తమ సందేశంలో ప్రధాన మంత్రి అలా అన్నారు. పైగా పబ్లిక్ రంగంలో యీ ఫ్యాక్టరీ నిర్వహించబడడం దేశానికి గర్వకారణం అని కూడా ఆమె పేర్కొన్నారు. ఇటీవలి కాలంలో ఆంధ్రప్రదేశ్ అనేక పరిశ్రమలను ఆకర్షిస్తున్నది. ఒక్క తెలంగాణా ప్రాంతంలోనే పరిశ్రమలలో పెట్టిన పెట్టుబడి రు. 150 కోట్ల వరకు వుంటుంది అయినప్పటికీ, ముఖ్యమంత్రి శ్రీ కాసు బ్రహ్మానందరెడ్డి చెప్పినట్లు, రామగుండం ఎరువుల ఫ్యాక్టరీ, విశాఖ ఉక్కుకర్మాగారం—యీ రెండూ నిజానికి మన రాష్ట్రానికి గర్వకారణాలు.

నాలుగువందల యిరవై మూడు ఎకరాల విస్తీర్ణంలో నిర్మించబడుతున్న, బొగ్గు ప్రాతిపదికగా గల యీ ఎరువుల ఫ్యాక్టరీకి కావలసిన ముడిపదార్థాలు, యితర సౌకర్యాలు బాగా అందుబాటులో వున్నాయి. విద్యుచ్ఛక్తి, బొగ్గు, నీరు పుష్కలంగా లభిస్తాయి. ఈ ఫ్యాక్టరీకి రోజుకు 7 కోట్ల లీటర్ల నీరు, 34 మెగావాట్ల విద్యుఛ్ఛక్తి అవసరమవుతాయి. ఫ్యాక్టరీ స్థలం వరకు ఏర్పాటుచేసిన బెల్టుకన్వేయర్ల ద్వారా, టన్ను రు. 38.38 వంతున సరసమైన ధరకు, బొగ్గు ఫ్యాక్టరీకి చేరవేయబడుతుంది. ఉత్పత్తి గరిష్టస్థాయికి చేరుకున్నప్పుడు యీ ఫ్యాక్టరీ 10 లక్షల టన్నుల తక్కువ రకం బొగ్గును ఉపయోగిస్తుంది. సింగరేణి బొగ్గు గనుల్లోని నిలువలను యితర ప్రయోజనాలకు కూడా వినియోగించుకునే కృషిలో యిది అతి ప్రధానమైన ఘట్టం.

"తూర్పు దేశాల మాంఛెస్టర్" గా అభివృద్ధి చేయబడదగినదని భావించబడిన కొత్తగూడెం-రామగుండం ప్రాంతంలో పారిశ్రామిక అభివృద్ధి వనరులు పుష్కలంగా వున్నాయి. ఐక్య రాజ్య సమితి అభివృద్ధి ప్రాజెక్టు ప్రత్యేక నిధి సహాయంతో కొత్తగూడెంలో ఒక దుక్క యినుము ఫ్యాక్టరీకూడా ఏర్పాటు చేయబడుతుంది. ఒకవైపు రామగుండం ఎరువుల ఫ్యాక్టరీ, మరోవైపు పోచంపాడు ప్రాజెక్టు-వీటికితోడు గత కొన్నేళ్లుగా తెలంగాణాలో ప్రారంభించబడిన అనేక భారీ, మధ్య తరహా పరిశ్రమలు, లఘుపరిశ్రమలు-వీటన్నిటి ప్రభావం తెలంగాణా ఆర్థిక వ్యవస్థమీద ఎంతో ఎక్కువగా వుంటుంది. రామగుండం ఎరువుల ఫ్యాక్టరీ శంఖు స్థాపనోత్సవానికి హాజరైన అసంఖ్యాక ప్రజానీకాన్ని ఉద్దేశించి మాట్లాడుతూ, రానున్న అయిదేండ్ల కాలంలో, ప్రాంతీయ విభేదాలు విడనాడి సామాన్య ప్రజల జీవన పరిస్థితులను మెరుగు పరచడానికి కృషి చేయవలసి ఉంటుందని ముఖ్యమంత్రి ఉద్బోధించారు. చారిత్రికంగా చూసినా, ప్రజల భవిష్యత్తు దృష్టిలో పెట్టుకుని చూసినా రాష్ట్రంలోని మూడు ప్రాంతాలు, పరస్పరం సహాయ సహకారాలు అందించుకుంటూ, ఒకదానికొకటి తోడుగా అభివృద్ధి చెందాలి.

★ ★ ★ ★

సార్వజనీన మిశ్రమ సంస్కృతి స్వభావానికి ఆటపట్టుగా ఆంధ్రప్రదేశ్‌కూ, యావద్భారత దేశానికీ గర్వకారణమైన హైదరాబాదు నగరం గత సెప్టెంబరు నెలలో పడిన భారీ వర్షాలవల్లా, వరదలవల్లా ఘోరనష్టాలకు గురైంది. 1908 నుంచి కూడా యీ సెప్టెంబరు నెల యీ చరిత్రాత్మక నగరానికి ఒక శాపంగానే వచ్చిపోతున్నది. 1908లో, మూసీనది గట్లు త్రెంచుకుని నగరంమీదపడి పెద్దఎత్తున ప్రాణనష్టం, ఆస్తినష్టం కలిగించింది ఈ యేడు సెప్టెంబరు కూడా హైదరాబాదును మహావిషాదంలో, విపదంబుధిలో ముంచివేసింది. భారీవర్షాలకు తోడు నగరం మధ్యలో కాలువలు తెగి, నీరుపొంగి యీ మహావిపత్తు సంభవించింది. ఈ కష్టతరుణంలో ఆంధ్ర ప్రాంతంనుంచీ తదితర ప్రాంతాలనుంచీ, బియ్యం, వస్త్రాలు, డబ్బు రూపంలో నిరంతరంగా అందిన సహాయ సహకారాలనూ, రాష్ట్ర ప్రభుత్వము, నగర కార్పొరేషనూ సకాలంలో చేపట్టి సత్వరంగా నిర్వహించిన సహాయ కార్యక్రమాలనూ ప్రతి ఒక్కరూ కృతజ్ఞతతో గుర్తించారు. వరద బాధితులకూ, నష్టపడిన కుటుంబాలవారికీ హృదయపూర్వక సానుభూతి చూపడం, శాయశక్తుల సహాయపడడం మనందరి కర్తవ్యం.

పి. వి. ఆర్.

ప్రధానమంత్రి అష్టసూత్ర ప్రణాళిక — అమలు జరిగిన తీరు

తెలంగాణా సత్వరాభివృద్ధిని చూరగొనడానికి రూపొందించ బడిన ప్రధానమంత్రి అష్టసూత్ర ప్రణాళిక అమలు విషయంలో చెప్పుకోదగిన ప్రగతి సాధించడం జరిగింది. ఇంతవరకు జరిగిన అభివృద్ధి కార్యక్రమాలను గురించి ప్రధానమంత్రి ఇటీవలనే సమీక్ష చేశారు. తెలంగాణాలో అభివృద్ధి పట్ల ఆమె సంతృప్తి వెల్లడించారు.

తెలంగాణాలో మిగులు నిధులు

తెలంగాణా మిగులు నిధులు నిర్ణయించడానికి ఉన్నతాధికార సంఘాన్ని నియమించాలని ప్రధానమంత్రి సూచించారు. ఈ సూచన ఫలితంగా భార్గవా కమిటీ నియమింప బడింది. తెలంగాణా ప్రాంతంలో ఖర్చు కాకుండా మిగిలిఉన్న నిధులు రు. 28.34 కోట్లు వున్నాయని ఈ కమిటీ నిర్ణయించింది. ఈ దీర్ఘ కాలంలో మిగులు నిధులను ఉపయోగించక పోవడం వల్ల తెలంగాణా ప్రాంతం అభివృద్ధి కొంతవరకు వెనకబడి పోయింది. ఆ కారణం వల్ల తెలంగాణా అభివృద్ధికి 1968 ఏప్రిల్ 1 నుంచి చతుర్థ ప్రణాళిక అంతం వరకు ప్రత్యేకంగా మొత్తం రూ. 45 కోట్లు కేటాయించాలని భారత ప్రభుత్వం రాష్ట్ర ప్రభుత్వానికి సలహా యిచ్చింది. రాష్ట్ర అభివృద్ధి ఖర్చులో మామూలుగా వుండే తెలంగాణా వాటాకు తోడుగా ఈ మొత్తం అదనంగా ఖర్చు చేయడం జరుగుతుంది. 1969–70 సంవత్సరంలో తెలంగాణాలో అదనంగా రు. 9 కోట్లు ఖర్చుపెట్టబడినాయి. 1970–71 సంవత్సరానికి కూడా తెలంగాణా ప్రత్యేక అభివృద్ధి పథకం కొరకు మరొక రు. 9 కోట్లు కేటాయించ బడినాయి.

అష్టసూత్ర ప్రణాళిక క్రింద, అభివృద్ధి కార్యక్రమాల అమలును సమీక్ష చేసేందుకూ, అవసరమైన ముఖ్య విషయాలను గురించి రాష్ట్ర ప్రభుత్వానికి సలహా ఇచ్చేందుకూ రెండు ముఖ్య కమిటీలు ఏర్పాటు చేయబడినాయి. ఈ కమిటీలు ఇవి:–

1. ముఖ్యమంత్రి అధ్యక్షతన మంత్రుల స్థాయిలో ఉన్నతాధికార సంఘం

2. ప్లానింగు కమిషన్ సలహా దారుడు అధ్యక్షుడుగా అధికార స్థాయిలో ప్రణాళికా ఆచరణ సంఘం.

ఈ రెండు సంఘాలు తరచుగా సమావేశాలు జరిపి, జరిగిన ప్రగతిని సమీక్ష చేశాయి. అంతేకాకుండా ఇవి తెలంగాణా యొక్క దీర్ఘకాలిక ప్రణాళికలు రూపొందించేందుకు అనేక సిఫార్సులు కూడా చేసినాయి.

తెలంగాణాలో అభివృద్ధి

గత సంవత్సర కాలంలో తెలంగాణాలో గణనీయమైన అభివృద్ధి జరిగిందనీ రాష్ట్ర సగటు ఖర్చుకంటే తెలంగాణాలో హెచ్చు మొత్తం ఖర్చుపెట్టబడిందనీ ఈ సమీక్షవల్ల ద్యోతకమవుతున్నది. ముఖ్య రంగాలలో భౌతిక లక్ష్యాల విషయంలో కూడా, ప్రగతి సంతృప్తికరంగా వున్నదని కనుగొనబడింది. 1969–70 సంవత్సరంలో గ్రామీణ విద్యుత్ కార్యక్రమ విషయంలో, భారీ యెత్తున పనులు జరిగినాయి. ఈ సంవత్సర కాలంలో 817 గ్రామాలకు విద్యుచ్ఛక్తి సరఫరా చేయడం జరిగింది. ఈ ప్రకారంగా తెలంగాణాలో విద్యుత్ సౌకర్యం గల గ్రామాల శాతం 25 కు దాటిపోయింది. తెలంగాణా ప్రాంతంలో పంచాయతీ రాజ్ సంస్థలు 270 కి. మీ. రోడ్లు, 384 కి. మీ. కచ్చా రోడ్లు నిర్మించ బడినాయి.

నీటి పారుదల, గ్రామీణ నీటి పారుదల, పశుపతి, కమ్యూనికేషనుల వంటి ముఖ్యమైన రంగాలలో స్వల్పకాలిక అభివృద్ధి పథకాల కార్యక్రమం చేపట్టబడింది. అంతేకాకుండా తెలంగాణా అభివృద్ధికి దీర్ఘకాలిక బృహత్తర ప్రణాళిక కూడా రూపొందించ బడింది.

వాంఛూ సంఘం

రాష్ట్రంలో సబార్డినేటు సర్వీసులకు అభ్యర్థులను నియమించే విషయంలో ప్రత్యక్ష రిక్రూట్మెంటు వికేంద్రీకరణ చేయాలని వాంఛూ కమిటీ కొన్ని సిఫార్సులు చేసింది. రాష్ట్ర ప్రభుత్వం ఆంధ్ర ప్రదేశ్ ప్రాంతీయసంఘంతో సంప్రదించి, విషయాన్ని పరిశీలిస్తున్నది.

వాంఛూ కమిటీ నివేదిక అందడానికి ముందుగానే యల్. డి. సి. లు, టైపిస్టులు మున్నగు గ్రూపు IV సర్వీసుల విషయంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యక్ష రిక్రూట్మెంటును వికేంద్రీకరణ చేసింది. అంతకుముందు ఈ బాధ్యత ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీసు కమిషను అధ్వర్యంలో వుండింది. ఇప్పుడు జిల్లా కలెక్టర్లు ఈ కార్య భారాన్ని నిర్వహిస్తున్నారు. ఈ పద్ధతివల్ల స్థానిక ఎంప్లాయ్‌మెంటు ఎక్చేంజీలలో రిజిస్టరైన స్థానిక అభ్యర్థులకు ఉద్యోగాలు లభించే అవకాశం ఏర్పడింది. దీనివల్లే తెలంగాణా ప్రాంతంలో అనేక మంది స్థానిక అభ్యర్థులకు ఉద్యోగాలు లభించడం సాధ్యమైంది.

సర్వీసులు

యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఛైర్మన్ అధ్యక్షతన ఏర్పాటు చేయబడిన కేంద్ర సలహా సంఘం హైదరాబాదును సందర్శించి వివిధ వర్గాలకు చెందిన గజిటెడు ఆఫీసర్ల కష్ట నిష్ఠూరాలను పరిశీలించి, కేంద్ర దేశీయాంగ మంత్రిత్వశాఖకు తగిన సిఫార్సులు చేసింది. 876 మంది గజిటెడ్ ఆఫీసర్లు కేంద్ర సలహా సంఘానికి, 2725 మంది నాన్ గజిటెడ్ ఆఫీసర్లు రాష్ట్ర సలహా సంఘానికే అర్జీలు పెట్టుకొన్నారు. కేంద్ర సలహా సంఘం చేసిన సిఫార్సుల ఆధారంగా ఇంతవరకు 835 మంది గజిటెడ్ ఆఫీసర్ల విషయంలో కేంద్రప్రభుత్వం తీసుకొన్న నిర్ణయాలు రాష్ట్రప్రభుత్వానికి అందినాయి. రాష్ట్ర సలహా సంఘం చేసిన సిఫార్సుల ఆధారంగా కేంద్రం 2722 మంది నాన్ గజిటెడ్ ఆఫీసర్ల విషయంలో తీసుకొన్న నిర్ణయాలు కూడా రాష్ట్రప్రభుత్వానికి అందినాయి. భారత ప్రభుత్వ నిర్ణయాలను వెంటనే అమలు పరచవలసిందని రాష్ట్ర ప్రభుత్వం సెక్రటేరియట్‌లో తత్సంబంధమైన పరిపాలనా శాఖలకు ఉత్తర్వులు జారీ చేసింది.

భారత ప్రభుత్వంలోని జాయింట్ సెక్రటరీల జట్టు ఒకటి ఇంతవరకు హైదరాబాదును 5 పర్యాయాలు దర్శించి రాష్ట్ర ప్రభుత్వ సీనియర్ ఉద్యోగులతో చర్చలు జరిపిన పిమ్మట, భారత ప్రభుత్వ నిర్ణయాలను అమలు పరచే విషయంలో కొన్ని సలహాలు ఇచ్చింది. నివేదికలు తెప్పించి తరచుగా సమావేశాలు ఏర్పాటుచేసి నిర్ణయాల అమలు విషయంలో జరుగుతున్న ప్రగతిని సమీక్ష చేయడం జరుగుతున్నది.

ఉమ్మడి గ్రేడేషన్ జాబితాలు

రాష్ట్రంలో 3612 మంది గజిటెడ్ ఆఫీసర్లకు 16180 మంది నాన్ గజిటెడ్ ఆఫీసర్లకు సంబంధించిన అంతిమ గ్రేడేషన్ జాబితాలు ఇదివరకే ప్రచురించడం జరిగింది. 2390 మంది గజిటెడ్ ఆఫీసర్లు, 16097 మంది నాన్‌గజిటెడ్ ఆఫీసర్ల విషయంలో ఈ జాబితాలు తయారైనాయి. మిగిలిన 1222 మంది గజిటెడ్ ఆఫీసర్లు, 83 మంది నాన్ గజిటెడ్ ఆఫీసర్ల విషయంలో అంతిమ నిర్ణయం తీసుకోబడుతుంది.

ప్రాంతీయ సంఘం అధికారాల విస్తరణ

మరొక ముఖ్యవిషయ మేమంటే తెలంగాణా ప్రాంతీయ సంఘం అధికారాలు విస్తరించ బడినాయి. 1958 సం॥ ఆంధ్రప్రదేశ్ ప్రాంతీయ సంఘపు ఉత్తర్వును సవరించడం ద్వారా, ప్రాంతీయ అంశాల జాబితాలో యూనివర్శిటీ విద్య, మధ్యతరహా, భారీపరిశ్రమలు, సబార్డినేట్ సర్వీసులకు రిక్రూట్మెంటు నియమావళి రూపొందించడం, తెలంగాణా ప్రజలకు తగిన ఉద్యోగావకాశాలు కల్పించడం వంటి విషయాలు చేర్చబడినాయి.

ప్రాంతీయ సంఘం ఉత్తర్వు యొక్క విస్తృతాధికారాలలో మరొక ముఖ్యనిబంధన చేర్చుకోబడింది. ఈ నిబంధన ప్రకారం తెలంగాణా ప్రాంతానికి సంబంధించి నంతవరకు ఆదాయ వ్యయాల విషయంలో వార్షిక బడ్జెటుపైన ప్రత్యేక చర్చలు జరప డానికి ఈ సంఘానికి అధికారం సంక్రమించింది. వార్షిక ఆర్థిక నివేదికలో ఆంధ్ర తెలంగాణా ప్రాంతాలకు అంకెల వివరాలు వేరువేరుగా చూపబడుతాయి. ఈ విషయాన్ని దృష్టిలో పెట్టుకొని 1970 జూలై-ఆగస్టులో జరిగిన శాసన సభా సమావేశంలో తొలిసారిగా ఆంధ్ర తెలంగాణా ప్రాంతాలకు సంబంధించిన బడ్జెటు డిమాండ్లు, అనుబంధ అంచనాలు వివరంగా విడివిడిగా పేర్కొనడం జరిగింది.

తెలంగాణా ప్రాంతీయ సంఘం చట్టబద్ధమైన అధికారాలు విస్తరించ బడినాయి. తత్ఫలితంగా, ఈ ప్రాంతం అభివృద్ధికి ప్రణాళికలు రూపొందించే విషయంలో ఈ సంఘానికి విశేషాధికారం వుంటుంది.

తెలంగాణా సర్వతోముఖాభివృద్ధికి ప్రధానమంత్రి అష్టసూత్ర ప్రణాళిక ఇతోధికంగా తోడ్పడుతుంది. పథకాల అమలు విషయంలో తెలంగాణా ప్రాంతం ప్రజలు హృదయ పూర్వకంగా సహకరించి సహాయపడినపుడు ఆశించిన అభివృద్ధిని సాధించడం సుళువుతరమవుతుంది.

సమైక్యత ద్వారా సంపూర్ణ వికాసం

గాంధీజీ — సహకారోద్యమం

ఆర్. వి. రా

సహకార నిరాకరణోద్యమ నాయకుడైన గాంధీజీ, సహకార సిద్ధాంతములను ప్రబోధించుట విచిత్రముగా కనుపించవచ్చును. దీనిపై ప్రసంగించుచు, యీ ఉద్యమమును పరస్పర సహకారమునకై మొదలు పెట్టవలసి వచ్చెనని వారు చెప్పిరి. సహకారము అహింసా సిద్ధాంతముమీద ఆధారపడ వలయునని జెప్పిరి. హింసా సహకార ప్రవృత్తే లేదని వారు సెలవిచ్చిరి. సహకార ఉద్యమ సిద్ధాంతములకు వారు పునాది వేసిరని వేరే చెప్పనక్కరలేదు.

చేతితో దారమును దీయు ఉద్యమమును సహకార సిద్ధాంతములద్వారా అభివృద్ధిచేయుటకు ప్రయత్నము చేయుచున్నానని వారు త్రిప్లికేనులో ఉపన్యసించుచు చెప్పిరి. సహకార సిద్ధాంతములకు వారు చాల విలువ నిచ్చిరి.

నీటి చుక్కలు విడిగా యింకిపోవచ్చును. కాని సహకారముతో, సముద్రమును చేయుచున్నవని వారు చెప్పిరి. కండ్లు, చేతులు పరస్పర సహకార భావముతో పనిచేయ వలయునని, ఎంత స్వయం సహాయ సిద్ధాంతము మనము అవలంభించినా, పరస్పర సహకార మవుసరమని తెలిపిరి.

సంఘములో వ్యక్తికి ముఖ్యస్థానమున్నదని వారి వాదన. సంఘమునకు వ్యక్తి సేవ చేయవలయునన్న, వ్యక్తిగత స్వాతంత్ర్యము అవుసరము. సంఘముయొక్క అభివృద్ధికై, తన యిష్టానుసారము వ్యక్తి స్వాతంత్ర్యమును విడనాడ వచ్చునన్నారు. కాని, సంఘములోనే వ్యక్తి అభివృద్ధి నొందగలడని, సంఘముతో మధురత్వము గలదని. సంఘము, జాతి, మానవజాతి దేనిని తీసుకొన్నను అందరు మనుజులు సహకార వాదులేనని, సహకారములో మనుజులు జీవించ వలయునని, ప్రజా సముదాయపు అభివృద్ధికి తోడ్పడవలయునని జెప్పిరి.

సహకారము సంఘశ్రేయోభి వృద్ధికి ఎంతయో తోడ్పడ గలదని గాంధీజీ అభిప్రాయము. 1917 లో బొంబాయిలో జరిగిన సహకార సమావేశంలో మాట్లాడుచు, తనకు సహకారమన్ననేమియు తెలియకున్నను, సహకారభావము దిగ్విజయముగా జరుగుటకు ఏలక్షణములుండ వలయునో వారికి బాగా దెలియునని యీ క్రింది ఉపన్యాసము ద్వారా తెలియజేసిరి.



సహకారోద్యమము నైతిక విలువలపై ఆధారపడవలయును. దీనిని నడపు మనుజులు మతో(ద్రేక)ముపలె సహకార దీక్ష కలిగినవారై యుండవలయును. అనాడే దీని ఫలితములను ప్రజలు పొందగలరు. తక్కువ వడ్డీలపై ఋణములు లభించినా, ప్రజలలో నైతిక విలువ లేకపోయినా లాభములేదు. ప్రజలలో భౌతిక వికాసమున్న నైతిక విలువ పెరిగిన దనుకొనెదము. దేశమున కెంతయో సేవ చేయవలసియున్న ఈ ఉద్యమమును చవుకగా అప్పునిచ్చుటకు మాత్రమే ఉపయోగించరాదు. భారత దేశపు సహకార సంఘ రిపోర్టులో నిజమగు సహకారము, సహకార విలువలను గాపాడగలదని, ప్రజల అభివృద్ధికి తోడ్పడగలదని, డాబుసరి సహకార మండపము దేశమున కెట్టి సేవ చేయలేదని వ్రాసిరి. అది నిజమే. ఈ ఉద్యమముయొక్క ఫలితములు, సంఘముల సంఖ్యపై గాక, సహకార వాదుల నైతికస్థితిపై ఆధారపడియుండును. అధికారులు నేటి సంఘముల నైతికాభివృద్ధికి తోడ్పడవలయును. సంఘముల నైతిక జయమునకు హెచ్చు విలువ నీయవలయును. తదనంతరము సంఘముల సంఖ్యను బెంచవచ్చును. సేవాధర్మము ముఖ్యముగా బాటించి, తక్కువ వడ్డీలపై, నిజాయతీపరులకు ఋణముల నీయవలయును.

కాంగ్రెసు వారులు స్వాతంత్ర్య సముపార్జన తరువాత యీ పద్ధతుల నవలంభించినచో సహకారోద్యమము నిజమగు అభివృద్ధి చూపెడిది. స్వలాభాపేక్షా పరులకు విలువ యుండెడిది కాదు. పరపతి, ప్రపంచములో ధనాధికారములోనికి మారినదని దానికి నైతిక విలువలేదని గాంధీజీ చెప్పిరి.

గాంధేయ నిర్మాణ కార్యక్రమములో 18 సూత్రములుండెను. ఇందు సహకార సంఘము స్థాపించుట ఒక కార్యక్రమము. నిర్మాణ కార్యక్రమములోనున్న వారు, సత్యాగ్రహము. లేక యితర రాజకీయ ఉద్యమములో నుండుటకు గాంధీజీ ఒప్పుకొనలేదు. వి.ఎల్. మెహతా, రామదాసు పంతులు కేలప్పన్ గారలు దీనికి నుదాహరణలు. ఒకసారి గాంధీజీ కేలప్పన్ గారిని గురించి యిట్లువ్రాసిరి. “కేరళలో సహకారోద్యమము ప్రజల అభిమానమును బొందుచున్నదని కేలప్పన్ గారు నాకు తెలియజేసిరి. సంఘములు నిజముగా ఆదర్శప్రాయముగా నున్నచో యిది హృదయానందకరమైనవార్త. నాకు కొన్ని సందేహములు లేక పోలేదు. సభ్యులు నిజాయతీ పరులై, సహకారముయొక్క లాభముల గురించి, ఒక జీవితలక్ష్యమును సాధించవలయును. ధనము నప్పుగానిచ్చి హెచ్చు వడ్డీ సంపాదించుట మంచి లక్షణముకాదు. జాతీయ లక్ష్యముల సాధించుటకు సహకార సేద్యము పాల సరఫరా ఎంతయో తోడ్పడును. ఇంకను ఎన్నియో ఉదాహరణల నీయవచ్చును. కేరళలో నిజాయితీ పరులైన పనితెలిసిన ఇనస్పెక్టర్లు ఉన్నారా? ఇటువంటి ఉద్యమములు విఫలమగుటకు ముఖ్యముగా రెండుకారణము లున్నవి. (1) ఒకలక్ష్యము లేకుండుట (2) నిజాయతీ పరులైన నిర్వహణాధికారులు లేకపోవుట”

గాంధీజీ, సాధింపవలసిన లక్ష్యములకు మిగుల ప్రాముఖ్యత నిచ్చిరి. వ్యక్తుల భౌతికాభివృద్ధికి కాక నైతికాభివృద్ధికి గొప్ప ప్రాముఖ్యత నిచ్చిరి. సహకార సంఘముద్వారా పరపతికి వారు అంత ప్రాముఖ్యత నీయలేదు. అన్నిటికంటె న్యాయపరులైన పరిపాలకు, నిజాయతీ పరులైన ఇనస్పెక్టర్లకు ఎక్కువ ప్రాముఖ్యత నిచ్చిరి. నైతిక విలువకు స్థానములేని పరపతి మంచిది కాదనిరి. హెచ్చు వడ్డీపై అప్పులు పుచ్చుకొన్న అనేక కుటుంబములు నశించెనని వారు చెప్పిరి.

పేదవారు సహకార సంఘములనుండి లాభములు పొందకుండుట చూచి ఆయన చాల విచారించిరి. ఆధికారులు సలాయించుటకు సహకార సంఘములను వినియోగింపరాదని, సేవలేనిదే సహకారములేదని ఆయన చెప్పిరి.

భారతదేశ స్వాతంత్ర్య ప్రాప్తికి ముందు దేశములో 1,50,000 సహకార సంఘములుండెడివి. ఇప్పుడు దేశములో 3,80,000 సహకార సంఘములు గలవు. వ్యక్తిగత స్వాతంత్ర్యమునకు గాంధీజీ పాటుపడిరి. ఇచ్ఛాపూర్వకముగా సభ్యులగుట చాల ముఖ్యమని, ఏ వ్యక్తినీ సహకార సంఘములో చేరమని బలవంతము చేయరాదని వారనిరి.

సహకార సాగుబడి సంఘములవలన సభ్యులకు ఖర్చులు తగ్గి భూమియొక్క ఉత్పాదన శక్తిపెరిగి, తద్వారా పేదరికమును, సోమరి పోతుతనమును పోవుననిరి. గాంధీ పలు సహకార సూత్రముల ప్రబోధించిరి. సహకార సంస్థలు గాంధేయ సూత్రముల ననుసరించినచో ఎంతో బాగుండును.

ప్రజలకు రోజంతా పని కలిగించాలని గాంధీజీ ఉద్దేశ్యము. సోమరితనముతో గడపబడుచున్న గంటలను ధనముగా మార్చాలి. కుటీర పరిశ్రమలే మనకు శరణ్యమని, సహకార సిద్ధాంతముపై వాటి నభివృద్ధి చేయవలెనని వారి వాదన. సహకార సంఘముల స్థాపనలో యీ సిద్ధాంతములను మనము పాటించిన ఎంతో బాగుండెడిది.

గాంధేయ సిద్ధాంతములు మన గుండెలను గూడ కరగించును. వారి సిద్ధాంతము ఏ ఒక్క దేశమునకు మాత్రమే వర్తింపదు. ప్రపంచమున కంతకు వర్తించును. Frederic Nicholson చెప్పినట్లు, సహకారమునకు ముఖ్యావసరములు శీలము, ఉద్రిక్తత, విజ్ఞానము. గాంధీజీలో ఇవన్నియు వుండుటయేగాక, వారు పేదవారి అభివృద్ధికి తోడ్పడి ధనవంతులు ప్రజల ధనమునకు ధర్మకర్తలని చెప్పుచుండిరి. wolff చెప్పినట్లు ఆర్థిక దృష్టితో నేగాక, నైతిక దృష్టితోగూడ మనము సహకార సిద్ధాంతముల నమలులో పెట్టవలయును. ప్రజల కోరికలను దీర్చి వారిలో సౌభ్రాతృత్వమును, పరస్పర సంబంధములను నెలకొల్పవలయునని వారు చెప్పిరి. ధనికులు స్వలాభము కొరకై గాక సేవకై రావలయును. ఇది గాంధేయన సిద్ధాంతమే.

ఆంధ్ర ప్రదేశ్ లో సహకారోద్యమం

మన రాష్ట్రములో గొప్పగొప్ప సహకార నాయకులుద్భవించిరి. రామదాసు పంతులు, మోచర్ల రామచంద్రరావు

మొదలగువారు ఈ ఉద్యమమునకు ఎంతో సేవచేసిరి. వివిధ రంగములలో మన రాష్ట్రములో యీ ఉద్యమము ముందంజ వేయుచున్నది. పేద రైతుకు, పేదవారికి, వెనుకబడ్డ వారికి, ఉపయోగపడే అనేక పద్ధతులు యిచ్చట అమలు జరుపబడుచున్నవి. 4వ ప్రణాళికా కాలములో 400 జాయింటు (ఉమ్మడి) సేద్యపు సహకార సంఘములు స్థాపింపబడును. వీటికి 25 లక్షల రూపాయలు ఖర్చు పెట్టబడును. 3వ ప్రణాళికా కాలములోనే, యీ విషయములో ప్రభుత్వము శ్రద్ధతీసుకొనెను. వాటివలన ఆహారోత్పత్తి పెరుగుటయేగాక, భూవసతి లేని వ్యవసాయ కార్మికులకు, సన్నకారు రైతులకు ఎంతో లాభకారి అగును. ఇప్పుడున్న 629 సేద్యపు సహకార సంఘములలో 318 ఉమ్మడి సహకార సంఘములు అయియున్నవి. ఇవి దివిసీమ, కోనసీమలలో పనిచేయుచున్నవి. 28,000 సభ్యులు వాటి లాభములను పొందుచున్నారు. రూ 12 లక్షల షేరు ధనము వారివద్ద వున్నది. 1969, 30 జూను వరకు 52,000 ఎకరముల భూమి వీటిద్వారా సాగులవుచున్నది. ప్రభుత్వము 38 లక్షల రూపాయల ధనసహాయము వాటికి యిచ్చినది. ఈ సహకార సంఘములు 2000 ఎకరములకు పైగా, క్రొత్తగా సాగు చేసిరి. గ్రామసీమల ప్రజలకు, వీటివలన లాభములు వచ్చెను. వీటిని చిరస్థాయిగా రూపొందించుటకు మన ప్రభుత్వమువారు ఎంతో ఉత్సాహము చూపుచున్నారు. భూమిలేని కర్షకులకు, వ్యవసాయ కార్మికులకు వీటి వలన ఎంతో లాభము రాగలదు.

గాంధీజీ కూడ యీ విషయముపై 5-2-1942 తారీఖున ప్రచురింపబడిన హరిజన పత్రికలో, వారి అభిప్రాయములను తేటతెల్లముచేసిరి. సహకారరంగమువైపు, ప్రపంచము యీనాడు మరలుచున్నదని, మన జనసంఖ్య విపరీతముగా పెరుగుచున్న సరాసరి కర్షకుడు సాగుచేయుచున్న భూమి విస్తీర్ణము, దినదినము తగ్గుచున్నదని, పశువుల అభివృద్ధికి యిది ఎంతో తోడ్పడగలదని సూచించిరి.


పశువుల అభివృద్ధి విషయములో కూడ సహకార ఉమ్మడి సేద్యపు సంఘములు ఎంతో సేవచేయగలవని, వాటికి 'తెగుళ్ళు' వచ్చినప్పుడు కూడ, అందరు కలసి తెగుళ్ళ నివారించుకొనవచ్చునని, వ్యక్తిగతముగ వ్యవసాయదారుడు యీ పని చేయజాలడని గాంధీ చెప్పెను. అంతేకాక సామాజిక పచ్చిక బయిళ్ళ యొక్క ప్రాముఖ్యత గురించి వ్రాయుచు, సహకార సమిష్టి వ్యవసాయములో యిట్టి సౌకర్యములకు వీలున్నదనిరి. ఉత్పత్తయిన పాలు కూడ, కల్తీచేయకుండ మంచి ధరలకు అమ్మగలరని వారు అభిప్రాయపడిరి. గ్రామసీమలలోని పశువుల ఆరోగ్యము సహకార విధానములోనే కాపాడగలమనిరి. వాటినిబట్టి సహకార సేద్యపు సంఘములు, పశువుల సహకారాభివృద్ధికి ఎంతో తోడ్పడగలవనిరి. వ్యక్తిగత స్వాతంత్ర్యము, పశువుల, వ్యక్తిగత నష్టమునకు మాత్రమే తోడ్పడగలుగుననిరి. సంఘములో యీ ముఖ్య మార్పు ఎంతత్వరితముగా వచ్చిన అంత మంచిదని వారు చెప్పిరి. "సహకార సేద్యము చేసినగాని, వ్యవసాయముయొక్క పూర్తి లాభములు పొందజాలము" అని గాంధీజీ అనిరి. 106 కుటుంబములు కలసి, ఒక గ్రామములో సమిష్టి వ్యవసాయము చేసినచో, వచ్చిన ఆదాయము పంచుకొనవచ్చునని, భూమిని ముక్కలుగా వ్యవసాయము చేసినచో అట్టి లాభములు రావని వారు వక్కాణించిరి. వక్కాణించిరి, వక్కసారిగా ప్రజలను యీ మార్గములోనికి మార్చుట చాలకష్టమని, తిన్నగా, సన్నని మార్గము నుండి నడచుట సులభసాధ్యము కాదని, వ్యక్తిగతముగా ఏది సాధింపజాలమని సహకారము ద్వారా స్వాతంత్ర్యము నిలబెట్టుకొనవచ్చునని, పశువుల అభివృద్ధికూడ దీని ద్వారా జరుగవచ్చునని గాంధీజీ చెప్పియున్నారు.

వ్యక్తిత్వమును పుష్పింపచేయుట గాంధీజీకి ముఖ్య విషయము. ప్రభుత్వాధికారము హెచ్చయిన, వ్యక్తిగతాభివృద్ధికి భంగమని గాంధీజీ చెప్పిరి. ఇదియే అభివృద్ధికి వేరు వంటిది. అధిక భాగమునకెల్లప్పుడు లొంగియుండనక్కరలేదని జెప్పిరి. ఈ శత వార్షిక సమయములో గాంధేయ సిద్ధాంతముల మనము సమగ్రముగా బరించి, వాటి నమలులో పెట్టి దేశపు ఆర్థిక, సాంఘిక, నైతికాభివృద్ధికి తోడ్పడిన ఎంతో బాగుండును. భౌతిక వికాసము కొరకై మన శక్తుల కేంద్రీకరించుట కూడరాని పని. మనిషి రొట్టె కొరకై మాత్రమే జీవించడు.


హరిజనులకు ఇండ్లస్థలాలు

హరిజనుల శ్రేయస్సుకొరకై రాష్ట్రప్రభుత్వం అనేక చర్యలు తీసుకొంటున్నది. అయితే హరిజనులకు ఇండ్ల స్థలాలు కేటాయించడానికి ప్రభుత్వం చేస్తున్న కృషిని ప్రత్యేకంగా పేర్కొనాలి. గ్రామాలలో హరిజనులు యెదుర్కొంటున్న అతి ప్రధాన సమస్యలలో ఇండ్ల సమస్య ఒకటి. అందుకని ప్రభుత్వం ఈ సమస్య పట్ల ప్రత్యేక శ్రద్ధవహిస్తున్నది. ఇందుకొరకై భూమిస్వాధీనం పనులను చురుకుగా పూర్తి చేసి పట్టాలు కేటాయించడానికి ప్రత్యేక చర్యలు తీసుకోవడం జరుగుతున్నది. ఈకార్యక్రమాలకై 1967-68 సంవత్సరంలో మొత్తం రూ 14.87 లక్షలు మాత్రమే ఖర్చుకాగా 1968-69 సంవత్సరంలో రు. 37 లక్షలకు పైగా ఖర్చు పెట్టడం జరిగింది. 1969-70 లో రు 41.67 లక్షలు ఖర్చు అయినాయి. వర్తమాన సంవత్సరం లో సుమారు ఒక కోటి రూపాయిలు కేటాయించడం జరిగింది. ఈ సమస్య అత్యంత ప్రాధాన్యత వహిస్తున్న కారణంగా అవసరమైతే, ఇంకా యెక్కువడబ్బు ఖర్చు చేయడానికి ప్రభుత్వం సంకల్పిస్తున్నది. హరిజనులకు ఇండ్ల స్థలాల కేటాయింపుకై ఈ సంవత్సరాంతంవరకు మొత్తం రూ 2.5 కోట్లకు పైగానే ఖర్చు అవుతుంది. ఈ సంవత్సరం ముగిసే లోపల ఒకలక్ష ఇండ్ల స్థలాలు హరిజనులకు కేటాయించబడుతుందని అంచనా వేయబడుతున్నది.









హైదరాబాదులో జలప్రళయం


అపార జననష్టం: ఆస్తినష్టం

సెప్టెంబరు 21 వ తేదీ రాత్రి హైదరాబాదును కబళించ డానికి వరుణుడు పన్నిన మాయాజాలంలా విపరీతమైన వర్షం. హైదరాబాదులో జలప్రళయం!


ఇటీవలి కాలంలో కనీ వినీ యెరుగని వర్షం; ఊహించరాని నష్టం. అపారమైన ప్రాణనష్టం; ఆస్తినష్టం. నగర చరిత్రలో మరపురానిఒక విషాదఘట్టం.

ముఖ్య మంత్రి పరిశీలన

అధికారులు హుటా హుటి రంగంలో దిగి పనిచేశారు. స్వచ్ఛంద సేవా సంస్థలు నడుంకట్టి పనిచేశాయి. ముఖ్యమంత్రి, యితర మంత్రులూ దెబ్బతగిలిన ప్రాంతాలను పరిశీలించి సహాయక కార్యక్రమాలు పర్యవేక్షించారు.







మంత్రివర్గ సమావేశం


సెప్టెంబరు 24 వ తేదీ మంత్రివర్గ సమావేశంలో నగరం లోని మురుగునీటి పారుదల విషయాలను పరిశీలించి, మళ్ళీ అధిక వర్షాలవల్ల యిటువంటి నష్టాలు జరుగకుండా నివారించడానికి తీసుకోవలసిన చర్యలను గురించి సిఫార్సు చేయడానికి ఒక కమిటీని నియమించారు.


సభ్యులు మునిసిపల్ కార్పొరేషన్ స్పెషల్ ఆఫీసరు, శ్రీ ఎ ఆర్ సత్యనారాయణ, రోడ్లు భవనాల చీఫ్ ఇంజనీరు, శ్రీ టి. యస్. స్వామి, పబ్లిక్ హెల్త్ చీఫ్ ఇంజనీరు.

బాధితులకు సహాయం

కూలిపోయిన, లేక నష్టపడిన గుడిశెలకు రు. 100 ల వంతున, పెంకుటిళ్ళకు రు. 200 ల వంతున ధన సహాయం చేయబడింది మరణించిన వారి కుటుంబ సభ్యులకు, ఆయా పరిస్థితులనుబట్టి, ధనరూపంలో గ్రాంట్లుకూడా యిచ్చారు నష్టం ప్రత్యక్షంగా పరిశీలించడానికి కేంద్ర ప్రభుత్వ అధికారుల బృందం హైదరాబాదు సందర్శించారు







బోధనా భాషగా తెలుగు

పండ్రంగి రాజేశ్వరరావు

దేశానికి స్వతంత్ర్యం వచ్చి ఇరువది మూడేళ్ళు. ఆంధ్రరాష్ట్రం సిద్ధించి పదహారేళ్ళు, ఆంధ్రప్రదేశ్ అవతరించి పదునాలుగేళ్ళు అయినా ఇంగ్లీషుపై మోజు తగ్గలేదు. ఈ సందర్భంలో డాక్టరు పట్టాభి సీతారామయ్యగారి ఛలోక్తి "సానిని వదల్చుకోటం కష్టం అందులోను ఇంగ్లీషు దొరసాని ఒక పట్టాన వదలదు," గుర్తుకు వస్తోంది. 'యూరపియన్ పిశాచాలన్నింటిలోను ఇంగ్లీషు పిశాచం మహా చెడ్డది, అని ఆంధ్రరత్న దుగ్గిరాల గోపాలకృష్ణయ్యగారి సూక్తి. మనకు స్వతంత్ర్యం వచ్చేనాటికి అవిభక్త మదరాసు రాష్ట్ర గవర్నరుగా నున్న సర్. ఆర్చిబాల్డ్ నై 'ఇంగ్లీషు వునికికి రాజ్యాంగరీత్యా పది సంవత్సరాలు గడువు ఇవ్వటం ప్రమాదం. యీలోగా ఇంగ్లీషు తాడు బారుతుంది' అన్నారు. మన రాజ్యాంగాన్ని సహితం ఇంగ్లీషులో రూపొందించటం పెద్ద తప్పు అని రాజ్యాంగ నిర్ణయసభ అధ్యక్షులైన డా. రాజేంద్రప్రసాదు హెచ్చరించారు.

పాలక భాషలు

కాని క్లిష్ట పరిస్థితులలో దేశానికి సారథ్యం వహించిన నాయకులంతా ఆంగ్ల భాషాభిమానులగుటచేత హెచ్చరికలన్నీ అరణ్యరోదనమైనాయి. ఇంగ్లీషు వాళ్ళుగాక ఫ్రెంచివారో, పోర్చుగీసు వాళ్ళో, డచ్చివాళ్ళో మన దేశాన్ని పాలించి వెళ్ళిపోతే వాళ్ళ భాషలు చిరస్థాయిగా వుండాలని మన విద్యాధికులు కోరేవారు. మహమ్మదీయుల హయాములో ప్రభుత్వాదరమును పొందిన పారసీ భాష బ్రిటీషు ప్రభుత్వము వచ్చాక సహితం కొన్ని దశాబ్దాలు యథాతథంగా వుంది. చారిత్రిక సత్యాలను కాదనలేము. కాని అల్ప సంఖ్యాకులైన పాలకుల భాష చిరస్థాయిగా వుండజాలదు. లోగడ హైదరాబాదు సంస్థానాధీశుడైన మాజీ నిజాము ప్రాథమిక స్థాయినుంచి విశ్వవిద్యాలయ స్థాయి దాకా వుర్దూను బోధనా భాషగా చేసినా ప్రజలకు స్వతంత్రం రాగానే ప్రజల మాతృ భాషలు ఆస్థానాన్ని ఆక్రమించాయి.

తల్లి పాలే శ్రేష్ఠం

అన్ని రకాల పాలు శ్రేష్ఠమైనా అవి తల్లిపాలకు సాటిరావు. తల్లి పాలు లేనపుడు పోతపాలకు ఎగబడాలి. డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్‌గారు రష్యాలో మన రాయబారి ఇంగ్లీషులో తమ అధికార పత్రాలు సమర్పించగా అచటి విదేశ వ్యవహారాల శాఖవారు "మీకు దేశీయ భాష అనేది లేదా" అనగానే ఢిల్లీకి కేబిలు పంపి హుటాహుటిగా హిందీలో అధికార పత్రాలు తెప్పించారు. రెండు మూడు తరాలనుంచి మనం ఇంగ్లీషుతో కుస్తీ పడుతూన్నా నూటికి ఒక్కర్కి మాత్రమే అబ్బింది. అదైనా నిర్దుష్టమైనది కాదు. ఇటీవల ఒక హైస్కూలు విద్యార్థి కాంపోజిషన్‌లో is went అని వ్రాస్తే wented అని wenting అని! వుపాధ్యాయులు దిద్దారట. ఒక గృహస్థు పెళ్ళి చూపులకు వెళ్ళివచ్చి అమ్మాయి సంసారపక్షంగా వుందనే అభిప్రాయాన్ని, 'She is in the family way' అన్నారుట. ఈ ప్రయోగం ఎంత విపరీతార్థాన్ని యిస్తుందో వేరే చెప్పనక్కరలేదు. ఆంగ్ల భాషా కోవిదులైన రైటు ఆనరబుల్ శ్రీనివాస శాస్త్రిగారు సహితము తాము తరుచు వెబ్‌స్టరు నిఘంటువును చూడవలసి వచ్చేదన్నారు. భారతకాలంనాటికి ఇంగ్లీషు బెస్తలు మాట్లాడే పల్లెభాష. ఇందులో కింగ్సు ఇంగ్లీషు, బెలింగేటు, పిడ్గిన్ తరహా ఇంగ్లీషు వున్నాయి. అమెరికా, ఆస్ట్రేలియా, ఆఫ్రికాలలో మరోవిధంగా రూపొందుతోంది. ఇతర భాషలలోంచి పదాలను స్వీకరించి ఇంగ్లీషు పుష్టి చేకూర్చుకుంది.

హాలేన్ ఉవాచ

అయితే తెనుగు స్థితి ఏమిటి? దీనిని రాష్ట్రంలో నాల్గుకోట్లు బయట కోటిమంది అర్థంచేసుకుంటారు. హిందీ తర్వాత తెలుగే ఎక్కువ మందికి తెలుసు. హిందీలోవలె దీనికి మగధి, మైథిలి, భోజపూరి, వ్రజభాష, ఖడీబోలి, రాజస్థానీ, మార్వాడి ఆదిగాగల వుప భాషలు లేవు. యథార్థానికి తెలుగు ఎక్కువమంది ఒకే విధంగా వ్రాసి మాట్లాడే 'ఏకైక భాష.' ఇది దేశానికంతకు అనుసంధాన భాషగా వుండాలని ప్రముఖ విజ్ఞానవేత్త ఆచార్య జె. బి. యస్. హాల్డేను వక్కాణించారు. చరమ దశలో భారత పౌరసత్వాన్ని స్వీకరించిన పాశ్చాత్యులగుటచేత వీరికెవ్వరు పక్షపాతము అంటగట్టలేరు. వీరు తమ భౌతికకాయాన్ని కాకినాడ మెడికలు కాలేజీకి విరాళంగా యిచ్చి చరితార్థులైనారు.

ఇందుకు తోడు తెలుగుకు గల అర్హతలు అసంఖ్యాకము. వుత్తరాది భాషలకు చివరది, దక్షిణాది భాషలకు మొదటిది. ఉత్తర దక్షిణాలకు వారధి వంటిది. ఆ యా భాషలలో వున్న మంచిని పుణికి పుచ్చుకుని చెడ్డను విసర్జించింది. మరిన్ని సంస్కృతానికి సన్నిహితమైనది. దీనికి గల సరళ వ్యాకరణము, పద గుంభన, తీవి, మాధుర్యము మరే భాషకు లేదు. దీనిని

'Italian of the East' అని పాశ్చాత్యులు పొగడించారు. పరాయి భాషలోని పదాలను స్వీకరించి జీర్ణించుకొని స్వంతం చేసుకోగల శక్తి తెలుగు భాష సొమ్ము. వైద్య విజ్ఞాన సాంకేతిక విషయాలను బోధించడానికి తెలుగు అనువైనదని హాల్డేను ఉద్ఘాటించారు. దీని శబ్ద జాలము మృదువైనది. స్వర శాస్త్ర రీత్యా యిది నిర్దుష్టము. తమ తండ్రి సంస్కృత శ్లోకాలను తెలుగు లిపిలో వ్రాసుకుని మననం చేసుకునేవారని శ్రీ సి. రాజగోపాలాచారి చెప్పుకున్నారు. సంస్కృతం ప్రాకృతం, శౌరసేని ఆదిగాగల అష్ట భాషలలో స్థానంగల ఏకైక ప్రాంతీయ భాష ఆంధ్రమే అని గుర్తుంచుకోవాలి. తెలుగుకు సహజంగాగల అర్హతలను ఉగ్గడించటము సూర్యుణ్ణి ఆముదము దీపంతో చూపించగటం లాంటిది. కాని దురదృష్టవశాత్తు నేటి పరిస్థితులలో ఆ పని అనివార్యమవుతుంది.

ప్రభుత్వంతో సహకరించాలి

ఇంత కాలానికి తెలుగును అధికార భాషగాను, బోధనా భాషగాను పాలకులు అంగీకరించారంటే గర్వించి సహకరించాలి గాని వ్యతిరేకించటం దేశ ద్రోహమేకాక మాతృ ద్రోహము కూడాను. ఈ పనిని చేసేది ఇంగ్లీషు తెర వెనుక పొట్ట పోసుకునే స్వార్థపరులు మాత్రమే. ఇంగ్లీషులోంచి తెలుగులోకి మారటానికి కొన్ని ఇబ్బందులు, కష్టాలు తాత్కాలిక నష్టాలు వుండవచ్చును. వాటిని అధిగమించటం బుద్ధిమంతుల లక్షణం. ఈత నేర్చుకోవాలంటే చెరువులోకో కాల్వలోకో దూకాలి. కాని, చెంబులోను బిందెలోను నూతిలోను నేర్చుకోలేము కదా. తెలుగూ, ఇంగ్లీషూ సరిగా రానివారే తప్పుల తడక ఇంగ్లీషు వుండాలని కోరుకుంటున్నారు. ఇందువల్ల హాల్డేను అన్నట్లు విజ్ఞానంలోగాక అజ్ఞానంలో పోటీ ఏర్పడుతుంది. ("Competition in stupidity and not in ability"—Haldane). ఇందువల్ల పరాయి భాషల అధ్యయనం నిషిద్ధం అనుకోరాదు. ప్రతి వ్యక్తి యథా శక్తి యితర భాషలను అధ్యయనం చేయాలి. ఇది ఐచ్ఛికంగా జరగాలి గాని బలవంతం చేయరాదు. బలవంతం చేసినపుడు మమత నశిస్తుంది. నేడు మన విద్యార్థులు షేక్స్పియరు, షేల్లీ, కీట్సును ఏవగించుకోడానికి కారణం 'వారి రచనలు పాఠ్యాంశంలో నిర్బంధం చెయ్యటం చేతనే. చాలా మంది మూల గ్రంథాల్ని ముట్టకుండా గైడ్లు, నోట్సు చదివి కృతార్థులౌతున్నారు. వీరిని విద్యార్థులనటంకంటె పత్రార్థులనటం సహజం. స్వతంత్ర రచన యోచన, మాతృ భాషలో నడిచినట్లు పరాయి భాషలో నడువదు. నోబిలు బహుమతిని పొందిన 'గీతాంజలిని' శ్రీ రవీంద్రనాథ్ ఠాగూరు బెంగాలీలోనే వ్రాశారు. మాతృ భాష బోధనా భాష కానంత కాలము నిరక్షరాస్యత నిర్మూలము కాదు. మహాత్మా గాంధీ భాషా ప్రాతిపదికపై రాష్ట్రముల విభజనకు అంగీకరించటమునకు ప్రధాన కారణం విద్యా బోధ, పరిపాలనా మాతృభాషలో జరిగి అందరికీ విషయాలన్నీ చక్కగా తేట తెల్లమవుతాయనే. మాతృ భాషలో బోధన జరిగితే రామన్, రామానుజం, నార్లీకరు, ఖొరానాలాంటి విజ్ఞాన వేత్తలు పుష్కలంగా తయారవుతారని ఆ మధ్య ప్రముఖ విద్యావేత్త ఒకరు నిర్వచించారు. జపానువాళ్లు జపానుభాషలోను, జర్మనులు, ఫ్రెంచివారు, రష్యనులు తమస్వభాషలలో వున్నత విద్య నభ్యసిస్తూవుంటే మనం ఇంకా ఇంగ్లీషుని పట్టుకు వ్రేలాడుటలో అర్థం లేదు. ఇంగ్లీషుకుగల అంతర్జాతీయ ప్రాముఖ్యత వుండనే వుంటుంది. నూటికి తొంబది మంది స్వరాష్ట్రములోనే ఏదో విధంగా పొట్టపోసుకుంటారు. వారికి పరాయి భాషల అధ్యయనం వృథా వ్యయ ప్రయాస. పది మంది కోసము తొంబది మందిని వ్యయ ప్రయాసలకు గురి చేయుట న్యాయమూ కాదు, ప్రజాస్వామిక మంతకన్నా కాదు. ప్రజలనుండి తెలుగుకు వ్యతిరేకత, లేదు. ఎవరెంత అడ్డగించినా తెలుగు బోధనా భాషగాను, పరిపాలనా భాషగాను జగన్నాథ రథంలా చర చర ముందుకు పోక తప్పదు. అదే అందరకూ శ్రేయస్కరం.

తిరుపతిలో విమానాశ్రయం

తిరుపతిలో విమానాశ్రయ నిర్మాణానికి ప్రభుత్వం ఆమోదించింది. దీని నిర్మాణానికి రూ. 33,83,150లను కూడా ప్రభుత్వం మంజూరు చేసింది. దీనికి సంబంధించిన ప్రాజెక్టు నివేదిక కూడా పూర్తి అయింది. ప్రస్తుతం కేంద్ర పబ్లిక్ వర్క్సు శాఖ వారు ఈ విమానాశ్రయ నిర్మాణానికి సంబంధించిన సమగ్ర పథకాన్ని రూపొందిస్తున్నారు. దీనికి సంబంధించిన ఇతర లాంఛనాలన్నీ పూర్తి అయిన తర్వాత ఈ విమానాశ్రయ నిర్మాణం ప్రారంభమవుతుందని భావిస్తున్నారు. ఈ విమానాశ్రయం ఎప్పటి నుంచి పని చేయడం ప్రారంభిస్తుందో ఇప్పుడే చెప్పడం సాధ్యం కాదు. ఈ విషయాలను వినోద యాత్రలు, పౌర విమానశాఖ కేంద్ర మంత్రి డాక్టర్ కరణ్‌సింగ్ లోక సభలో శ్రీ దేవిందర్ సింగ్ గర్చా, శ్రీమతి భాయ్ జె. పటేల్‌ల ప్రశ్నలకు లిఖిత పూర్వకంగా సమాధానమిస్తూ వెల్లడించారు.



కోకా-కోలా సాంగత్యం బ్రతుకే ఒక సారస్యం

ఉమ్మడిగా తినటంలో ఉన్న మజాయే వేరు! దానికి కోకా-కోలా తోడైతే పసిడికి పరిమళమబ్బినట్లే! ఉల్లాసం, ఉత్తేజం కలిగించే సజీవమైన రుచి కోకా-కోలా రుచి. అందుకనే, త్రాగాలనిపిస్తుంది మళ్లీ మళ్లీ. త్రాగండి కోకా-కోలా—మళ్లీ కోకా-కోలా—మళ్లీ మళ్లీ కోకా-కోలా! ప్రపంచంలో నలుమూలలా, పెరిగిపోతోంది కోకా-కోలా త్రాగేవారి సంఖ్య రోజు రోజుకూ. కారణం: సేదదీర్చటంలో, కనివిని ఎరుగని కమ్మదనం కోకా-కోలా కమ్మదనం!

Enjoy Coca-Cola

CMCC 37-203 TEL

పరిపాలనా విషయాలు

జీతం రేట్ల సవరణ

అదనపు అర్హతలు గలవారికి హెచ్చు వేతనం

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం దిగువ పేర్కొన్న ఉద్యోగాల విషయంలో 1969 జూన్ నుంచి హెచ్చు జీతాలు, అడ్వాన్సు ఇంక్రిమెంట్లు మంజూరుచేసింది.

పి.డబ్ల్యు.డి.లో డి.సి.ఇ.డి యం. లేక డి.ఇ.ఇ. డిప్లొమా గల వారికి రూ. 200–12–320–16–400 స్కేలులో జీతం రూ. 236/–ల నుంచి ఆరంభమవుతుంది. యల్.సి.ఇ., యల్.ఇ.ఇ., లేక యల్.యం.ఇ. యోగ్యతలువుండి రూ. 125–8–205–250/–ల స్కేలులో నియమింపబడిన ఓవర్‌సీర్లు,మూడవ గ్రేడు డ్రాఫ్ట్సమెన్‌కు జీతం రూ. 157–ల నుంచి ఆరంభమవుతుంది. ఆటోమొబైలు ఇంజనీరింగు (యల్.ఎ.ఇ.)లో డిప్లొమాగల అసిస్టెంటు మోటారు ఇన్స్పెక్టర్లకు రూ. 140–9–230–10–280 స్కేలులో జీతం రూ. 157/–ల నుంచి ఆరంభమవుతుంది. బి ఇ. (టెలికమ్యూనికేషన్స్) యం. యస్‌సి. (వైర్‌లెస్) లో డిగ్రీలు వుండి రేడియో సూపర్‌వైజర్లుగా నియమింపబడ్డ వారికి రూ. 200–12–320–16–400 ల స్కేలులో జీతం రూ. 236 నుంచి ఆరంభమవుతుంది.

కంపౌండర్లకు రూ. 90–6–150–7–192 స్కేలులో జీతం రూ. 102 నుంచి ఆరంభమవుతుంది. ఫార్మసిస్టు (డిగ్రీహోల్డర్లు)కు రూ. 140–9–230–10–280 స్కేలులో రూ. 167 నుంచి జీతం ఆరంభమవుతుంది.

ఆంధ్రప్రదేశ్ మెడికల్ సర్వీసులో పోస్టు గ్రాడ్యుయేట్లయిన అసిస్టెంటు సర్జనులకు సవరించబడిన రూ. 400–25–650–30–800 స్కేలులో మూడు అడ్వాన్సు ఇంక్రిమెంట్లు ఇవ్వబడుతాయి. వారు పోస్టు–గ్రాడ్యుయేటు డిప్లొమా హోల్డర్లయితే, ఒక అడ్వాన్సు ఇంక్రిమెంటు ఇవ్వబడుతుంది. అయితే ఇవి లోగడ నిర్ణయించిన షరతులకు లోబడి వుంటాయి.

ఈ ఉత్తర్వులు 1969 మార్చి 19 నుంచి అంటే సవరించబడిన జీతం స్కేళ్ళు అమలులోకి వచ్చిన తేదీ నుంచి అమల్లోకి వస్తాయి.

నిమ్నజాతుల సంక్షేమానికి ప్రత్యేక యంత్రాంగం

నిమ్నజాతులు, గిరిజనుల సంక్షేమానికై ఉద్దేశించబడిన పథకములన్నింటినీ సకాలంలో సక్రమంగా అమలు జరిపే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక పరిపాలనా యంత్రాంగాన్ని ఏర్పాటు చేసింది. ఈ ప్రజల ఇబ్బందులను ఈతిబాధలను సానుభూతితో పరిశీలించి వారికి సత్వరమే తగిన సహాయం చేయడానికి ఈ పరిపాలనా యంత్రాంగం కృషిచేస్తుంది. రాష్ట్ర స్థాయిలో నిమ్నజాతులు, గిరిజనుల సంక్షేమం కొరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎక్స్. అఫీషియో కమీషనర్‌గా వుంటారు. ఆయనకు ఈ విషయంలో ప్రభుత్వ ఉపకార్యదర్శి సహాయకులుగా పనిచేస్తారు. జిల్లాస్థాయిలో కలెక్టరు ఈవిషయలో ఉన్నతాధికారిగా వ్యవహరిస్తారు. ఆయనకు సహాయపడడానికి ఒక లైజాన్ ఆఫీసరుకూడా వుంటారు. నిమ్నజాతులు గిరిజనులకు సంబంధించిన ఉద్యోగ రీత్యాగల ఇబ్బందులు, వారికి గల కష్ట నిష్ఠూరాలుకూడా ఈ ప్రత్యేక యంత్రాంగం ద్వారా పరిష్కరించబడుతాయి.

ప్రణాళిక శాఖ పేరు మార్పు

ప్రణాళిక శాఖకు 'సహకారం', 'గృహనిర్మాణం' విషయాలను బదిలీ చేయబడిన కారణంగా 1970 సెప్టెంబరు 2వ తేదీనుండి ప్రణాళిక శాఖ పేరును 'ప్రణాళిక, సహకారశాఖగా మార్చడం జరిగింది.

అదే రోజు నుండి ప్రణాళిక, సహకార శాఖా కార్యదర్శి, ఆంధ్రప్రదేశ్ గృహ నిర్మాణ మండలి ఎక్స్‌అఫిషియో అధ్యక్షులుగా వ్యవహరిస్తారు.

హోటలు పనివారల కనీస వేతనాలు.

ఆంధ్రప్రదేశ్‌లోని హోటళ్ళు, రెస్టారెంట్లలో పనిచేస్తున్న వారికి కనీసవేతనాలను సవరిస్తూ రాష్ట్రప్రభుత్వం ఉత్తర్వు జారీ చేసింది. ఇది ఆంధ్రప్రదేశ్ గజెటులో ప్రచురించిన తేదీనుంచి, ఈ కనీసవేతనాలు అమల్లోకి వస్తాయి.

పనివారలకు భోజనవసతి సౌకర్యాలు వున్నట్లయితే, వారి జీతంలోనుంచి నెల 1కి 37–50 పై. చొప్పున రాబట్టుకోవడం జరుగుతుంది. రోజువారీ రేటుచొప్పున వేతనం చెల్లించవలసి నప్పుడు నెలజీతాన్ని 30తో భాగించి ఆ ప్రకారం చెల్లించవలసి వుంటుంది. పిల్లలను పనిలో చేర్చుకునే సందర్భాలలో వారికి వయోజనులకు నిర్ణయించిన వేతనంలో 75 శాతం ఇవ్వవలసివుంటుంది. ప్రభుత్వం నిర్ణయించిన కనీసపు రేట్లకంటే హెచ్చుజీతాలు వస్తున్నట్లయితే వారికి హెచ్చుజీతాలు మాత్రమే అమల్లోవుంటాయి.

ముక్తకాలు

మాదిరాజు రంగారావు

దుఃఖం సముద్రంవంటిదంటారు
పల్లం నుండి చూస్తే కన్పించదు
చెలియలికట్ట నధిరోహిస్తేనే
కన్పించి అనుభూతిస్తుంది.


ఏకాంతాన్ని భగ్నం చేసే
తలపులో వేయి ఊహాలు
మెలకువను మాపిసే
యత్నంలో వేయి స్వప్నాలు

వెలుగు ముద్దు పెట్టుకుంటుంది
ఆకునీ పూవునీ పండునీ—
చీకటి బుద్ధి చెబుతూనే ఉంది
ఊహాకూ, ఆశకూ, మనస్సుకూ—

రాత్రి పగలు నిజంగా నా సేవకులు
యజమానులవలె ప్రవర్తింప జూస్తాయి
నిదురించినవేళ ప్రత్యక్షంగా
మేల్కొన్నవేళ పరోక్షంగా

చంద్రుడు వచ్చినా రాకపోయినా
రాత్రి నిల్వదు, అనుభవం ఆగదు
రేపు వచ్చేను, రాకపోయేను
ఎగురనీ జీవితం ఉషస్సై.






రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ కాసు బ్రహ్మానంద రెడ్డి సతీ సమేతంగా హాంగ్‌కాంగ్ మీదుగా టోక్యో వెళ్లే నిమిత్తం ఆగస్టు 31 న ఢిల్లీ నుండి బయలుదేరి వెళ్ళారు. అక్కడ పాలం విమానాశ్రయంలో పార్లమెంటు సభ్యులు, తదితర మిత్రులు వారికి వీడ్కోలు చెప్పారు.




ఉపముఖ్యమంత్రి శ్రీ జె. వి. నరసింగరావు, రవాణాశాఖా మంత్రి శ్రీ ఎం. ఎన్. లక్ష్మీ నరసయ్య, సమాచార పౌర సంబంధ శాఖా మంత్రి శ్రీ ఎ. వాసుదేవరావు సెప్టెంబరు 2 న జపానుకు బయలుదేరి వెళ్ళినప్పటి చిత్రం

వార్తా చిత్రాలు



చిన్న నీటి వనరుల మంత్రి శ్రీ పురుషోత్తమ రెడ్డి, నీటిపారుదల శాఖా మంత్రి శ్రీ ఎస్. సిద్దా రెడ్డి సెప్టెంబరు 4 న జపానుకు బయలుదేరుతున్నప్పటి చిత్రం.



మన ఉత్పత్తులను ఎగుమతి చేయడానికిగల అవకాశాలను పరిశీలించే నిమిత్తం వాణిజ్య శాఖా మంత్రి శ్రీ పి. అంకినీడు ప్రసాదరావు నాయకత్వంలో అయిదుగురు సభ్యులతోకూడిన పరిశీలక బృందం ఆగస్టు 31 న ఆగ్నేయాసియా దేశాలకు బయలుదేరి వెళ్లుతున్న సందర్భంలో తీసిన చిత్రం.

గాంధీచరిత్ర-తోలుబొమ్మలాట

(గత సంచిక తరువాయి)

ఆరుద్ర

బంగారక్క : జోహారు! జోహారు.

కేతిగాడు : ఏంటత్తమ్మా! జోహారంటున్నావు.

బంగారక్క : అంతేకదరా? మరి! గాంధీగారు చేసినదిచూస్తే జోహారనాలి కదరా?

కేతిగాడు : అప్పుడే ఏం జూశావ్? ఇంకా బోలెడుంది. ఆయన హరిజనులకోసం, ఆ తరవాత చేసింది ప్రపంచాన్నే దద్దరిల్లచేసింది. దేశం దేశమంతా అట్టుడికిపోయింది. ఒక్క దెబ్బతో తరతరాల తుప్పు వదిలిపోయింది.

బంగారక్క : అల్లాగా! ఏమిటి, ఏంచేశారు? చెప్పు చెప్పు.

కేతిగాడు : చెప్తా, చెప్పడానికేవచ్చా.

పోలిగాడు : ఒరే కేతిగా!

కేతిగాడు : ఏం మామ :

పోలిగాడు : గాంధీగారు ఒక్క తమ ఆశ్రమంలోనేనా లేక బయటకూడా మాలాళ్ళ ... తప్పుతప్ప హరిజనులకోసం ఏమేనా చేశారా?

కేతిగాడు : చేయకేం? ఎంతో చేశారు. దేశందేశమంతా తిరిగారు. హరిజనులు లేని సభలో మాట్లాడమన్నారు. హరిజనుల్ని దూరంగా కూర్చోబెట్టిన సభలోకూడ మాట్లాడలేదు. అంటరానితనాన్ని రూపుమాపడానికి కుర్రాళ్ళను పురికొల్పారు.

బంగారక్క : అది సరేకాని, హరిజనులకు ఎంతసేపూ గాంధిగారూ, ఇంకోళ్ళూ ఉపకారాలు చేయడమే చెప్తున్నావుగాని అసలు హరిజన్లు వాళ్ళకి వాళ్ళేం చేసుకోలేదా? వాళ్ళలో వాళ్ళకి నాయకుడు లేడా?

కేతిగాడు : లేకేం? హరిజన్లలో చాలా గొప్పవాడున్నాడు. భీమరావు అంబేద్కరనే మహానుభావుడున్నాడు. హరిజన కులంలో పుట్టినా గొప్ప చదువులు చదివాడు. లండనుకెల్లి గాంధిగారు, నెహ్రూగారు, మన ప్రకాశం పంతులుగారు ఎంత చదువుకొచ్చారో అంతా ఈయన చదువుకొచ్చాడు.

బంగారక్క : ఏంటి? మాలాయన అంత చదువు చదివాడా? ఎట్టెట్లరా?

కేతిగాడు : ఎట్లా ఏమిటి? చదివించేవారుంటాలగాని. ప్రతి కులంలోనూ మహానుభావులుంటారు. అవకాశాలివ్వాలి. ఇస్తే ఎవరైనా పైకొస్తారు.

బంగారక్క : నిజమే అనుకో. అంబేద్కరయ్యా అంత చదివాడన్నమాట!

కేతిగాడు : నిజానికి యింకా ఎక్కువే చదివేవాడు. చదివిన చదువంతా తన జాతివాళ్ళని ఉద్ధరించడానికే ఉపయోగించాడు.

పోలిగాడు : ఏంరా కేతిగా! ఈయన గాంధిగారి శిష్యుడా?

కేతిగాడు : కాదుమామ! ఒకరకంగా ఎగస్పార్టీ మనిషి. ఇద్దరికీ తొలి రోజుల్లో చుక్కెదురు. చాలా ఘాటుగా మాటా మాటా అనుకున్నారు.

బంగారక్క : అదేమిటి_ఇద్దరికీ హరిజన్లు బాగుపడ్డమేకదా కావలసింది. మరి దెబ్బలాట ఎందుకు?

కేతిగాడు : అక్కడేవుంది పాయింటు. అంబేద్కరయ్య మాలవాడికి బళ్ళో చదువుకుందికి, గుళ్ళో నోచుకుండికి, చెరువుల్లో నీల్లు తాగడానికి_ వీధుల్లో తిరగడానికి ఇంతెందుకు, అందరిలాగా బతకడానికి అవకాశాలివ్వాలి. అందరిలాగా మాకూ అన్నిచోట్లా ఉద్యోగాలు దొరకాలి. మావాల్లుకూడా గవర్నమెంటులో ఉండాలి అని శతపోరాడు.

బంగారక్క : పోనివల్సిందేమరి. దీనికి గాంధిగారు ఏమన్నారు?

కేతిగాడు : ఏమంటారు. నాకుకావలసిందీ అదే అన్నారు. అయితే, ముందు దేశానికి స్వరాజ్యం రావాలి, ఆ తరువాత ఈ సంగతులన్నీ చూసుకుందాం అన్నారు.

పోలిగాడు : అదీ పాయింటేమరి. అంబేద్కరయ్య ఒప్పుకున్నాడా?

కీలిగాడు : ఎందుకొప్పుకుంటాడు. తెల్లవాళ్ళ గుప్పిట్లోనుంచి నళ్ళవాళ్ళంతా బయటపడాలనుకొంటూవుంటె, నళ్ళ వాళ్ళకాళ్ళక్రింద నుంచి నావాళ్ళని బయట పడేయాలని నేననుకుంటున్నాను అన్నాడు.

బంగారక్క : అలాచెప్పు ఏదిముందు అన్నదానికిలా గొడవ వచ్చిందన్నమాట!

కీలిగాడు : ఎక్కడ మొదలై చాలాదాకా వచ్చింది. ఒకసారి గాంధీగారు అంబేద్కరయ్యను భేటీకిపిలిచారుచూడు

గాంధిగారి బొమ్మ అంగవస్త్రంతో ఉన్నది.

పాట

రావయ్య అంబేద్కరుడ మనకి
రగడేల రాజ్యాంగ విడుద!

అసలు పుట్టుకచేత నీవు, మసలియుండుటచేత నేను
వసుధ నంటరానివాళ్ళమైతిమి, నీ
విశతకోపముజూపి బుసలుకొట్టగ తగున ॥రా॥

తల్లిదాస్యము ముందు బాప
పిల్లలకు ముక్తి రాద
తెల్లవారిని పారద్రోలిన పిమ్మట
తెల్లారు మీబాధ కల్లకాదుమాట!

అనుచు నాహ్వానింప అంబేద్కరుండు
వచ్చి గాంధి జూచి వచియించెనిట్లు.

అంబేద్కరు : పాట

వందనమో గాంధీ ఆ
క్రందన వినవయ్యా!

కందువ మాటలవల్ల కడుపునిండదయ్యా
అందరు విడివడుదాకా ఆగజాలమయ్యా
కుందెడుమాలల బాధ ముందు తీర్తునయ్యా
తొందరపాటవి నాపై నిందవేయకయ్యా

అరయగ మనుజులమైన - పురుగులవలె జూచెదరు
తరతరాల ఈ హింస-తాళదు ఇకనాగుండె
సరగున మామకజనుల-నరులను జేయంగవలయు
పరవాదుల కపటముబాట-పట్టెద వేరేబాట

సంధివచనం : అని ఘాటుగా మాటలాడెడువాని
వీక్షించి గాంధిజీ వెండియు పలికె

గాంధీజీ : పద్యం

ఆశయసిద్ధికి నీవును
బాసట కాకుండి వేరు బాటల సాగన్
దోషము దురితము ఘోరము
దేశద్రోహమ్ముకాదె దీనిధి చెపుమా!

సంధివచనం : అని పల్కనాలించి అంబేద్కరుండు
కడు నాగ్రహించి తా గ్రక్కున నుడివె.

ద్విపద :

బాపురే! ఇది యేమి భాషణమయ్యా!
స్వారాజ్య సంపద సాధించువరకు
సంఘసంస్కరణ ప్రసక్తియే లేదు
మత సమస్యలటన్న మాకు సగమేరి
కనుచు చాటెడివారి కతిదూరమగుచు
నా జాతివారల నయనాల నీరు
తుడువ దేశానికి ద్రోహినైనానె
వాస్తవానికిజూడ వసుధలో నేను
నా స్వదేశమ్మని నడయాడియుబ్బి
గర్వాన నొక్కి వక్కాణింప నాకు
దేశమెక్కడ కద్దు తెల్పు మహాత్మా!
లేదు దేశము లేదు లేదయ్య మతము
ఇది నాదు దేశమా ఇది నాదు మతమా!
శునకాల జాలితో జూచు హిందువులు
మాలల పొడగాంచి మండి పడెదరు.
చీమకై చక్కెర చేజల్లువారు
మాలకు దోసిట మంచి నీరిడరు
కుక్కకన్న కడు నికృష్టమౌ మనికి
మనమని పల్కెడి మాతృదేశమ్మె!
ఆత్మాభిమానమ్ము ఆత్మగౌరవము
గల మాలదెవడైన గర్వించి మించి
ఇది స్వదేశమ్మని ఎటు పల్కగలడు.
ఇది నాదు మతమని ఎటు పొంగ గలడు.
కావున చేసెద కదనమ్ము నేను.
నా జాతికిచ్చోట న్యాయము గూర్తు
దీని పంచముల స్వదేశమొనర్తు
భారతమాత హృదయ పరివర్తనమ్ము
సాధింప సంకుల సమరమ్ము జేతు.

సంధివచనం : ఆ రీతి నంబేద్కరాడిన మాట
లాలించి గాంధిజీ యనియె తానిట్లు.

గాంధి : సాధు! సాధు! మిగుల శాంతించవయ్య
దేశ భక్తుడవని తెలియును నాకు
పంచములయెడల పాయని కూర్మి
కలదయ్య నాకు ప్రగాఢమ్ముగాను
నీవు పుట్టకముందు నేనీ సమస్య
చేపట్టి మాలల సేవించుచుంటి
అంటరాని తనమ్ము నంగీకరించి
యది శాస్త్ర సమ్మతమని వాదులాడి
కలకాల మీ కళంకపు మోతకన్న
హిందూ మతము నశియించిన మేలు

శక్తి వంచన లేక సంస్కారములకు
పాటుపడియెద తర్వాత సోదరుడ!
ముందు మన స్వరాజ్యము బడయనిమ్ము
రాజ్యాంగ విషయాల రభసలింకేల!
పెను యభిప్రాయాల భేదమింకేల.

సంధివచనం : అని పల్కు గాంధీకి యంబేద్కరుండు
బదులు చెప్పెను వేరు భావాలతోను.

అంబేద్కరు : ముస్లిముల్ సిక్కులు మొదలైనవారు
రాజ్యాంగ సభలోన ప్రత్యేకమైన
స్థానాలకోరుట సమ్మతి నీకు
ఆ మతస్థులె వారి కనుకూలమైన
వారల నెన్నుకోవచ్చునన్నావు
యుగయుగమ్ములనుండి యుక్కుపాదాల
క్రిందపడి నలిగి కిక్కురుమనని
మా జాతి వారలు మహనీయ! నేడు
ప్రత్యేక స్థానముల్ బడయుట నీకు
తప్పుగా దోచెనా మహాత్మా
ఎవరు మా ప్రతినిధులెవరు నాయకులో
మా కులము వారలె మహినెన్నుకొనుట
ద్రోహమా, దురితమా, దొడ్డ మహాత్మా!

సంధివచనం : అన్న మాటలకు మహాత్ముండు బదులు
గా పల్కె తానిట్లు గంభీరమతిని.

గాంధీజీ : అన్యమతస్థు లవ్వారు కదయ్య
వారు మనల నమ్మలేరయ్య కనుక
ప్రత్యేక స్థానముల్ బడయంగవచ్చు.
మన మిద్దరమ్మొక మతము వారలము
మనలోన మన కనుమానమ్ములేల
మీదు భారమ్ము నా మీదనె యిడుడు
కలసి యమ్మడిగ ఘనమైనవారి
నెన్నుకొందముగాక ఇక మీద మనము
సాటి హిందువులపై సంశయమేల?

సంధివచనం : అప్పుడంబేద్కరుండు ఏమనెన్నన్న

అంబేద్కరుండు : యిన్ని వేలేండ్లుగా హింసించినట్టి
యగ్రవర్ణము వారి నంత్యజు లింక
యెట్లు నమ్ముదురు నే నెట్లొప్పుకుందు
విడి యెన్నికల పట్టు విడువను నేను.

సంధివచనం : దానికి గాంధీగారు ఏమనిరన్న!

గాంధీజీ : విడి యెన్నికల పట్టు విడవని యెడల
యందు కాంగ్ల ప్రభుల్ యంగీకరించి
హిందూ సమాజమ్ము నిట్లు భాగించ
ప్రాణమైనను యొడ్డి ప్రతిఘటించెదను.

సంధివచనం : ఆ ప్రతిజ్ఞను విన్న యాంగ్ల ప్రధాని
ప్రకటమ్ముగ తాను వచియించె నిట్లు

ఆంగ్లప్రధాని : వింటి వింటిని మీ విభేదాల తీరు
అంటరాని జనుల యాక్రందనమ్ము
వింటి రాజ్యాంగాన విడి యెన్నికలకు
సమ్మతించెద నేను సాదర మతిని.

ఆ ప్రకటన వినగానే గాంధీజీ మారు ప్రకటన చేశారు.

గాంధీగారు : పూర్తిగా పాటింతు మొదటి ప్రతిజ్ఞ
విడియెన్నికల మీరు విడుచు నందాక.
భోజనంబు ముట్టక ప్రాణాలు విడుతు
నిరశన దీక్షయా మరణమ్ముదాక.
సాగింతు నైక్యత సాధింతు నిజము
మీ మాటలను విరమించిన తోడ
ఉపసంహరించెద నుపవాస దీక్ష
ఇది సత్య మిది తథ్య మిది నా ప్రతిజ్ఞ!

సంధి వచనం : అనుచు గాంధి మహాత్ము డామరణ నిర
శనదీక్ష పూనంగ సర్వప్రపంచ
జనులు ఘోషించిరి; జగము దద్దిల్లె!
భారత హృదయాలు పరివర్తనమ్ము
చెంది గాంధీ మహాత్ము చెంతకేతెంచి
వలదని ఈ రీతి ప్రార్థించినారు.

బృందగానం : పాట

వలదయ్య వలదో బాపు-నీ
వ్రతము కఠోరమ్ము ఆపు!
ఇది నీకు కాదయ్య దీక్ష!
ఇది దేశాని కగ్ని పరీక్ష!
నీవునికి శ్రీరామ రక్ష!
నీ మరణమే మాకు శిక్ష వ॥

అప్పుడు గాంధీగారు ఏమనినారన్న

గాంధీజీ : షరతు తీర్చెడిదాక సాగు నీ వ్రతము
హిందూ సమాజమ్ము నేకమ్ము జేయ
అంటరాని తనమ్ము నంతము జేయ
మామక ప్రాణముల్ మనసార నిత్తు
జీవమ్ములను మించి జీవి కేమైన
నదనమ్ముగా నున్న నవి కూడ నిత్తు
కాని యెక్కట నాకు కలదొక్క తనువె
దాని నీ యాగాన తర్పణజేతు.
హిందూ ప్రజలప్పుడు ఇలా అన్నారు.
రావయ్య అంబేద్కరయ్య! బాపూ
జీవాలు నిలబెట్టవయ్యా!
అంటరాని తనము నంతమ్ము జేయ చను
వెంటనే పంచముల వెతలు తీర్చెదమయ్యా! ॥రా॥

గుడులందు బడులందు మీరుఅడుగు పెట్టగ వచ్చునయ్యా
తడవు కాయక గుండె తలుపులు తెరిచాము ॥రా॥
అప్పుడు అంబేడ్కరుండు :

అంబే : విరమించుమా దీక్ష విరమించు బాపు
నీ ప్రాణముల్ నేడు నిలుపంగ వలయు
మనము యెన్నికల నుమ్మడి రీతిగానె
యెన్నుకొనుటకు నాకింక సమ్మతమె
నీ మాట పాటించినామయ్యా కనుక
మా మాట పాటించి మహనీయ మాకు
ప్రత్యేక స్థానముల్ ప్రకటించ నిమ్ము
వాని కభ్యర్థు లెవ్వార్థలో మేము
ముందుగా నెంచి మీ ముందు పెట్టెదము
నలుగు రభ్యర్థులన్ నిలబెట్టగలము
వారిలో యోగ్యుని పరులైన వాని
హిందువు లందరున్ యెన్నుకోవచ్చు
నది నీకు సమ్మత మనుకొందునయ్యా !

అనిన గాంధీజీ యిట్లనిరి :—

భళి భళి! లెస్సగా ప్రకటించితీవు
ఇది నాకు సమ్మత మిది మంచిదారి
ఇది యైక్యతకు నాంది ఇదియే పునాది

మాలలు పరయాలు మాదిగ లనెడి
హీన నామాలతో ఇక పిల్వ రాదు
పంచముల కిడుదు మంచి పేరొకటి
హరికి మీవారలె అత్యంత ప్రియులు.
అంత్యజుల్ కారయ్యా హరిజనుల్ వారు.
లోకాన ఈ పేరు రూఢియౌగాక !
ప్రజలింక యిల సుఖపడుదురుగాక !

బృందగానం : నీ దీవెన కుసుమించినాది బాపూ
నీ దీక్ష ఫలియించింది
తరతరాలుగా సంస్కర్తల తరముగని పనులు
సరగున యొక్క విరళన వ్రతమున సాధించితివయ్యా
భరతమాత పరదాస్య బంధములు భళన తెగిపోగానే
హరిజనులకు సరిసమాన హక్కులు దొరకినవో తండ్రీ!

నమో నమో బాపు ! మాకు
న్యాయ మార్గమే చూపు॥
మంగళం మన భరత మాతకు
మంగళం! జయ మంగళం !
మంగళం ఇల సర్వ ప్రజలకు
మంగళం శుభ మంగళం.

సమాప్తం



ఏదీ ఏదీ ఆ పువ్వు—

రోజూ వచ్చి పలకరించేది
ఒక రోజా పువ్వు నన్ను
కాలాల్లో భవిష్యత్తు
ఋతువుల్లో వసంతం
చూపులకు పువ్వేగాని
నిజానికి నిత్య యౌవనం...
నిత్య పరిమళం తన గాధ
సౌందర్యం బోధగా
జాతిని లాలించిన పువ్వు
జగతిని పాలించిన పువ్వు

ఎర్ర గులాబి
(జననం . నవంబరు 14)

పేదలపాలిటి చిరునవ్వు—


వార్తా చిత్రాలు

ఇ.డోనిప్పన్ ప్రెసిషన్ బేరింగ్స్ కంపెనీ
ప్రారంభోత్సవంలో




రాష్ట్రపతి శ్రీ వి. వి. గిరికి పూలమాలలతో
స్వాగతం (ఆగస్టు 24)

★ ★




ఉత్పత్తి అయిన బాల్ బేరింగులు




స్థంభాకారపు బేరింగులు


ముఖ్యమంత్రిని కలుసుకొన్న అతిథులు




స్టేట్ బ్యాంక్ అఫ్ హైదరాబాదు కొత్త జనరల్ మేనేజరు శ్రీ యస్. కె. దత్తా




మన దేశంలో జపాను రాయబారి శ్రీ అట్సుషి మ్యామా (ఆగస్టు 24)



రిజర్వు బ్యాంక్ అఫ్ ఇండియాగవర్నరు శ్రీ యస్. జగన్నాధన్ (ఆగస్టు 21)



జపాన్‌లోని కోయో సేకో కంపెనీ అధ్యక్షులు శ్రీ ఐవా ఇకేడా



ముఖ్యమంత్రి చేసిన విందులో ప్రధాన కార్యదర్శితో శ్రీ ఇకేడా (ఆగస్టు 24)


కృష్ణా జిల్లా ప్రగతి: దశాబ్ద కాలంలో

కృష్ణాజిల్లాలో ఒక చిన్న గ్రామవాసి శ్రీ వెంకటేశ్వరరావు పదేండ్ల క్రిందట తన భూములన్నీ అమ్ముకొని తుంగభద్ర ప్రాజెక్టు క్రింద కొన్ని భూములు కొనుక్కొని అక్కడ స్థిరపడిపోయాడు. ఆయన తన స్వగ్రామానికి బంధుమిత్రులను చూడడానికి గత జనవరిలో వచ్చాడు. గ్రామంలో ప్రవేశిస్తుండగా అక్కడి రైతుల సంచలనం చూచి ఆశ్చర్యపోయాడు. కొంతమంది పొలాల్లో పని చేస్తున్నారు. మరికొంతమంది ట్రాక్టర్లతో భూములు దున్నుతున్నారు. రైతులందరు దాళ్వాపంట వేయడానికి ఉద్యమిస్తున్నారు. ఆయన ఇదివరకు ఇక్కడవున్న రోజుల్లో జనవరి నెలలో రైతులందరూ పనిపాటా లేక విరామంగా వుండేవారు. అతనికి మరొక దృశ్యం కంటబడింది. ఇదివరకు ఒక గుడిసె వున్నచోట ఇప్పుడు చక్కని ప్రాథమిక పాఠశాల భవనంవుంది. బాలబాలికలందరూ శుభ్రమైన దుస్తులు ధరించి అరమైలు దూరంలోవున్న హైస్కూలుకు వెడుతున్నారు. గ్రామంలో ఎలక్ట్రిక్ స్థంభాలు కనపడినాయి. పూరిగుడిసెలు, పెంకుటిండ్లస్థానే పక్కాఇండ్లు వెలసివున్నాయి. పంచాయతీ భవనం, పశువైద్య ఆసుపత్రి కూడా అగుపించాయి. పశువైద్య ఆసుపత్రికి ఒక పెద్దలారీ వచ్చి పాలడబ్బాలలో పాలు తీసుకొని వెడ్తున్న దృశ్యంకూడా శ్రీ వెంకటేశ్వరరావుకు కనిపించింది. మరొక లారీవచ్చి సహకార కార్యాలయంవద్ద రసాయనిక ఎరువుల సంచులను, క్రిమిహారక మందులను దింపుతున్నది. గ్రామానికి మెటల్ రోడ్లువున్నాయి. శ్రీ రావు గ్రామంలో కొన్ని రోజులున్నప్పుడు అక్కడ మహిళామండలి భవనంలో స్త్రీల సమావేశాలను తిలకించాడు. ప్రజలు తరచుగా విజయవాడకు వెడుతూ ఉండడం గమనించాడు. గ్రామంలో నాటికి నేటికి ఎంతమార్పు వచ్చిందని ఆయన విస్తుపోయాడు.

కృష్ణా జిల్లాలో గత పదేండ్లలో జరిగిన ప్రగతి ఈ మార్పుకు కారణం.

జిల్లా ఆర్థిక వ్యవస్థ వ్యవసాయంపైన ఆధారపడివుంది. బియ్యం ఉత్పత్తిలో జిల్లా రాష్ట్రంలో ద్వితీయస్థానం ఆక్రమించి వుంది. సాలీనా 9 లక్షల టన్నుల ధాన్యం పండుతుంది. టి.యన్. ఐ, ఆర్. 8 వంటి మేలురకం విత్తనాల వాడకంవల్ల ఎకరానికి పంట దిగుబడి సానికరకాలకంటే 40 నుంచి 60 శాతం హెచ్చుగా వుంటున్నది. 1969–70 సంవత్సరంలో రబీ, ఖరీఫ్‌కాలంలో 1,49,204 ఎకరాలలో ఎక్కువ దిగుబడినిచ్చే వరివంగడాలు వేయబడినాయి. ఖరీఫ్ పంటకాలంలోనే 90,000 ఎకరాలలో మేలురకం వరివంగడాలు వేయడానికి వ్యవసాయశాఖ ప్రణాళికలను తయారు చేసింది.

జిల్లాలో జరిగిన మరొక గణనీయమైన విషయమేమిటంటే, 1967–68 సంవత్సరంలో మొత్తం 17,69,646 యెకరాల భూమి సాగుఅయింది. కృష్ణా బ్యారేజి నుంచి నీరు విడుదల కావడం వల్ల ఈ జిల్లాలో ప్రతిసంవత్సరం సుమారు 3 లక్షల యెకరాలలో



విజయవాడలో పాల ఉత్పత్తుల ఫ్యాక్టరీ



రెండవ పరిపంట పండించడం జరుగుతున్నది. దీనివల్ల రైతుల ఆర్థిక వ్యవస్థకు స్థిరత్వం చేకూరింది. సాంఘికంగా ప్రగతి పథంలో నడవడానికి వారికి ఆస్కారం కల్గింది.

చెరకుపంట విషయంలోకూడా గణనీయమైన ప్రగతి సాధించబడింది. 1967_68లో 10.03 లక్షల టన్నుల చక్కెర ఉత్పత్తి అయింది. అయితే 1965_66 నాటికి 28,000 ఎకరాలలో చెరకు పండించబడింది. ఈ జిల్లాలో రైతులు రసాయనిక ఎరువులను విశేషంగా వాడడం పేర్కొనదగిన విషయం. 1969_70 లో నత్రజని ఎరువుల వాడకం 1,01,763 టన్నులకు, ఫాస్ఫేటు ఎరువుల వాడకం 47,648 టన్నులకు పెరిగింది. రాష్ట్ర మొత్తంలో 12,000 టన్నుల పొటాష్ ఎరువులు ఉపయోగించబడుతున్నాయి. ఇందులో 4,000 టన్నులు ఒక్క కృష్ణాజిల్లాలోనే వినియోగించబడుతున్నాయి. ఇదేవిధంగా క్రిమిసంహారక మందుల వాడకం కూడ బాగా పెరిగింది. ఈ దశాబ్దకాలంలో 14,000 ఎకరాలలో శ్రేష్ఠమైన పత్తి పండించడం—ఇది కృష్ణాజిల్లా ప్రత్తి అని వ్యవహరింపబడుతున్నది—ప్రశంసనీయమైన విషయం. 17,300 ఎకరాలలో మామిడి చెట్ల పెంచడం జరుగుతున్నది.

పశుగణాభి వృద్ధి

పశుగణాభివృద్ధి విషయంలో కృష్ణాజిల్లా బాగాఅభివృద్ధి చెందింది. రెండుకోట్ల రూపాయల ఖర్చుతో విజయవాడలో సమీకృత పాల ప్రాజెక్టు నిర్మించబడింది. పాలు సమృద్ధిగా ఉత్పత్తి అయ్యే కాలంలో ఈ ప్రాజెక్టులో రోజుకు 80,000 లీటర్ల పాలు తయారవుతాయి. వేసవికాలంలో 46,000 లీటర్ల పాలు ఉత్పత్తి అవుతాయి. 1969 సంవత్సరంలో ఈ ప్రాజెక్టు మొత్తం 193.24 లక్షల లీటర్ల పాలు తయారుచేసింది. ఇక్కడినుంచి హైదరాబాదు నగరానికిరోజూ సుమారు 45,000 లీటర్లపాలు సరఫరా అవుతాయి. ఈ జిల్లాలో పశువుల అభివృద్ధికై తగిన కృషిచేసిన ఫలితంగా పాల ఉత్పత్తి ఇంతగా పెరగడానికి సాధ్యపడింది.

ఈ జిల్లాలో 5 ప్రాంతీయ పశుగణాభివృద్ధి కేంద్రాలు పనిచేస్తున్నాయి. 1,49,449 పాడిపశువులకు ఈ ఐదు కేంద్రాలనుంచి, వాటిక్రిందనున్న 154 ఉపకేంద్రాలనుంచి తగిన చికిత్స సౌకర్యాలు లభిస్తున్నాయి. ఈ పథకం ఆరంభమైనప్పటినుంచి 1970 ఏప్రిల్ వరకు మొత్తం 1,68,964 పశువులకు కృత్రిమంగా గర్భధారణం చేయడం జరిగింది. అక్కడినుంచి బీజాలు ఉప కేంద్రాలకు సరఫరా అవుతాయి.

కీసరిపల్లిలో రూ. 70 లక్షల ఖర్చుతో పందుల పోషణ, పందుల మాంసం ఉత్పత్తి ఫ్యాక్టరీ నెలకొల్పబడింది. విజయవాడలో ఏర్పాటు చేయబడిన కోళ్ళ పరిశ్రమనుంచి రోజుకు సుమారు 7 వేల కోడి గ్రుడ్లు సరఫరా చేయబడుతాయి ఈ కేంద్రాల స్థాపనవల్ల రైతుల ఆదాయం బాగా పెరిగింది. వారు పాడి పశువులు, కోళ్లు పందులను పెంచి తమ ఆదాయాన్ని వృద్ధి చేసుకుంటున్నారు. రైతుల ఆర్థిక వ్యవస్థకు స్థిరత్వం ఏర్పడింది.

సహకార రంగంలో

జిల్లాలో వున్న గ్రామాలన్నిటికీ సహకార సంఘాలనుంచి తగిన సహాయం లభిస్తున్నది. 1968_69 లో రూ. 304.51 లక్షల మేరకు స్వల్పకాలిక రుణాల క్రింద రైతులకు ఆర్థిక సహాయం చేయడం జరిగింది. దివి సీమ ప్రాంతానికి సహకార సేద్యం కొరకు ఒక మాస్టరు ప్లాను రూపొందించబడింది. ఇది 1966 డిశంబరునుంచి అమలుపరచబడుతున్నది. ఈ ప్లాను ప్రకారం 400 సమిష్టి వ్యవసాయ సంఘాలను స్థాపించడం జరుగుతున్నది. వీటి ఆఫీసులో 29047 ఎకరాల ప్రభుత్వ భూములు, లంకభూములు సాగు అవుతాయి. 1969 మార్చి నాటికి 10900 కుటుంబాలు ఈ భూములలో స్థిరపడిపోయినాయి. 210 సంఘాలు రిజిస్టరైనాయి. వీటిలో 4284 కుటుంబాలకు సభ్యత్వంవుంది. జిల్లా మెట్ట భూములలో సహకార భూమి తనఖా బ్యాంకు ద్వారా ప్రాంత అభివృద్ధి పథకాలు అమలుపరచ బడుతున్నాయి. దానికి అగ్రికల్చర్ రీఫైనాన్స్ కార్పొరేషను ఆర్థిక సహాయం చేసింది. దానిద్వారా రైతులకు రూ. 12.65 లక్షల రుణ సౌకర్యాలు లభించాయి.

పరిశ్రమలు

పరిశ్రమలలోకూడా ప్రగతి జరిగింది. "జవహర్ ఆటో నగర్" స్థాపించబడింది. దీని ఖర్చు రూ. 55.74 లక్షలు. ఇది 1966 లో విజయవాడలో ఆరంభించబడింది. ఆసియాలోకంతా ఇది పెద్ద ఫ్యాక్టరీ అని చెప్పవచ్చు. ఆటోనగర్ ఫలితంగా ఇతర అనేక అనుబంధ పరిశ్రమలు నెలకొల్పడానికి వీలు ఏర్పడుతున్నది.

ఇప్పుడు నూరు యూనిట్లు పనిచేస్తున్నాయి. మిగతావి వివిధ నిర్మాణ దశలలో ఉన్నాయి. ఈ దశాబ్దంలో 34 యూనిట్లతో కూడిన ఒక పారిశ్రామిక వాటిక ఏర్పాటు చేయబడింది. ఇటీవలి రెండు సంవత్సరాల కాలంలో పరిశ్రమల రంగంలో మునుపెన్నడూ లేని విధంగా అభివృద్ధిని సాధించారు. గత రెండు సంవత్సరాలలో రూ. 2.25 కోట్ల పెట్టుబడి పెట్టారు.

ఈ దశాబ్దిలో విద్యారంగంలో అమోఘమైన కృషి జరిగింది. 1961 జనాభా లెక్కలను అనుసరించి జిల్లాలో అక్షరాస్యత 31 శాతం ఉండగా ఇప్పుడు పాఠశాలలకు వెళ్ళే వయస్సుగల





విజయవాడ పాల ఉత్పత్తుల ఫ్యాక్టరీ పరిపాలన విభాగం భవనాలు

90 శాతం నుండి బాల బాలికలు పాఠశాలలకు వెళ్తున్న కారణంగా అక్షరాస్యత 41 శాతం వరకు పెరగవచ్చునని అంచనా. 1965–66 లో అప్పర్ ప్రాథమిక పాఠశాలలతో సహా ఎలిమెంటరీ పాఠశాలల సంఖ్య 2407 ఉండగా 1958–59 లో 1980 మాత్రమే ఉండేవి. ఎలిమెంటరీ పాఠశాలలకు వెళ్ళే బాలికల సంఖ్య 1968–69 నాటికి 3,12,369 కి పెరిగింది. అదేవిధంగా కళాశాలల సంఖ్య 5 నుండి 11 కు పెరిగింది.

కుటుంబ నియంత్రణ

కుటుంబ నియంత్రణ విషయంలో కృష్ణా జిల్లా రాష్ట్రానికే గాక దేశానికికూడా మార్గదర్శకంగా ఉంది. కృష్ణా జిల్లాలో 1967 లో సామూహిక కుటుంబ నియంత్రణ శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఇది ప్రపంచంలో నిర్వహించబడిన ప్రప్రథమ సామూహిక శిబిరం. ఇందులో 2180 టుబెక్టమీ శస్త్రచికిత్సలను నిర్వహించారు 1970 మార్చి ఆఖరునాటికి జిల్లాలో మొత్తం 41,688 కుటుంబ నియంత్రణ శస్త్ర చికిత్సలను నిర్వహించారు కలరా, మశూచి వంటి ముఖ్యమైన అంటువ్యాధులు వ్యాపించకుండా నిరోధక చర్యలను తీసుకున్నారు.

గ్రామీణ విద్యుదీకరణ

గ్రామీణ విద్యుదీకరణ విషయంలోకూడా జిల్లాలో గణనీయమైన కృషి జరిగింది. 1960–61 లో 308 గ్రామాలకు విద్యుచ్ఛక్తి సరఫరా చేయబడగా 1969 మార్చి ఆఖరు నాటికి ఈ సంఖ్య 462కు పెరిగింది. 1969 మార్చి ఆఖరు నాటికి మొత్తం 4609 విద్యుచ్ఛక్తి పంపు సెట్లను నెలకొల్పారు. 1970 మార్చి ఆఖరు నాటికి 1236 రేడియో సెట్లను నెలకొల్పారు

గత దశాబ్ది కాలంలో హరిజన, గిరిజన సంక్షేమ రంగంలో ప్రశంసనీయమైన కృషి జరిగింది హరిజన, గిరిజన కుటుంబాలకు నివేశన స్థలాలు కేటాయించడానికి రూ. 16 37 లక్షల ఖర్చుతో 428.88 ఎకరాల భూమి సేకరించారు. ఇంతవరకు 5,164 కుటుంబాలకు నివేశన స్థలాలు కేటాయించారు. 1970 మార్చి ఆఖరు నాటికి జిల్లాలో హరిజన, గిరిజనులకు 11 ప్రభుత్వ హాస్టళ్లు, 248 సబ్సిడీ పొందిన హాస్టళ్లు ఉన్నాయి. 905 మంది విద్యార్థులకు వసతి కల్పించారు. 1969–70 లో సాంఘిక సంక్షేమ పథకాల అమలుకు సాంఘిక సంక్షేమ శాఖ రు. 29 30 లక్షలు ఖర్చు చేసింది. 1969–70 లో ఎలిమెంటరీ, ఉన్నత పాఠశాలలకు వెళ్ళే 17825 మంది బీద విద్యార్థులకు పాఠ్యపుస్తకాలను పంపిణీ చేశారు ఈవిధంగా కృష్ణా గత దశాబ్ది కాలంలో అన్ని రంగాలలో అపూర్వమైన ప్రగతిని సాధించింది.

అనంతపురంజిల్లాలో అభివృద్ధి పనులకు కేంద్రం కేటాయింపు

అనంతపురం జిల్లాలో తరచుగా కరువు పరిస్థితులు ఏర్పడుతున్న కారణాన 1970–71 సం. లో గ్రామీణ అభివృద్ధిపనులను అమలుపరచేందుకు భారత ప్రభుత్వం అనంతపురం జిల్లాకు రూ. 61 61 లక్షలు కేటాయించింది.

కేంద్రం కేటాయించిన డబ్బులో రూ. 5 లక్షలు భూసార పరిరక్షణకు వినియోగించబడుతాయి ఈ పథకం క్రింద వరద కట్టలు, రాళ్లకట్టలు, మున్నగునవి నిర్మించబడుతాయి ఈ పథకం వల్ల భూసారం కొట్టుకొనిపోకుండా వుంటుంది భూమిలో తేమ నిలవవుంటుంది. భూగర్భంలో నీటిమట్టం పెరుగుతుంది. అడవుల పెంపకం కొరకు రూ. 940 లక్షలు ఖర్చు పెట్టబడుతాయి వ్యవసాయాభివృద్ధి కొరకు చిన్నతరహా నీటివనరుల మరమ్మతు పనులు నిర్వహించబడతాయి జిల్లా పరిషత్తు, పంచాయతీ సమితుల అధీనంలో వున్న చెరువులు బాగుచేయబడుతాయి ఇందుకు కావలసిన డబ్బు కూడా కేంద్రం కేటాయించిన మొత్తం నుంచి ఖర్చు పెట్టబడుతుంది.

గ్రామాల్లో పక్కా రోడ్లు అభివృద్ధిపరచబడుతాయి. వీటి కొరకు రూ. 12 లక్షలు కేటాయించబడినాయి. రోడ్లు భవనాలశాఖ అధీనంలో వున్న పెద్దరోడ్లను అభివృద్ధిపరచడానికి కూడా రూ. 9 లక్షలు ఖర్చు పెట్టబడుతాయి.

చతుర్థ ప్రణాళిక అంతంనాటికి గ్రామీణ పనుల కార్యక్రమం క్రింద రూ. 2 కోట్లు ఖర్చు పెట్టబడుతాయి.

తెనుగు బాస

ముదిగొండ వీరభద్రమూర్తి

****

మంచి గుమ్మడికన్న దంచిన యెజ్జని
క్రొవ్వడ్ల బియ్యము కూడుకన్న
మేల్ జహాంగీరు మామిడి పండు కన్న సుం
గాజీన లేసజ్జ కంకికన్న
పిరియ మాగిన దాకకన్న చక్కెర తగ
పోసి వండిన పాల బువ్వకన్న
రస దాడికన్న పనసతొన కన్న క
జూరము కన్నను జున్ను కన్న

అలతి పెరతేనియలకన్న నామని తటీ
కొసరి కూసిన కోయిల కూతకన్న
ముద్దు లొలికెడి జవరాలి మోవికన్న
తియ్య నైన దెయ్యది? యదే తెనుగుబాస.

ఒడిది యక్కరముల పలయిక సమసర
మ్మరు దయ్యు నూగించు బిరుదు గలది
వీణ మీటిన యట్లు వినబడి పిల్లన
గ్రోవి యూదిన యట్ల కూర్పు గలది
శివకవి హరిహరాదులను మఱచిపో
నటుల జనుల చేసి నలవు గలది
తొమ్మిది లక్షల దొడ్డపోటరి విండ్ల
నారి మ్రోయించిన సౌరు గలది

మీకు రానిది యీనాటి మీ కయిలకు
పట్టుదల లేనిది తెనుంగు బాస యంచు
గుర్తెఱుగు డోయి! యాంధ్రము కుస్తరించు
ననుగులార పల్ బాసల మఱుగు లార!

ఈ బాస ధూర్జటి సేబాసన వచించి
కన్నబోయడు ముత్తికాలు ద్రొక్క
నీ బాసలో 'లా'కు నేత్వమ్ము 'దా' కు కొ
మ్మియక భాస్కరుం డిపుడు నుండె
నీ బాస మాటాడి యెల్లరి గణపతి
ఒక్క గొడుగు నీడ నుంచి మురిసె
నీ బాసతో కాపుటిండ్ల పాలించి రా
యలు భువన విజయ మందు కొనియె

క్రోల్పులిని చూచి కుందేలు గుబ్బు మనిన
చప్పు డీ బాసలోనిది, చెప్పవచ్చు
నెంతయేని తెన్గొందిన మంతు గూర్చి
దీనికీ నాడు పట్టిన దిగులు గూర్చి

పైడికినిం బదమ్మునకు ప్రాతలు క్రొత్తలు లేవు, లేనిచో
వాడుక లేనియట్లె యగు బావి జలమ్ములు వోలె శబ్దముల్
వాడు కొలంది శోభిలును, పంతము పట్టుడి నేడు నాల్కపై
నాడవలెన్ చతుర్విధ మహాంధ్ర మశేష మటంచు నాంధ్రజుల్!

జాతీయత విడి యంత
ర్జాతీయత కొఱకు సేయు సాము జననికిన్
ప్రాతయు ప్రాశన మొసగక
భూతలమును బ్రోతు నన్న బుద్ధియు నొకటే

మూవురు లింగమూర్తులకు భోగము సెల్లెడునంతదాక గో
దావరి పాయపాయ వఱదల్ రవళించెడునంతదాక కృ
ష్ణావిమలాంబు పూరమున చంద్రిక యాడెడునంతదాక నాం
ధ్రావని కొంగు బంగరుగనై నిరుపేదల దేర్చి ప్రోచుతన్!

తెలుగుదనం

శ్రీదమై కృష్ణానది దివ్య జలము
గోదావరీ పావనోదార ధారం
ఎది యోదరయతోడ నాదరింపంగ
కేదారములు జీవనోదకమ్ముందు
తెలుగు సముద్రపు తీరమ్ములందు
కలిగించు చుండె కలిమి పంటలను
ఆంధ్రదేశమ్ము ధాన్యాగారమయ్యె
ఆంధ్రతీరమ్ము ధన్యత్వమ్మునొందె.
అన్య రాష్ట్రములకు నన్న పూర్ణమ్మ
ధాన్యరాసులు పంపు పుణ్యాంధ్ర జనని
సుషలయై, సుఫలయై, సుకలయై యొప్పె
అజరామరమ్ముగా ఆంధ్ర తీరమ్ము.
దక్షిణ భారత ధాత్రి నెల్లరకు
భిక్షమ్ము పెట్టెడి దాక్షిణ్య సీమ
అని ప్రశంసించి నారాంధ్ర తీరమును
విని "హాయి" యంటిమి తెలుగువారలము
కాని యేదియొ దుష్ట కాలమ్ము వచ్చె
ఏ నాడు కనరానిదీనాడు మనకు
ఏ పాప ఫలితమో, ఏశాపగతియొ
ఏ పుణ్యమూర్తుల కోపాగ్ని పనియొ!
విరివిరిగా నతి వృష్టి, వరదలు, ముంపు
కఱవు, కాటకములు కలుగుచున్నయవి
పసువులు, మనుజులు, పాడిపంటలను
కసవులు, ధనములు, మసిలోన గలియు
ముంపుతో నెన్నెన్నొ కొంప లారునుగ
కంపుతో నెందఱో కలరాకు హతులు
నీటిలో మునుగును నిమ్మస్థ లాలు
ఏ పేట నిటులౌట నెట్టు లాపుటయొ
కాల్వల యెగువ భాగములందు నీరు
నిల్వంగ "డాములు" నిర్మింపవలయు
మురుగు నీరెల్ల సముద్రమ్మునందు
త్వరితమ్ముగా జేరుపని చేయవలయు
కట్టల, నెత్తుగా, దిట్టంబుగాగ
కట్టించ వలయును కాల్వ గట్టులకు
కాటను దొరగారి కట్టడమ్ములకు
సాటిగా నవసృష్టి సాగి పోవలయు
మన ఇంజినీర్లును, మన నాయకులును
మన పెద్ద రైతులు ననుభవజ్ఞులును
జన హితమ్మునకునై శ్రమ జేయుచున్న
మన ప్రభుత్వము తోడ మనసిచ్చి, కలిసి
పూర్వంపు టౌన్నత్యమున దృష్టి పడక
సర్వ నవీన విజ్ఞానమ్ము కలిగి
తెలుగు నాటిని తీర్చి దిద్దంగజాలు
కలలను గని, చేయవలయును పనులు

కర్లపాలెం కుటుంబశాస్త్రి

పాఠకుల లేఖలు

మీ మాస పత్రికను క్రమంగా చదువుతున్న వారిలో నేనొకరినని చెప్పుకోవడానికి సంతోషిస్తున్నాను. ఆంధ్రప్రదేశ్‌కు సంబంధించిన అన్ని రంగాల వివరాలు మాకు మాసమాసం తెలియజేస్తూ మమ్మల్ని అలరిస్తున్నందుకు అభివందనములు తెలియజేసుకుంటున్నాను.

— రామిశెట్టి లక్ష్మీకాంతమ్మ
మద్రాసు—1

"ఆంధ్రప్రదేశ్" మాసపత్రికలో చక్కని కళా సాహిత్య విజ్ఞాన వ్యాసములు ప్రచురించి సాహిత్య ప్రపంచంలో చిరస్థాయిగా మీ పత్రిక నిల్చింది.

—పెరుమాళ్ళ రఘునాధ్
రాజమండ్రి

మన 'ఆంధ్రప్రదేశ్' మాస పత్రిక మునుపటికంటే చాలా త్వరగా మార్కెటుకి వచ్చుటయే కాక ఎంతో ఆకర్షణీయంగా కూడా రూపొందుతున్నది, అందులకు మీకు, మీ శాఖ వారికి నా హృదయ పూర్వక ధన్యవాదాలు.

—ఎస్. కృష్ణారావు
భీముని పట్నం


"ఆంధ్రప్రదేశ్" అశేష పాఠకులలో నేనూ ఒకణ్ణి. ముందు నుంచే చదువుతున్నాను. అయితే ఇప్పుడిప్పుడు ఆకర్షణీయంగా ఉంది. వివిధ విషయాలపై వ్యాసాలు, కథలూ, గేయాలు, ఫోటోలతో పత్రిక ఆసక్తికరంగా ఉంది. ఛాయాచిత్రాన్ని ఎక్కువగా ప్రచురించండి. అందంగా ఉంటుంది పత్రిక.

— రేణుశ్రీ
అనంతపురం

"ఆంధ్రప్రదేశ్" మాసపత్రికలో ధారావాహికంగా ప్రచురిస్తూ, సెప్టెంబరు సంచికతో సమాప్తమైన "మన చరిత్ర—సంస్కృతి" అన్న సీరియల్ తెలుగు జాతి వికాసానికి, తెలుగు సంస్కృతి స్వరూపానికీ మకుటాయమానంగా వున్నది. పది కాలాలపాటు పదిల పరచుకొని సమగ్ర ఆంధ్ర ప్రతిబింబాన్ని దర్శించుకోదగిన దర్పణం ఈ సీరియల్.

—నూలు చెన్నకేశవులు,
మద్రాసు–3.

సంతాన నిరోధ సారస్వతం



రావూరు వెంకట సత్యనారాయణరావు

మానవ సృష్టి ఆరంభమైనప్పుడు ప్రతి కుటుంబంలో ఎక్కువమంది సంతానం రావాలని, ఆ విధంగా మానవజాతి అభివృద్ధి చెందాలని ఆశించేవారు.

పశ్చిమదేశ వాసులు ఏడం, ఈవ్ లను ఆదిదంపతులుగా భావిస్తారు. భారతీయులు మనువు, సత్రుపా ఆదిదంపతులని విశ్వసిస్తారు. దీని విషయమై కొన్ని సందేహాలున్నమాట సత్యం.

"ఆదిలో తల్లిదండ్రులనీ, అన్నచెల్లెళ్ళనీ విచక్షణ ఉండేది కాదు. అందువల్ల వీరందరూ విచక్షణ లేకుండా సంగమ క్రీడల్లో మునిగి తేలేవారు. వేలాది సంవత్సరాల తర్వాత సాంఘిక నియమాలు ఏర్పడినాయి. ఈ విధంగా మన సంఘం ఒక పరిణామ దశ నందుకొంది. ఆరోజుల్లో "పదుగురు కొడుకుల తండ్రి" అంటే చక్రవర్తిగా భావించి గౌరవించేవారు." అని రాహుల్ సాంకృత్యాయన "వోల్గానుంచి గంగవరకూ" అనే గ్రంథంలో పేర్కొన్నారు.

ప్రథమ మనువూ : పరిమిత కుటుంబం

"పరిమిత కుటుంబం" అనే భావం ప్రథమ మనువుకే కలిగిందనీ–ఆయన అధిక సంతానాన్ని అరికట్టడం కోసం తన కుమారులకు "సంయమనం" ఉపదేశించాడనీ మనుస్మృతిలో పేర్కొనబడింది. జనాభాను అరికట్టడమనే భావానికిది నాందిగా స్వీకరించవచ్చు.

అయితే అయిదువేల సంవత్సరాలకు పూర్వమే చరకుడు–తన వైద్యగ్రంథంలో పరిమిత సంతానాన్ని గురించిన అద్భుత యోగమొకటి పేర్కొన్నాడు. సుశ్రుతుడు కూడా ఈ విషయం పైన కొన్ని సూచనలు చేశాడు.

తర్వాత శ్రీ సిద్ధ నిత్యనాథ్ ఆయన రచించిన 'రస రత్నాకరం' లో స్త్రీలకు గర్భధారణ రాకుండా ఒక యోగాన్ని ప్రతిపాదించాడు. నాగార్జునుడు తను రచించిన "యోగ రత్నాకరం" లో గర్భనిరోధాన్ని గురించి వివరించాడు.

మధ్యయుగంలో కూడా భావప్రకాశ్, బృహత్ యోగ తరంగిణి, పంచసాయక కోకశాస్త్రం, కామ సూత్రాలు–వీటి అన్నిటిలో – గర్భనిరోధక సూత్రాలు వర్ణించ బడినాయి.

పూర్వకాలపు భిషగ్వరులకు – కొన్ని మూలికల ద్వారా పురుషులకు తాత్కాలిక "అప్రయోజనత్వం" సిద్ధింపజేయడం తెలుసు. అలాగే స్త్రీల విషయంలో కూడా–సంతాన హీనత్వ స్థితి కల్పించడం తెలుసు. వీనికి సంబంధించిన వివరాలు చాలావున్నాయి.

పూర్వగ్రంథాలు

సంతాన నిరోధాన్ని గురించి ప్రస్తావించిన గ్రంథాలు అనేకం వున్నాయి. అందులో ముఖ్యమైనవి కామ సూత్రాలు, అనంగ్ రంగ్, ఇంద్రజాలాతి, సంగ్రహ కామురత్న, నాగరిక సర్వ శరణ్య, యుద్దిష్టాంధ్ర, దత్తాత్రేయ తంత్రం, కుట్టి నిమంత్ర తంత్రం, ఔషధి భావిప్రకాశ్, పవన విజయం, స్వరోదయం – అయితే భారతదేశంలోని మతప్రవక్తలు, గురువులు, ఆచార్యులు సంతానం పరమభాగ్యంగా భావించేవారు. సంతాన నిరోధకానికి కృత్రిమ పద్ధతుల నవలంబించిన దలచినవారిని ఎంతో హేయంగా చూచేవారు. పైగా ఆ కాలంలో పురుషులు సంయమనం కలిగివుండేవారు. రతి క్రీడలకు సంబంధించిన అనేక నిబంధనలను పాటించేవారు. అందువల్ల సంతాన నిరోధ భావం కలగడానికి అవకాశాలుండేవి కావు.

మొగలుల కాలంలో

కొంతకాలానికి మొగలుల పరిపాలన వచ్చింది. వారు "యూనానీ" వైద్యానికి ప్రాధాన్య మిచ్చారు. ఆయుర్వేదం తాత్కాలికంగా క్షీణత నందుకొంది. మొగలుల కాలంలో శృంగార శాస్త్రం అభివృద్ధి చెందింది. వారి తర్వాత బ్రిటిష్ వారు పాదం పెట్టారు దేశంలో. వారిప్రభావం వల్ల భారతీయుల ఆచార వ్యవహారాలు, మర్యాదలు, సంస్కృతి, జీవన విధులు వెనకడుగు వేసినాయి.

సంతానం విషయంలో పాశ్చాత్యుల అభిప్రాయాలకు ప్రాబల్యం సమకూరింది, ప్రతి పౌరుడూ దేశానికి ప్రతిష్ట కల్పించే వాడుగా వుండాలనే అభిప్రాయం వారినుంచి వెలువడింది. కొద్దిమంది ప్రజలు, సుశిక్షితులైన ప్రజలు ఆరోగ్యవంతులైన ప్రజలు–అనే భావాలను వారు ప్రచారంలోకి తీసుకు వచ్చారు. అంటే – సంతాన నిరోధాన్ని వారు చమత్కారంగా బోధించడం ప్రారంభించారు. భారత ప్రజలు వారి అభిప్రాయాలతో చాలా వరకు ఏకీభవించడం ఘనంగా భావించడం ప్రారంభించారు.

అనిబిసెంటు గ్రంథం : ప్రజల ఆగ్రహం

ఈ సంతాన నిరోధక ఉద్యమాన్ని పందొమ్మిదవ శతాబ్దంలో ప్రచారానికి తెచ్చింది డా. అనిబిసెంటు. ఈమె వ్రాసిన "లా ఆఫ్ పాపులేషన్" అనే గ్రంథం 1887 లో ప్రచురించ

బడింది. దాన్ని చూచి భారతీయులు ఎంతో ఏవగించుకొన్నారు. ఆమెను విమర్శించారు. అంతేకాదు, బొంబాయి మేజిస్ట్రేటు కోర్టులో ఆమె మీద ఒక దావా కూడా వేశారు. ఆ కోర్టులో ఆమెను నేరస్తురాలుగా భావించి తీర్పు యిచ్చారు. కాని బొంబాయి హైకోర్టు ఆమెను నిర్దోషిగా భావించి కేసు కొట్టివేసింది. అప్పటి న్యాయమూర్తి జస్టిస్ పేసన్–ఆ గ్రంథంలో జుగుప్సాకరంగా ఏమీ లేదనీ–జనాభాను అరికట్టేమార్గాలు చెప్పడంలో తప్పేమీ లేదనీ తీర్పు చెప్పారు.

తర్వాత 1911 లో హాలండ్ నుంచి డాక్టరు అలాటా జాకబ్ అనే ఆమె భారత దేశానికి వచ్చి "జనాభా తగ్గుదల" ఉద్యమాన్ని కొంత ప్రచారంలోకి తెచ్చింది. పెద్ద పెద్ద కుటుంబాల వారిని కలుసుకొని ఈమె చాలా సలహాలు యిచ్చింది.

సంతాన నిరోధానికి సంబంధించిన సారస్వతం క్రమంగా భారతీయ భాషల్లోకి ప్రాకింది. నాటకం, కవిత్వం, పాటలలాగానే ఈ సారస్వతం కూడా ఒక శాఖగా రూపొందింది. మొదట వంగభాషలో ఉద్భవించి, హిందీలోకి దూకి క్రమంగా తక్కిన భాషల్లో అవతరించింది.

వంగభాషలో ప్రథమ గ్రంథం

1904 లో శ్రీ నాగేంద్రనాథ్ ముఖోపాధ్యాయ అనే ఆయన "కన్యాదేకా ప్రతీకార్" అనే గ్రంథాన్ని వంగ భాషలో వ్రాసాడు, ఇది ఎంతో ఉపయోగకర గ్రంథంగా పరిగణింపబడింది. దేశభాషలో నిర్భయంగా వ్రాయబడి ప్రజలలో బహుళ ప్రచారం పొందిన గ్రంథం ఇది:

1932 లో శిశిర్ పబ్లిషింగ్ హౌస్ వారు సంతాన నిరోధం మీద మూడు గ్రంథాలు వెలువరించారు. తర్వాత ప్రభుత్వం వీటిని అశ్లీల గ్రంథాలుగా భావించి నిషేధించింది. 1924 లో ప్రొఫెసర్ గంగూలీ "సంతాన నిరోధం" అనే చిన్న పుస్తకం వ్రాసారు. ఈ చిన్న పుస్తకం విశేష ఆదరణ పొందింది. తర్వాత ప్రొఫెసర్ డయర్ "పరిమిత కుటుంబం" ఈ. ఎం. అయర్ "సంతాన నిరోధక చర్యలు" ప్రొఫెసర్ ఫాడ్కే "భారత దేశంలో శృంగార సమస్యలు" అనే పుస్తకాలు వ్రాశారు.

శ్రీ నృపేంద్రకుమారబోసు వంగభాషలో వ్రాసిన "జనం పషన్" అనే గ్రంథం సంతాన నిరోధక గ్రంథాలలో ఉత్తమంగా పరిగణించబడింది. 1927 లో జనం సమితి వారు "సంతాన నిరోంధ" అనే వ్యాసం ప్రచురించారొక మాస పత్రికలో. 1930 లో మొట్టమొదటగా మైసూరు సంస్థానంలో "ఫ్యామిలీ ప్లానింగ్" సంస్థ స్థాపించబడింది. భారత దేశంలో ఏర్పడిన ప్రప్రథమ సంస్థ ఇదే! 1933 ఏప్రెల్‌లో శ్రీ కార్వే మరాఠీ భాషలో "సంతతి నియమం" అనే చిన్న పుస్తకం వ్రాశారు.

రెండేళ్ల తర్వాత మిసెస్ మార్గరెట్ సామర్, మిసెస్ ఎడిత్ మార్టిన్ అనే ఇద్దరు ఇంగ్లీషు వనితలు మన దేశం చేరారు. సంతాన నిరోధన ప్రచారం నిమిత్తం. 1936 లో ప్రిన్స్ ఆఫ్ వేల్స్ మెడికల్ కాలేజి మేగజిన్ సంతాన నిరోధం మీద ఒక ప్రత్యేక సంచిక వేసింది.

పెద్దల ఆమోద ముద్రలు

ఇంగ్లీషులో ఆకాలంలో పద్దెనిమిది పుస్తకాలు వెలువడినాయి. హిందీలో–సంతాన శాస్త్ర, సంతాన్ సంఖ్యాకా సీమాబంధన్, గర్భ నిరోధ్, సంతాన్ నిరోధ్ విజ్ఞాన్, వ్యవహారిక జన్మ నిరోధ్, గర్భ శాస్త్రం– మొదలైన గ్రంథాలు వెలువడినాయి. 1940 లో హిందీలో వెలువడే ఆయుర్వేద "ధన్వంతరి" పత్రిక "నారీ వాగన్క" అనే ప్రత్యేక సంచిక ప్రచురించింది.

భారత దేశ నాయకులు చాలామంది ఈ ఉద్దేశాన్ని వారివారి అభిమతాన్ని అనుసరించి సమర్థించారు. ఠాగూర్, సరోజినీదేవి, స్వామి వివేకానంద, శ్రీ సంపూర్ణానంద, కలనల్ బోస్, డా. చటర్జీ, పండిత నెహ్రూ వీరంతా ఈ ఉద్యమాన్ని బలపరిచారు. గాంధీజీ ఈ విషయమై ఇలా వ్రాసారు–"భారత దేశానికి సంతాన నిరోధం అవసరమే. కాని దీనికి సంయమనం ఒక్కటే మార్గమని నా విశ్వాసం" గాంధీజీ అభిమతం ప్రకారం ఈ ఉద్యమాన్ని కొనసాగించ తలచిన వారెంతమంది వుంటారు, ?...లేరు,... అందువల్లనే అనేక పద్ధతులు అమలులోనికి తేవలసివచ్చింది.

సంతాన నిరోధ ఉద్యమాన్ని ప్రబోధించే నిమిత్తం ఇటీవల పత్రికలు, వ్యాసాలు, నాటకాలు వగైరాలు ఓహరి సాహరిగా వెలువడినాయి. ఈ సారస్వతం అనంతం.

[ఈ వ్యాసరచనకు వైద్య అంబాలాల్ జోగి, కె. అచ్చయ్య, రాహల్ సాంకృత్యాయనుల వ్యాసాలు తోడ్పడినవి.]

మనీష-నినీష

—బెల్లంకొండ చంద్రమౌళిశాస్త్రి

తమ జగద్యాత్రలో ఒకసారి కాశీపురానికి విచ్చేశారు శ్రీ శంకర భగవత్పాదులు. అప్పుడు వీథిలో చండాలరూపంలోవచ్చి తోసుకుపొయ్యే పార్వతీ పరమేశ్వరులను ఆచార్యులవారు తొలగి పొమ్మనగా వారికి జరిగిన సంవాదమూ, దానికి అనువాదమూ

శ్రీ విశ్వనాథ సంద
ర్శావహ చిత్తమున శంకరాచార్య వరుం
డా వారణాసి వీథుల
బోవుచునుండెన్ విముక్తి భువియని యటకున్.

కడజాతి వేసమున తన
పడతియు తానును యతీశు పథసవిధమ్మున్
గడచెడి శివుల స్వరూపము
ముడి తెలియక మునియు తొలగి పొమ్మన, నతఁడున్

"యతివర ! దేహమన్నమయమౌట నశౌచమెయౌ, నిజంబె, నీ
మతియెదియో—శరీరము శరీరము నుండి తొలంగు మంచునా !
సతమగు నాత్మ నాత్మనె విసర్జనఁజేసి తొలంగు మందువా !
అతుకని ఊహలన్ తొలగుమందువు వేరినొ చెప్పుయోచనన్ !?

నానా వస్తువిని స్తరంగ సహజానందావబోధాంబుధిన్
జ్ఞానీ ! ఎట్టులుగల్గె బ్రాహ్మడని చండాలుండనే భేదముల్ ?
ఔనే ! గంగని, బింబిరార్యమునకబ్బా ! క్రుళ్లు నీళ్లంచనన్—!!
పోనీ, కాంచన కుంభ మృద్ఘట జలమ్ముల్ వేరొ వ్యోమానకున్!

జాగ్రత్స్వప్నసుషుప్తులన్ వెలుగునే జ్ఞాన స్వరూపాత్మమో
యోగీ ! బ్రహ్మముదొట్టి చీమవరకౌనో జగత్సాక్షి ! త
ద్భోగాతీత మహస్సునే నగుదు, దృక్ప్రోద్భూతినేగాన, నే
అగాధజ్ఞమనీషనెంతు గురువంచాతండెవండైననున్ !!

జీవేశాదికభే దదుర్గుణ జగత్సిద్ధాంతముల్ చూడ మి
థ్యాఽ విద్యాదికమంచు, సచ్చిదమృతాద్వైతాధి రూఢాప్తి బ్ర
హ్మైవాహంబని యెంచు నాతడె సుఖుండౌ జుమ్మ, చండాలుడో
తావిప్రుండొయగున్ మనీషను గురుత్వాస్థాని నాకాతడే !

ఈ సకల ప్రపంచము నశించెడిదే యగు మాటిమాటికిన్
దేశికు వాక్య నిశ్చితమతిన్ పరమాత్మ విచార భావనా
వేశితు దుష్కృతంబుల వివిచ్చునుజ్ఞానమయాగ్ని, నేటియే
వీసము దోసమున్ అనుభవింపక పోదదెమన్మనీషయున్.

నరతిర్యక్ సురజీవజాల హృదయాంతంబై, అహంపూర్వసం
భరభాసంబయి, ఇంద్రియాఖ్య సన సవ్యాపారమౌ, మానస
స్థిర రూపాత్మ నెవండు సంతతము జ్యోతిస్ఫూర్తి భావించునో
పరమానందుడతండె నాకు గురువౌస్వామీ మనీషావధిన్.

కన, సింద్రాదులు తత్సుఖాంబుధి లవాంక ప్రాప్త సంతృప్తులై
చన, నిస్వార్థ ప్రశాంత భావకలనా సంతుష్టలబ్ధ ప్రబు
ద్ధుని చిత్తంబు మహాసుఖాబ్ధిమునుకందున్, మన్మనీషా నినీ
షను ఆచార్యుడు దేవవందిత పదాబ్జస్వామి యాతం," డనెన్—!!

* * * *

భవిష్యత్తుకోసం ఆందోళన చెందాలా?

— అచ్యుతుని లక్ష్మి కనకవల్లి

ఆందోళన చెందటము మానవస్వభావాలలో ఒకటి. ఏదో ఒక దానికై ఆందోళన చెందనివారు అంటూ వుండరేమో. ఆందోళన చెందటం వలననే హృద్రోగం, రక్తపు పోటు, నరాల నిస్త్రాణ, కొన్నిరకాల చర్మవ్యాధులు, నిద్రలేమి మొదలైన వ్యాధులు కలుగుతాయన్న సంగతి చాలా మందికి తెలియదు. డాక్టరు దగ్గర మందులు తీసుకొంటున్నాము. ఎంతకీ వ్యాధి నయం కావటంలేదు. ఈ డాక్టరు కంటె ఇంకో పెద్ద డాక్టరుకి చూపించుదామని డాక్టర్లను మారుస్తూ వుంటామేగాని అసలు వ్యాధికి మూలకారణం ఆందోళనే అని తెలుసుకోలేము. మనం ఏ విషయానికైతే ఆందోళన చెందుతున్నామో తెలుసుకొని దానికై ఆందోళన చెందకుండా కృషి చేయటానికి ప్రయత్నించితే వెంటనే వ్యాధి నయమౌతుంది. ఏపనీ లేకుండా వూరికే తీరుబడిగా కూర్చుంటే ఏదో ఒక విషయంపై మనస్సుపోయి ఆందోళనకి దారితీస్తుంది. పూర్వం యిప్పుడున్నంత ఎక్కువగా విలాస, వినోద అలంకరణ వస్తువులు వుండేవికావు. అందువలన స్త్రీపురుష లిరువురూ జీవనాధారానికై ఎక్కువగా పాటు పడవలసిన అవసరం వుండేదికాదు. ఏదో వున్నంతలోతిని కట్టుకొని భగవద్ధ్యానము చేస్తూ ప్రశాంత జీవితం గడిపేవారు. తీరుబడి కాలమంత భగవద్ధ్యానములో గడిపేవారు కనుక భవిష్యత్తుకై ఆందోళన చెందటానికి అవకాశం వుండేదికాదు. మన పూర్వులకి భగవంతునిపై పూర్తి నమ్మకం వుండేది. అయితే రానురాను ఆధ్యాత్మిక చింతన తక్కువైనది. వైజ్ఞానిక శాస్త్రం అభివృద్ధి చెందటం వలన అనేకరకాల విలాస వినోద, అలంకరణ వస్తులు ఆవిర్భవించినాయి. వాటిని అనుభవించాలి, మన పిల్లలకి కలుగ చేయాలి అన్నకోరికే ఆందోళనకి దారితీసే ముఖ్యకారణం.

మనం ఆశా వులం. నిజమే. ఆశవుండాలి కాని ఆందోళన చెందకుండా కృషి చేసిన నాడే మన ఆశ సఫల మౌతుంది. అలా కాకుండా ఆందోళన చెందటం వలన ఆశ సఫలంకాకపోగా ఇటు ఇంటా, అటు బయటా—అపజయానికి ఎన్నో కష్ట నష్టాలు సంభవిస్తున్నాయి. అందుకే భగవద్గీత నిష్కామ కర్మని ప్రబోధిస్తున్నది. మనం పెద్దలం ఆందోళన చెందటమేకాక మనం మన పిల్లలు కూడా అతి చిన్నవయస్సులోనే ఆందోళన చెందేటట్లు చేస్తున్నాము. ఇది ఎంతో దురదృష్టకరమైన విషయం. మన పిల్లల ఆరోగ్యము, భవిష్యత్తు మన చేతులారా మనమే నాశనం చేస్తున్నాము. మనచేత్తో మనకళ్ళని మనమే పొడుచుకుంటున్నాము.

యువకుల, విద్యార్థుల ఆందోళన అలజడులకి కారణం ఏమిటి? అని ప్రశ్నించితే భవిష్యత్తు నిరాశా జనకంగా వుండటమేనని విద్యార్థులు, నాయకులు తరచు చెప్పే సమాధానాలలో ఒకటి. విద్యావంతులైన ప్రతివారికీ వుద్యోగ అవకాశం లేక పోవటం వలననే ఆందోళన చెందుతున్నారన్నదే నిజమైతే ఆందోళన చెందవలసింది నిరుద్యోగులు మాత్రమే. వారైనా ఆందోళన చెంది అలజడులు చేస్తే వుద్యోగాలు దొరుకుతాయా? తాత్కాలిక లాభాపేక్షతో అలజడులు చేస్తూ అటు ప్రభుత్వ ఆస్తికి, ఇటు ప్రజల ఆస్తికి ఎంతో నష్టం కలిగిస్తున్నారు. పరిసరాలను బాగా పరికించి చూస్తే జీవించటానికి ఎన్నోమార్గాలు కనపడుతాయి. పూర్వము మద్రాసులోని బీచికి సైకిళ్ళమీద, కార్ల మీద వచ్చేవారు వారి వాహనాల టైర్లు పంచరు అయినాగాని, ఏదైనాలోపం రావటం వల్ల గాని ఎంతో యిబ్బందికి గురిఅవుతూ వుండేవాళ్ళు. తెలివిగా ఆ అవసరాన్ని గమనించిన ఒకరికి దగ్గర్లో ఒక వర్కుషాపు పెట్టాలనే చక్కని ఆలోచన కలిగింది. ఇదేవిధంగా జాగ్రత్తగా పరిశీలించి చూచి ఆలోచించితే విద్యావంతులైన నిరుద్యోగులకి ఏదోమార్గం కనిపిస్తుంది. మనస్సుంటే మార్గముంటుంది.

ఆహారపదార్థాల పెరుగుదల మొదలుకొని అణ్వస్త్ర ప్రయోగం వరకు విద్యార్థులు ఆందోళన చెందని విషయమేలేదు. ఇలా ప్రతివిషయానికి ఆందోళన చెందటానికి విద్యార్థులు తప్ప దేశంలో ఇహ ప్రజలే లేరా? విద్య నేర్వటము పూర్తి కాకముందే నిరుద్యోగ సమస్యను గురించి ఎందుకు ఆందోళన చెందాలి? ఆందోళనచెంది రేగే ప్రతి అలజడిలోను ఒకటవ తరగతి విద్యార్థుల నుంచి విశ్వవిద్యాలయం విద్యార్థుల వరకు పాల్గొనేటట్లు నాయకులు చూస్తున్నారు. ప్రాథమిక పాఠశాల విద్యార్థులలో కూడా భవిష్యత్తుకై ఆందోళన చెందాలనే విషబీజాన్ని నాటుతున్నారు. ఈభూమి పుట్టినప్పటి నుంచి ప్రజలు జీవించటమే లేదా?

మనకి స్వరాజ్యం వచ్చిన తరువాత అన్ని రంగాలలోను ఎంతో అభివృద్ధిసాధించినాము. ఆందోళనచెంది అలజడులు, అల్లర్లు లేపకుండా కృషిచేసి వున్నట్లైతే ఇంకా ఎంతో అభివృద్ధిసాధించి వుండేవాళ్ళము. కొన్ని దేశాలు స్వశక్తిచే గణనీయమైన అభివృద్ధి సాధించినాయి. మనంకూడా ఆ దేశాలలాగా కష్టించి పనిచేసి అభివృద్ధి సాధించటానికి బదులు వాటిని చూచి అసూయచెంది ఆశలు పెంచుకొని ఆందోళన చెందు తున్నామేగాని కృషి చేయటం లేదు. అభివృద్ధిచెందిన దేశాల ప్రజలుకూడా మనలాగా పునాది వేయగానే హాయిగా మేడలో వుండేది ఎప్పుడని ఆందోళన చెంది అలజడులు చేసివుంటే గణనీయమైన అభివృద్ధి సాధించగలిగేవారు కాదు. ఆదేశాల ప్రజలు ఈనాటికీ దేశాభి వృద్ధికి ఎంతో కృషి చేస్తూనే వున్నారన్న సంగతి మనం మరచి పోతున్నాం.

విద్యార్థుల ప్రథమ కర్తవ్యము విద్యనేర్వటము, అభిరుచి వున్నరంగంలో కృషిచేయటం. కంచము ముందు కూర్చోక ముందే కడుపునిండా తిండిలేదేమోనని ఏడిస్తే కడుపు నిండు

(ఎదుటి పేజీలో)

నూతన గీతం

గంధం జోయెల్

నేడు మళ్ళీ ఒక మధుర గీతాన్ని
నేను గళమెత్తి పాడాలను కున్నాను

ఈరోజున చీకటిని విడచి, విషాదాన్ని మరిచి,
క్రొత్తకాంతి దీపాల్ని వెలిగించి,
మోడువారిన నా యెడదలో అనురాగపు
భావాన్ని చిగురింపజేసి, విచిత్రమౌ
పాటను నా ప్రజలకోసం వినిపించాలని
మాటి మాటికీ మనసులో అనుకున్నాను!

వ్యథల మరపించేది, ఎదలు కలిపించేది,
అందరినీ ఒక త్రాటిపై నడిపించేది,
ఆనందాన్ని పంచేది, సరిక్రొత్త గేయం
మరల ఏరి కోరి పాడాలనుకుంటున్నాను
హృదయ వీణను మీటి ప్రతి కోణమునుండి
పలువురి ప్రశంసల్ని అందుకోవాలను కున్నాను
బుద్ధదేవుని జన్మభూమిలో పుట్టానని,
శ్రీరాముడేలిన పుణ్యభరతోర్విలో వున్నానని.
విశ్వానికి ఒక వినూత్న శాంతి సందేశాన్ని
వినిపించాలని గొంతు పెంచిపాడుతున్నాను!

పుణ్య గంగానదీమతల్లిని సంస్మరించి.
కృష్ణమ్మను రమ్మని ప్రేమతో ఆహ్వానించి
మూసీ సంగీత సుస్వరంతో శృతి కలిపి,

ఈ రోజు జనరంజిత రాగాలాపన చేసి,
మరల ఒక గీతాన్ని పాడాలను కున్నాను!

దేశ భక్తిని హృదయాల్లో పెంచుకొని,
గుండె గూట్లో వసించే శాంతి కపోతాన్ని
గగన సీమలోకి ఎగుర వేద్దాం రండి!
గరం భయం గంప నెత్తి మీది నుండి దింపి,
రేపటి తోటలో వికసించే గులాబీల నేరుకొమ్మని,
చెల్లా చెదరైన జాతి రత్నాల్ని ప్రోగు చేసుకుందాం!
మళ్ళీ జనుల సుఖానికి మల్లె పందిరి వేద్దాం!
రమ్మని, పాడుదాం గుండె గుండె కొక గీతాన్ని!


ఆకాశ కన్య నల్లని చీర ధరించింది,
చీకటి పడిందని చింతించకు నేస్తం!
విలువైన ఉదయం, అరుణారుణపు బంగారు
కిరణాల్తో ప్రభాకరుడు మళ్ళీ వస్తాడు.
మనదేశం నందన వనంగా మారాలని,
కోటి సుఖ సంపదలతో ప్రజలు వర్ధిల్లాలని,
నామాటకు, నాపాటకు విశాల విశ్వంలో
నవ్వులు పరిమళం నిండిన పువ్వులు కావాలని,
విలువైన భవిష్యత్తుకు మెత్తని మక్‌మల్
పరదాలు కట్టి స్వాగతం పలకాలని
ఈరోజు హృదయపు బరిణెలో కరుణరసం నింపి,
మరల నేడొక గీతమాలపించాలను కున్నాను!

(ప్రక్క పేజి నుండి)

తుందా? అటు భగవంతునిపై గాని, ఇటు స్వశక్తిపై గాని, కృషిపై గాని పూర్తి విశ్వాసం లేని నాయకులు స్వార్థప్రయోజనాన్ని ఆశించి భావిభారత పౌరులకి ఉజ్జ్వల భవిష్యత్తు చూపించి చేయూత నివ్వటానికి బదులు భవిష్యత్తుని గాంఢాంధకారంగా సృష్టించి ఆందోళన కలుగచేస్తున్నారు.

వ్యాకులత చెందకుండా జీవించటం ఎలా అని డేల్ కార్నేజి వ్రాసిన పుస్తకంలో మొదటి అధ్యాయంలో ఒక వైద్య విద్యార్థిని గురించి వ్రాశారు. ఎందుకో ఆలోచించండి. 1871లో ఒక వైద్య విద్యార్థి ఆఖరి సంవత్సరం పరీక్షల్లో ఉత్తీర్ణుడను కాగలనా? ఎక్కడ ప్రాక్టీసు పెట్టాలి? ఎలా అభివృద్ధిలోకి రావాలి "అని ఒకటే ఆందోళన చెందినాడు. దూరంగా మసకగ కనిపించేదానికై చూడటం మన ముఖ్యమైన పని కాదు. దగ్గరగా స్పష్టంగా కనిపించే దానికై చూడటం మన ముఖ్యమైన పని. అనగా భవిష్యత్తుని గురించి ఆందోళన చెందక తక్షణ కర్తవ్యాన్ని నేరవేర్చాలి అని భావము. అది థామస్‌కార్లైల్ వ్రాసిన ఒక పుస్తకంలో చదివి వెంటనే చరణలో పెట్టినాడు. అతనే సర్ విలియమ్ ఆస్లర్. ఈయన ప్రపంచ ఖ్యాతి చెందినారు. బ్రిటీషు ప్రభుత్వముచే వైద్యులకొసగబడు అత్యున్నతమైన గౌరవనీయమైన "రీజియస్ ప్రొఫెసర్" పదవిని ఆక్సుఫర్డులో అలంకరించినారు. ఈయన తన తక్షణ కర్తవ్యమైన పరీక్షల్లో ఉత్తీర్ణుడు కావటానికి చదువు యందు శ్రద్ధవహించక ఆందోళన చెందుతూ కూర్చుండి వుంటే అంత గొప్పవాడు కాగలిగేవాడా? మన విద్యార్థులంతా సర్ విలియమ్ ఆస్లర్ లాగా భవిష్యత్తుకై ఆందోళన చెందకుండా చదువుయందే శ్రద్ధ వహించాలి.

అమెరికా వంటి దేశాలలో వయోవృద్ధులు కూడా భవిష్యత్తుకై ఆందోళన చెందకుండా జీవించటము ఎలాగో నేర్చుకుంటూ వుంటే మన దేశంలో ఆందోళననే అక్షరాభ్యాసంగా చేయటం ఎంతో విచారించతగ్గ విషయం. ఆందోళన చెందకుండా కృషి ఎలా చేయాలోనన్న శిక్షణ మన నాయకులకే యివ్వటం ఉత్తమం. ఆందోళన చెందకుండా జీవించటం ఎలాగో పాఠ్యాంశాలలో చేర్చటం అత్యుత్తమం.



చేనేత పరిశ్రమ నాడూ నేడూ

ఎదిరె చెన్నకేశవులు

మన దేశంలో 90 శాతం ప్రజానీకంయొక్క జీవనోపాధి వ్యవసాయంపై ఆధారపడి ఉంది. తదితర ప్రజానీకంయొక్క జీవితం వ్యాపారం, భారీపరిశ్రమలు, కుటీర పరిశ్రమలపై ఆధారపడి ఉంది. కుటీర పరిశ్రమలలో అన్నిటికంటె ముఖ్యమైనదీ, కోట్లకొలది ప్రజానీకానికి జీవనోపాధి కల్పించేదీ చేనేత పరిశ్రమ. చేనేత కళాకారులయొక్క చేతినైపుణ్యత మన దేశంలోనే గాక విదేశాలలో కూడా ప్రకటితమై అచటి వారిని ముగ్ధులను చేసింది.

ఆనాడు మనదేశంనుండి విక్టోరియా రాణికి ఒక అగ్గిపెట్టెలో ఎనిమిది గజముల చేనేత చీరపెట్టి పంపారట. మాంచెస్టర్ మల్లు కంటే చాలా నాణ్యమైన ఆ వస్త్రమును విక్టోరియా రాణి చూసి వేనోళ్ళ కొనియాడింది. ఆకళాకారుల్ని విదేశాలకు రప్పించి, వారి బొటన వ్రేళ్లను నరికించి, భారతదేశంలో చేనేత కళను అంతంచేయాలని ఎంతో ప్రయత్నించారట. కాని భారత దేశంలోని చేనేత కళాకారులలో తరతరాలనుండి వారి రక్తనాళాలలో జీర్ణమైపోయిన చేనేతకళా నైపుణ్యత, ఈనాటికీ ప్రస్ఫుటమవుతూనేవుంది. ఔరంగజేబుకాలంలో అతని అమ్మాయి, ఒకరోజు చేనేతవస్త్రముతో తయారుచేసిన ఏడు పొరల గౌను వేసుకొని తండ్రి ఎదుటకు రాగా నగ్నంగా ఎందుకు వచ్చినావని కళ్లుమూసుకున్నాడు. పూర్వంనుండి చేనేత వస్త్రాలు గొప్ప నాణ్యమైనవి అనుటకు ఇవే నిదర్శనములు. పూర్వ చరిత్రను తిరగవేస్తే చేనేతవస్త్రముల నాణ్యతను గూర్చిన ఎన్నో నిదర్శనాలు లభిస్తాయి.

పూర్వం దేవాలయాలలో దేవతా విగ్రహాలకు ఉపయోగింపబడే పట్టు పీతాంబరాలను, నేసితెచ్చిన చేనేత కళాకారుల్ని కవులను, చిత్రకారులను, శిల్పులను పల్లకీల్లో కూర్చోబెట్టి, ఊరేగిస్తూ తీసుకెళ్ళి వారికి ఘన సన్మానం చేసేవారు. ఈ నాటికి అట్టి గౌరవ మర్యాదలను పొందే కవులు, కళాకారులు లేక పోలేదు. మన భారతదేశంలో తెలంగాణా ప్రాంతపు చేనేత వారు రెండో ప్రపంచ యుద్ధ సమయములో నూలు ధరలు విపరీతంగా పెరిగిన కారణాన, నూలు మొదలగు అవసర వస్తువులు కొని, నేతనేసి, చేనేత వస్త్రములను, మార్కెటులో అమ్మ కొనుటకు తగిన 'ఆర్థిక' పరిస్థితులు' వారికి లేని కారణం చేత, ఎందరో తమతమ గ్రామాలను వదిలి, రాష్ట్రేతర ప్రాంతాలకు అనగా షోలాపూర్, బొంబాయి, పూనా, అహమ్మదాబాద్, అహమ్మద్ నగర్‌కు వలస వెళ్ళారు. ఈ వలస వెళ్ళని చేనేత వారి కుటుంబాలెన్నో తెలంగాణా ప్రాంతాలలోనే యుండి కాయకష్టం చేసుకొని బ్రతికారు. వలస వెళ్ళినవారు నూలు బట్టల మిల్లులలో పనిచేసి సంపాదించిన డబ్బు ఆయా పట్టణాలలో ఖర్చుచేసి, తమ కుటుంబాల పోషనార్థమై డబ్బు పంపేవారు కాదు. ఈరీతిగా చేనేత కళాకారులెందరో తమ చేతి నైపుణ్యతను ప్రదర్శించి ఇతరులతో మన్నలను పొందేవారు.

ఆ తరువాత మగ్గాలను ఆడించేవారు లేక అవి బూజుపట్టిపోయినాయి. మిల్లు వస్త్రముల ధరలు, విపరీతంగా పెరిగిపోయినందున ప్రభుత్వం వాటిపై కంట్రోలు విధించి, కంట్రోలు రేటుకు ప్రజలకు వస్త్రములు లభించేలా రిటేలు, హోల్‌సేలు డిపోలు వ్యాపారుల సంఘాలద్వారా ఏర్పాటు చేసింది. దీనికి ఒక టెక్స్‌టయిల్ డిపార్టుమెంటును ఏర్పాటుచేసి రెడెల్లో అను వానిని అందుకు అధిపతిగా నియమించింది.

ఆయన ప్రతి జిల్లాకు ఒక టెక్స్‌టయిల్ ఇన్స్పెక్టర్‌ను నియమించింది. వీరు రిటేలు డిపోలద్వారా చిల్లర వ్యాపారస్థులకు గాని, ప్రజలకుగాని కంట్రోలు ధరపై కోటా ప్రకారం అందజేయు ఏర్పాట్లు విపరీతంగా జరిగి పోయినాయి. కంట్రోలు ధరపైన నూలు పంపకం చేసి, వలస వెళ్ళక మిగిలిపోయిన చేనేత వారితో చేనేత వస్త్రాలు—ముఖ్యంగా ధోవతులు, చీరలు తయారు చేయించారు.

ఆనాడు చీరలు, ధోవతులు చేనేతవే అధికంగా అమ్ముడుపోయినాయి. ఎందుకనగా మిల్లులు అధికంగా షర్టులు, ఫాంటు

బట్టలు తయారుచేయడంలోనే నిమగ్నమైనాయి. మిల్లు బట్టలతో సహా ఆనాడు చేనేత బట్టలకు కరువు ఏర్పడింది. చేనేత బట్టలకు గల గిరాకీను పురస్కరించుకొని ఎందరో మాస్టర్ వీవర్లు, పెట్టుబడి మాత్రం పెట్టి చేనేత పారిశ్రామికులకు అవసరమగు నూలు ఇతర ముడి పదార్థములిచ్చి, కూలికి మగ్గాలు నేయించే వారు. సామాన్య నేత పారిశ్రామికులతో మగ్గాలు నేయించి, గిరాకీగల మార్కెటుకు చేనేత వస్త్రాలు ఎగుమతి చేశారు. ఆ రోజుల్లో అధికంగా డబ్బు సంపాదించినవారు ఈ మాస్టరు వీవర్లే. వీరు సామాన్య నేత పారిశ్రామికులను గులాములుగా చూశారు. కొన్ని ప్రాంతాలలో వారికి పనిచేసిన కూలి కూడా సకాలంలో యివ్వక వారిని నానాయాతనల పాలుచేసిన సంఘటనలు లేకపోలేదు.

ఆ రోజులలో ప్రత్యేక పరిమిట్లపై నూలు లభించేది. అలాంటి అక్రమ నూలు పర్మిట్లనుపొంది, వాటిపై నూలు తీసుకొని బ్లాక్ మార్కెట్ చేసి, అధికాధికంగా లాభాలు సంపాదించి, ఆర్థికంగా బాగుపడ్డారు. అయితే వారి ద్వారా చేనేత వస్త్రోత్పత్తి పెరిగింది. కాని బీద నేత పారిశ్రామికుల ఆర్థిక పరిస్థితిమాత్రం రోజుకు రోజు మరీ హీన దశకు దారి తీసింది.

అఖిల భారత చేనేత కాంగ్రెస్ నాయకులు కేంద్ర ప్రభుత్వమునకు చేనేత పారిశ్రామికులు పడుతున్న అవస్థలనుగూర్చి విజ్ఞప్తి చేసుకోగా, చేనేత పరిశ్రమాభివృద్ధికై భారత స్థాయిలో హేండ్లూమ్‌సంస్థ నొకదానిని ఏర్పాటుచేసి, రాష్ట్ర స్థాయిలోకూడా చేనేత సలహా బోర్డును నియమించి, ఈ పరిశ్రమాభివృద్ధికై ఒక చేనేత విభాగమును రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటుచేసి, సలహా బోర్డు సలహాల ప్రకారం ఆధునిక చేనేత పరికరాలను సరఫరా చేయడానికి ముందడుగు వేసింది. ఆనాటివరకు కేవలం చేతి మగ్గాలు, మామూలు వస్త్రాలు తయారుచేసుకొనేవారి షటల్ మగ్గాలు, ఫ్రేమ్ మగ్గాలు, ఆటోమెటిక్ మగ్గాలు మొదలగునవి చేనేత సహకార సంఘాలద్వారా సభ్యులకు పంపకంచేసే ఏర్పాట్లు చేసారు. అప్పటికే రాష్ట్ర స్థాయిలో చేనేత పారిశ్రామిక సహకార సంఘాలు కొన్ని నూలు పంపకంతో సహా ఉత్పత్తులనుకూడా ప్రారంభించాయి. అవిభక్త హైదరాబాద్ రాష్ట్రంలో 95 శాతం నేత పారిశ్రామికులు, సహకార సంఘాలలోచేరి కేంద్ర చేనేత సహకార సంఘం మార్గదర్శకత్వము ద్వారా తమ ఉత్పత్తులను ఆధునిక పద్ధతులలో కొనసాగించారు. ఈ సంఘాలద్వారా నిర్వహించబడే విక్రయశాలల్లో చేనేత వస్త్రాలు కొనేవారికి రిబేట్ యిచ్చే పద్ధతిని ప్రభుత్వం 1953 నుండి కొన్ని సంవత్సరములవరకు అమల్లో పెట్టింది. అప్పుడే చేనేత సహకార సంఘాలు ఆర్థికంగా బలపడి, చదువుకొని నిరుద్యోగులుగా ఉన్న కొన్ని వందల మంది కార్యకర్తలకు ఉద్యోగాలు కల్పించాయి.

ప్రభుత్వం చేనేత సహకార సంఘాలకు వర్కింగ్ కేపిటల్ క్రింద కొన్ని సంవత్సరములు కిస్తుల రూపంలో చెల్లించుటకు అప్పులిచ్చినది. ఈ పద్ధతిని మార్చి ఆంధ్రప్రదేశ్ ఏర్పడిన తర్వాత బ్యాంకుల ద్వారా క్యాష్ క్రెడిట్‌పై అప్పులు యిచ్చే పద్ధతిని ప్రవేశపెటారు. ఈ పద్ధతి బాగుగా ఉన్నప్పటికీ, రిజర్వు బ్యాంకు నిబంధనల ప్రకారం కేంద్ర సహకార బ్యాంకుల ఆర్థిక పరిస్థితుల లోపంవల్ల చేనేత సహకార సంఘాలన్నీ ఈ వసతి సౌకర్యాన్ని పొందలేకుండా ఉన్నాయి, ఆర్థిక లోపం వల్ల ఈ సంఘాలు ఈ నాడు తమ సభ్యులకు చేతినిండా పని యిచ్చి పోషించలేకుండా పోయినాయి.


ఈ సంఘాలకు ప్రభుత్వం ద్వారా యిచ్చిన రిబేట్ దుర్వినియోగం చేయబడినదని కొన్ని రిపోర్టులందుటవల్ల ప్రభుత్వం ఈ రిబేట్‌ను పూర్తిగా ఆపివేసి, దసరా, దీపావళి, సంక్రాంతి, ఉగాది, చేనేత సప్తాహం మొదలగు కొన్ని విషయాలలో తప్ప మిక్కిన రోజులలో రిబేట్ లభించడం లేదు. మరి చేనేత వస్త్రాలు, మర మగ్గాల ద్వారా తయారుచేసే వస్త్రాలకు మిల్లు వస్త్రాలకు మార్కెటులో పోటీకి నిలువలేక పోతున్నాయి. కావుననే మార్కెటులో చేనేత వస్త్రముల విక్రయం తగ్గినది. ఇంతవరకు సిద్ధం చేయబడిన చేనేత సరుకు ఈ నాడు గుట్టలు గుట్టలుగా పేరుకుపోయి సంఘాలు అధికాధిక నష్టమునకు పాలౌతున్నాయి. ఈ నాడు ప్రాథమిక చేనేత సహకార సంఘాలు ఆర్థికంగాపతనమై నామ రూపాలు లేకుండా పోవడానికి ప్రభుత్వం క్యాష్ క్రెడిట్‌ద్వారా ఇచ్చే అప్పుల సౌకర్యం సక్రమంగా లభించక పోవడం, చేనేత వస్త్రాల అమ్మకంపై పూర్తిగా రిబేట్ ఆపివేయడమే ముఖ్య కారణాలు. రిబేట్‌ను మళ్ళీ ఇచ్చే ఏర్పాటు ప్రభుత్వం చేసిన చేనేత గుడ్డలకు గిరాకీ పెరుగుతుంది. చేనేత సహకార సంఘాలకు పని పెరుగుతుంది. సభ్యులకుకూడా పని లభిస్తుంది. ప్రభుత్వం రిబేట్ ఇచ్చే పద్ధతిని అమల్లో పెట్టుట పునరాలోచించి నిర్ణయం గైకొనడంలో ఎంతేని అవసరం. అది దుర్వినియోగం కాకుండా ఆజమాయిషీ చేయడంకూడా అవసరమే.

రిజర్వు బ్యాంకు నియమావళి ననుసరించి సెంట్రల్ బ్యాంకులు, భూమి తనఖా బ్యాంకులు అప్పులు యిచ్చి పుచ్చుకొనుటకు తడబడుచున్నప్పుడు, చేనేత సహకార సంఘాలు రిజర్వు బ్యాంకు అప్పులు పొందడం సుసాధ్యం కాదు. కావున ఎన్నియో సంఘాలు రిజర్వు బ్యాంకు అప్పులను పొందలేకపోయాయి. కావుననే వాటి ఆర్థిక పరిస్థితి చాలా దెబ్బతిని పోయింది.

మార్కెటింగ్

చేనేత వస్త్రముల మార్కెటింగ్ మెరుగు పరచుటకుగాను బొంబాయిలో అఖిల భారత స్థాయిలో మార్కెటింగ్ సొసైటీ గలదు. దాని ద్వారా భారతదేశం యొక్క వివిధ ప్రాంతాల చేనేత వస్త్రములను తెప్పించి ప్రభుత్వ సేల్సు డిపోల ద్వారా నేగాక, విదేశాలలో కూడా వీటికి మార్కెట్ కల్పించుటకు ప్రభుత్వం, కృషి సల్పుచున్నది. ప్రస్తుతం సంస్థకు ఎమ్మిగనూరు చేనేత సహకార సఘం అధ్యక్షులు శ్రీమాచాని సోమప్ప అధ్యక్షులుగా ఉన్నారు. వారి అవిరళ కృషి వల్లనే నేడు చేనేత వస్త్రాలు మార్కెట్‌లో చలామణి అవుతూ ప్రగతిని సాధిస్తున్నాయి, ప్రజల అభిరుచులకు అనుగుణంగా అధునాతన మైన డిజైనులలో చేనేత వస్త్రోత్పత్తి జరిగిన, వాటికి గిరాకీ ఎల్లప్పుడూ ఉంటుందని ఆయన విశ్వాసం.

ఆంధ్రప్రదేశ్‌లోని పోచంపల్లి చిటికి చీరలు, గద్వాల జరీ చీరలు, ధర్మవరం, ఆర్మూర్, సిద్దిపేట, పెద్దాపురం సిల్కు వస్త్రాలు; సిద్దిపేట, జనగాం, ఉప్పాడ బుటా చీరలు: కమలాపురం, హుజూరాబాద్, జగిత్యాల మొదలగు ప్రాంతాల సాదా చీరలు; ఆమనగల్, వేటపాలెం, చుక్కసం చీరలు: నారాయణపరం; భట్టిప్రోలు. హసన్‌పర్తి ధోవతులు, మంగళగిరి పెడస, ప్రొద్దుటూరు, జమ్మలమడుగు, చీరాల చీరలు: హసన్‌పర్తి, కోస్గి, హకీంపేట, పిసరిపట్టు వస్త్రాలు ప్రసిద్ధిని గడించాయి. ఇవే గాక ఇంకెన్నియో ప్రాంతాల చీరలు, దోవతులు పేరు గడించాయి. ఈ గుడ్డలలో ఒక విధమైన ప్రత్యేకత, మన్నిక ఉన్నాయి కాబట్టి మార్కెట్‌లో బాగా చలామణి అవుతున్నాయి. చేనేతవస్త్రోత్పత్తి ప్రత్యేకత సాధించినది, వాటికి ఎన్నటికీ చావు లేదు. ఈలాంటి చేనేత కళాకారులు తమ జీవనోపాధికి ఈ వృత్తినే అవలంభించిన-వీరికి చావు లేదు. సర్వసాధారణంగా దోవతులు, చీరలు, దొడ్డు రకాల నూలుతో తయారు చేసే వస్త్రాలకు ఈ మార్కెటులో విలువలేదు. ఎందుకంటె మార్కెటులో మిల్లు వస్త్రాలతో అన్ని విధాలా పోటీ చేసే మరమగ్గాల చేనేత ఉత్పత్తులు ఎంతో నాణ్యంగా రంగురంగులలో చీరలు, దోవతులు తదితర అవసర వస్తువులు సిద్ధమవుతున్నాయి. చేనేత రంగం మరమగ్గాలను ప్రవేశపెట్టి ప్రతి నేతపారిశ్రామికునకు అధికాధికంగా కూలి లభింప జేయాలని ప్రభుత్వం ప్రయత్నిస్తోంది.



అయితే తమ రాష్ట్ర చేనేత సహకార సంఘాల ద్వారానే మరమగ్గాలు నిర్వహించబడాలని. మరమగ్గాలను చేనేత రంగంలో ప్రవేశపెట్టిన లక్షలాది చేనేత వారు నిరుద్యోగులై తదితర వృత్తులలో చేరవలసియుంటుందని మరమగ్గాలు ప్రైవేట్ రంగంలో ప్రవేశ పెట్టకూడదని చేనేత నాయకులు నిరోధిస్తున్నారు. వారివాదన కూడ ఒకందుకు సత్యమే. 11 మంది ఒక గంటలోచేసే పనిలోని ఉత్పత్తి అయ్యే వస్త్రాన్ని మరమగ్గం ఒకటీ ఒక గంటలో తయారు చేస్తుంది. మరమగ్గమును ఆడించుటకు ఒక వ్యక్తి చాలు. అందుకే చేనేత సహకార సంఘంలో దీనిని ప్రవేశ పెట్టిన ప్రైవేట్ వారు చేనేత జీవనోపాధికి అడ్డు తగలకుండా ఉంటుందని భావిస్తున్నారు. వాటిని చేనేత సహకార సంఘాలలో ప్రవేశ పెట్టిన వాటి పరిణామం ఏమవుతుందో చూసి కాని ప్రభుత్వం యే నిర్ణయము గైకొనజాలదు. ప్రభుత్వం నిర్ణయించినది రిజిష్ట్రేషన్ మరియు లైసెన్సు ఫీజు చెల్లింపు బాధ్యత సహకార సంఘాలపై యుంటుంది. కాబట్టి అధికంగా వెనుకబడి యున్న సంస్థలకు లైసెన్సు ఫీజు కూడా యిచ్చి మరమగ్గాలను నిర్వహించ లేకపోతున్నాయి. పరిసర రాష్ట్రాలలో మరమగ్గాల ద్వారా వస్త్రోత్పత్తులు విరివిగా సాగించి అచటి వస్త్రములు మన రాష్ట్రమునకు దిగుమతి అవుట వల్ల, మన చేనేత వస్త్రములు ధరలో వాటితో పోటీ చేయ లేక పోతున్నాయి.

ఈనాడు ప్రజలు, వస్త్రముల రంగులోకాని, మన్నికలో కాని లోపమున్నప్పటికీ, చౌకగా మార్కెట్‌లో లభిస్తాయని మర మగ్గముల ఉత్పత్తులనే కొంటున్నారు. చేనేత వస్త్రము విలువ తెలసిన వారే-ప్రత్యేకంగా మహిళలు, పూర్వ సాంప్రదాయమునకు అలవడినవారు- చేనేత చీరలు కట్టి, చేనేత వారిని పోషిస్తున్నారు. ధోవతులు కట్టేవారి సంఖ్య దక్షిణాదిలో నానాటికీ తగ్గిపోవుచున్నది.

మన రాష్ట్రంలో చేనేత పారిశ్రామికుడు ఒక మగ్గమును ఆడించి అందులోవచ్చే కూలీతో తానుఒక్కడు బ్రతకడమే కష్టంగా ఉన్న ఈ రోజులలో, భార్య పిల్లలను పోషణ చేసుకునే పరిస్థితిలో ఎలా ఉండగలడు ? వీరికి నేతకు ముఖ్యావసరమగు నూలు, రంగులు, రసాయనములు, సరసమైన ధరలకు లభించజాలని కారణంగా, సామాన్య పారిశ్రామికుడు, తమ తాత తండ్రుల నుండి నివసించిన పాకలు, ఇండ్లు వదలి బొంబాయి, అహమద్‌నగర్, అహమదాబాద్ ప్రాంతాలకు వలసి వెళ్ళుతున్నారు. వారికి పునరావాసం కల్పించుటకు చేనేత నాయకులు శ్రద్ధ వహించాలి చేనేత సహకార సంఘాలు కార్యకర్తలను పోషణ చేసుకునే ఆర్థిక స్తోమత లేక చాలావరకు మూతబడు తున్నాయి. చేనేత వారికి కనీస వేతనం నిర్ణయించే నిమిత్తం వేతన నిర్ణాయక కమిటీని, చేనేత పరిశ్రమాభి వృద్ధికై ఎప్పటికప్పుడు ఉద్భవించే సమస్యలను పరిష్కరించుటకు, ఈ పరిశ్రమలో గల సాధక బాధకాలను పరిశీలించి రిపోర్టు అందజేయుటకు రాష్ట్ర ప్రభుత్వం ఉన్నతాధి కారులతో కూడిన చేనేత పరిశ్రమ పరిశీలక కమిటీ నొకదానిని నియమించుటకు ప్రభుత్వం తీవ్రంగా ఆలోచిస్తున్నట్టు ఇటీవల జరిగిన చేనేత వారోత్సవాల సందర్భంగా చేనేత పరిశ్రమ శాఖామంత్రి వెల్లడించారు. ఈ కమిటీకి రిటైర్డు న్యాయమూర్తిని అధ్యక్షులుగా నియమించనున్నట్టు మంత్రి ప్రకటించారు. ఈ పరిశీలక కమిటీ ఈనాడు పతన దశకు దారితీస్తున్న చేనేత పరిశ్రమను పునరుద్ధరించుటకు, ఏలాంటి గట్టి చర్యలు గైకొనవలసి యుంటుందో ఆలోచించి చేనేత పరిశ్రమకు శాశ్వత రక్షణ కూర్చుటకు దోహదం సమకూర్చగలదని నేను భావిస్తున్నాను

* *
*

నీరాజనం

—తాడూరి స్వామి శ్రీనివాస దేవానంద్

భారత రాష్ట్రపతి శ్రీమాన్ వరాహగిరి వేంకటగిరిగారి
డెబ్బది ఆరవ జన్మదిన సందర్భాన చదవబడిన కవిత

శుభోదయం ! శుభోదయం !
శ్రీ వరాహగిరి వేంకటగిరిగారికి నవోదయం !
ఉత్తమ పౌరుడు—స్వాతంత్ర్య వీరుడు
డాక్టర్. వి.వి. గిరి—బహుముఖ పరాయణుడు.

బహుముఖ వ్యక్తిత్వంగల వ్యక్తి
బహుజనాదరణ గలవ్యక్తి
శ్రీ వరాహగిరి వేంకటగిరి
మన దేశానికే ఒక ఆది శక్తి.

ఓ ! వరాహ గిరి వేంకటగిరి మహాశయా !
నేడు మీ డెబ్బది ఆరవ జన్మదినం
మా అందరికి ఓ పర్వదినం
నిన్నుగన్న జోగయ్యపంతులు, సుబ్బమ్మల,
పూర్వజన్మ సుకృతార్థమనే చెప్పాలి,
నీ లాంటి మర్యాదరాముణ్ణి కన్నందుకు.

కన్నవారికి పేరు తెచ్చావు
ఉన్నవారికి మార్గదర్శకుడివయ్యావు
మనలోని మంచితనాలే ఉన్నత దశను తెస్తాయని
నిరూపించావు !

మీ జీవితం ప్రజాసేవతో ఆరంభమై గొప్ప కార్మిక
నేత వయ్యావు !
కార్మిక విప్లవానికే పితామహుని వయ్యావు ! బి.ఎన్.ఆర్.
యూనియన్‌కు ప్రెసిడెంటు వయ్యావు.

మద్రాసు ప్రభుత్వంలో లేబర్ మినిస్టరయ్యావు
కేంద్రప్రభుత్వంలో కూడా అదే పదవిని నిర్వహించావు
యు.పి., కేరళ, మైసూర్ రాష్ట్రాలకు గవర్నరయ్యావు
ఉపరాష్ట్రపతివయ్యావు—తుదకు రాష్ట్రపతివి కూడాఅయ్యావు

ఎన్ని పదవులు నిర్వహించినా ! మమకారం లేని
నిరాడంబరం ప్రదర్శించావు
లక్షలాది ప్రజలకు మార్గదర్శకుడివయ్యావు !
పుట్టావు బరంపూర్‌లో

పట్టభద్రుడవయ్యావు ఐర్లాండులో,
మహాత్మాగాంధి, పండిత నెహ్రూల ప్రభావానికి లోనై
దేశసేవ నారంభించావు—మన తెలుగు గడ్డకే కీర్తి తెచ్చావు
శుభోదయం ! శుభోదయం
శ్రీ వరాహగిరి వేంకటగిరిగార్కి నవోదయం !
గిరి, ఉన్నతమే ! నదీ నదములకు నీటి నిస్తుంది
శ్రీ గిరిగారి ఉన్నత భావాలే ! మన తెలుగు గడ్డకు మెప్పు
తెస్తాయి !


గిరికి, తోడు తరువు
శ్రీ మాన్ గిరిగారికి బలేజోడు సరువు !
వీణకు—శ్రుతి మహాలంకారం
శ్రీమతి సరస్వతి, గిరిగార్కి ఉన్నతాలంకారం !
పార్వతీ పరమేశుల జంట !
తిరిగి వెలిశారు రాష్ట్రపతి యింట !
సరస్వతీ దేవి నోముపంట
ఫలియించెను ఇదేయింట !

ఆంధ్రప్రదేశ్‌లో రాష్ట్రపతి



చిత్రమాలిక

1. భారత రాష్ట్రపతి శ్రీ వి. వి గిరి ఆగస్టు 22 న హైదరాబాదుకు విచ్చేసినప్పటి దృశ్యం.
2. కృష్ణా, గుంటూరు జిల్లాలలో పర్యటన. సెప్టెంబరు 6 న గన్నవరం విమానాశ్రయంలో.
3. కృష్ణా జిల్లా, వుయ్యూరులో ప్రసిద్ధ పారిశ్రామిక వేత్త స్వర్గీయ వెలగపూడి రామకృష్ణ విగ్రహావిష్కరణ (సెప్టెంబరు 6)
4. సెప్టెంబరు 6 న గుడివాడలోని హోమియోపతి కళాశాల రజతోత్సవాలలో
5. విజయవాడలో సెప్టెంబరు 7 న పౌర సన్మానం
6. తెనాలిలో సెప్టెంబరు 7 న వి ఎస్ ఆర్. కళాశాల కొత్త భవనాలకు శంఖుస్థాపన
7. సెప్టెంబరు 7 న గుంటూరు జిల్లాలోని నగరం గ్రామంలో వెలగపూడి రామకృష్ణ స్మారక కళాశాలకు శంఖుస్థాపన.
8. తెనాలిలో శ్రద్ధానంద హరిజన కాలనీలో గాంధీ విగ్రహావిష్కరణ (సెప్టెంబరు 7)
9. హైదరాబాదులోని ఉస్మానియా విశ్వవిద్యాలయ ఆవరణలోగల ఠాగూర్ ఆడిటోరియంలో సెప్టెంబరు 10 న ఉపాధి కల్పనకు సంబంధించిన సదస్సుకు ప్రారంభోత్సవం
10. హైదరాబాదు రేస్ కోర్స్‌లో సెప్టెంబరు 10 న 'భారత రాష్ట్రపతి బంగారు కప్పు' బహూకరణ.
11. జాతీయ కార్మిక విషయాల కమిషన్ సిఫారసులను దృష్టిలో వుంచుకుని పారిశ్రామిక సంబంధాలను పరిశీలించే గోష్ఠికి సెప్టెంబరు 9 న హైదరాబాదులో ప్రారంభోత్సవం చేశారు.


1945-70

మీ పేరు కేవలం వ్యక్తిగాకాకుండా గొప్ప శక్తిగా మారింది!
అటు దక్షిణాదిలో ఆరంభమైన మీ కార్మిక సేవ!
ఇటు ఉత్తరాదిన, దినదినాభివృద్ధి జెందుతూ
అఖిల భారతావనికే పతిని జేసింది, రాష్ట్రపతిని జేసింది

శుభోదయం! శుభోదయం
మన రాష్ట్రపతి గిరిగార్కి నవోదయం!
అతడు ఒక మనిషి, ఒకే మనిషి!
గుండె ధైర్యంగల మనిషి!
అతనికి అతడే తార్కాణం
అతనిలోని సద్భావాలే గీర్వాణం!
రాష్ట్రపతి ఎన్నికలకు నిలుచున్నారు
యోధాన యోధులు
బలే—బలే, మేధావులు
సర్వ యత్నాల్ని, ప్రయత్నాల్ని చేశారు!

అందులో ఒక మనిషి, ఒకే ఒక మనిషి
అవగాహన—సామరస్యంగల మనిషి
తన స్వంత కృషిపైన నిలిచి
యావత్ భారత బలాన్నే సాధించి,
రాష్ట్రపతిగా ఎన్నికైన మనీషి!
వారే శ్రీమతి సరస్వతీదేవిగారి పతి!
మన భారతావనికే రాష్ట్రపతి!

శుభోదయం! శుభోదయం!
మన భారత రాష్ట్రపతి గారికి నవోదయం!
లాంఛన ప్రకారంగా ఇంద్రుడు, చంద్రుడు,
మహేంద్రుడని, శ్లాఘింపుతారు కొందరి పెద్దల్ని.
కాని గిరిగారు, లాంఛన ప్రకారంగా శ్లాఘించే
ఇంద్రుడు కాదు—చంద్రుడు కాదు:

మామూలు కార్మిక ప్రతినిధిగా సేవనారంభించాడు!
ఉప రాష్ట్రపతి పదవిని, కూడా నిర్వహించాడు!
చివరకు రాష్ట్రపతి స్థానాన్నే అధిష్టించాడు!

కాని మనిషి మారలేదు, అతని భావాలు అసలే మారలేదు
ఉదార భావంతో సేవ జేస్తున్నారు
తోడి మానవుల ఆదరింపుతున్నారు
నిరాదరుల్ని ఆదరించి—అస్పృశ్యతను తొలగించి
అవినీతి అంతరించి భావి పౌరుల కల్యాణానికి గట్టి పునాదులు
వేశారు

ఓ కర్మయోగి! త్రికరణ శుద్ధిగల జోగి!
బొబ్బిలి రాజునే ఓడించిన మేటి
గాలించినా దొరకరు మాకు మీ సాటి
ఆరువేల, ఆరు వందల అరువది ఆరు ఓట్లతో ఓడించావు!
మన ముక్కోటి ఆంధ్రుల ఊహల్లో వాడి వుందని
చూపించావు!

"While Mr. Giri's success in defeating the Raja of Bobbili was national his success in the B. N. Railway strike is international"

అని గిరిగార్ని శ్లాఘించారు పండిత నెహ్రూ!

భరత ఖండపు అనుంగు బిడ్డ
మన తెనుగు తల్లి మిమ్మల్ని ఆశీర్వదించు గాక;
పంచ ఖండాలలో మీ కీర్తి చాటుగాక!
ముప్పాతిక శతాబ్దిని ప్రయోజనకరంగా జేసిన మీకు
రానున్న ప్రతి వత్సరం కుసుమితమై
ఫల భరమై ఉండాలని కాంక్షిస్తూ
మంగళాన్ని పాడుతాము

శుభోదయం! శుభోదయం.
శ్రీ వరాహగిరి వేంకటగిరిగార్కి నవోదయం!

మహాభారతము

కొప్పెగంటుల లక్ష్మణశాస్త్రి

లోమశ మహాముని పయోష్ణీ నదిని ఇట్లు వర్ణించెను :—

ధర్మరాజా ! ఈ నదీ తీరమునందు 'నృగ' మహారాజు యజ్ఞములు చేసి ఇంద్రాదులను సంతృప్తి పరచెను. ఇచటనే ఇంద్రాదులు, బ్రహ్మాదులు అనేక దక్షిణలిచ్చి యెన్నియో యాగములు చేసిరి. 'అమూర్తరయుడు' అను వాని కొడుకగు 'గయుడు' అను రాజు గూడ ఏడు అశ్వమేధ యాగములుచేసి ఇంద్రుని తృప్తి పరచెను. ఆ యాగములలో వాడబడు వస్తువులన్నియు నతడు సువర్ణముతో చేయించెను. చషాలము (యూపముయొక్క ఉపరి భాగమునందు గుండ్రముగా నుంచబడిన కొయ్య), యూపము (యాగమునందు పశువును బంధించు స్తంభము), చమసము (సోమరస పానము చేయు పాత్రము) స్థాలి (గిన్నె), పాత్రి (వండబడిన వస్తువులను ఉంచు పాత్రము), స్రుక్ (హవిస్సును అగ్నిలో అర్పించుటకు చేయబడు సాధనము—గరిటె వంటిది), స్రువము (నెయ్యి మొదలగు హోమ ద్రవ్యములు ఉంచబడు పాత్రము) ఈ యేడున్ను యజ్ఞములో వాడబడు ముఖ్య సాధనములు. ఇవి సువర్ణముతో చేయబడియుండెను. ఆ యజ్ఞములో సువర్ణ యూపములు ఏడు నాటబడియుండెను. ఒక్కొక్క యూపముపైన ఏడేడు చషాలములు అమర్చబడియుండెను. అట్టి సువర్ణ యూపములను ఇంద్రాది దేవతలు స్వయముగా వచ్చి నాటి యుండిరి. ఆ యజ్ఞములందు గయరాజు బ్రాహ్మణులకు అసంఖ్యాకములగు దక్షిణలిచ్చెను. ఇసుకను, నక్షత్రములను, వర్షధారలనైన లెక్కింప వచ్చును గాని, గయుడు బ్రాహ్మణుల కిచ్చిన ధనమును లెక్క పెట్టుటకు సాధ్యము కాదు. ధర్మరాజా ! దేవ శిల్పియగు విశ్వకర్మ స్వయముగా నిర్మించిన సువర్ణ గోవులను నానా దేశాగతులైన బ్రాహ్మణులకు గయుడు దానము చేసెను. భూమండలములో అతని యజ్ఞమండపములులేని స్థానములు అరుదుగ నుండెను. ఆ యాగ ప్రభావముచేత గయుడు ఇంద్రాది లోకములను పొంది సుఖమనుభవించెను. అట్టి యీ పయోష్ణియందు స్నానము చేసినవారుగూడ గయుడు పొందిన లోకములను పొందగలరు. కనుక రాజా ! నీవు గూడ సోదర సహితముగా నిందు స్నానముచేసి పాప విముక్తిని పొందుము."

లోమశుని ఉపదేశము ప్రకారము పాండవులు పయోష్ణిలో స్నానముచేసి వైదూర్య పర్వతమునకు పోయిరి. తరువాత నర్మదా నదిలో స్నానము చేసిరి. లోమశుని ఉపదేశము ప్రకారము ఆ ప్రాంతములోని పుణ్య తీర్థములన్నియు సేవించిరి. అపుడు లోమశు డిట్లనెను :— "ధర్మరాజా ! వైదూర్య పర్వతమును దర్శించి నర్మదలో స్నానము చేసినవారు దేవతలతో సమానులై దేవలోకమును పొందెదరు. రాజా ! ఈ వైదూర్య పర్వతము త్రేతా—ద్వాపరయుగ సంధిలో ప్రకటిత మయ్యెను. దీనిని సేవించిన వారు సర్వ పాప విముక్తులయ్యెదరు. ఇదిగో యిది 'శర్యాతి' మహారాజు యజ్ఞము చేసిన స్థానము, ఆ యజ్ఞములో నింద్రుడు అశ్వినీ దేవతలతో వచ్చి స్వయముగా సోమపానము చేసెను. రాజా ! ఇచ్చటనే పూర్వము భృగు పుత్రుడగు చ్యవనుడు ఇంద్రునిపై కోపించి అతనిని స్తంభింపజేసెను. ఇక్కడనే చ్యవనుడు అశ్వినీ కుమారులకు యజ్ఞముతో సోమపానము చేయించెను. ఇచటనే ఆ మహాముని సుకన్యను పత్నినిగా బడసెను."

ఆ మాటలు విని యుధిష్ఠిరుడు లోమశుని, "మహాత్మా ! మహాతపస్వియగు చ్యవన మహర్షి యింద్రునెట్లు స్తంభింపజేసెను? అతనికి ఇంద్రునిపై కోపమేల కలిగెను ? అతడు అశ్వినీ దేవతలకు యజ్ఞములో సోమపానాధికారము నెట్లు కలిగించెను ? ఆ విషయములన్నియు వివరముగా నాకు చెప్పుము." అని యడిగెను.

చ్యవనోపాఖ్యానము

భృగుమహర్షికి 'చ్యవనుడు' అను పుత్రుడు ఉండెను. మహా తేజశ్శాలియగు చ్యవనుడు సరస్సు తీరమునందు తపస్సు చేసెను. తపస్సమాధిలో నతడు వీరాసనము వేసికొని 'స్థాణువు' (కొయ్య మొద్దు) వలె కూర్చొని యుండెను. కొంతకాలమునకు లతలు మన్ను అతని చుట్టు చుట్టుకొని అతడు వల్మీకము (పుట్ట) వలె అయ్యెను. అతని శరీరమంతయు చీమలు బారులుగా ప్రాకుచు చుట్టుకొని యుండెను. అతడొక మృత్పిండమువలె నుండెను.

ఇట్లుండగా చాల కాలమునకు 'శర్యాతి' యను రాజు ఆ సరస్సువద్ద విహరించుటకు నాలుగు వేలమంది భార్యలతో వచ్చెను. అతనికి 'సుకన్య' యను నొకతెయే కూతురుండెను. ఆమె తన చెలికత్తెలతో, దివ్యాభరణ భూషితురాలై ప్రాంతములో విహరిం

చుచు వల్మీకమును సమీపించెను. అచటి వృక్షలతాదులను చూచుచు విహరించుచున్న సుకన్య నవయౌవనోద్రేకముచేత వృక్షశాఖలను విరిచి పువ్వులను రాల్చుచు వినోదించుచుండెను. నడచుచున్న మెరపు తీగవలెనున్న సుకన్యను చ్యవనుడు చూచి సంతోషించెను. ఆమెను పలుకరించెను. అతని కృశించిన కంఠ ధ్వనిని ఆమె వినజాలకపోయెను. ఆ వల్మీకములో మిణుకు మిణుకు మని మెరయుచున్న చ్యవనుని నేత్రములను సుకన్య జూచెను. కుతూహలముతో ఆ కన్నులను కంటకముతో పొడిచెను. వెంటనే ఆ ముని మిగుల కోపించి 'శర్యాతి సైన్యమునకు మలమూత్రములు రాకుండ నుండుగాక' యని శపించెను. దానిచేత సైనికులందరు బాధపడుచుండిరి. దానికి కారణము తెలిపికొనగోరి శర్యాతి అందరి నడిగెను. ఎవరును తెలియ జెప్పలేదు. మలమూత్ర స్తంభనము చేత మిగుల బాధపడుచుండిరి. అప్పుడు సుకన్య వారి దుఃఖమును, తండ్రి విచారమును చూచి సహించజాలక తాను చేసిన అపరాధమును చెప్పెను. శర్యాతి చ్యవనుని కడకుపోయి క్షమించుమని వేడెను. 'యౌవన మదముచేత నీ కూతురీ యపరాధమును నాకు చేసినది కనుక ఆమెను నాకు ఇచ్చినచో నా కోపము చల్లారును.' అని చ్యవనుడనెను. ఆ మాటకు శర్యాతి సంతసించి సుకన్య నతనికిచ్చి వివాహము చేసెను. అంతటితో సైనికులకు సుఖము కలిగెను. సుకన్య చ్యవనుని భక్తిపూర్వకముగా సేవించుచుండెను. అగ్నులను, అతిథులను శ్రద్ధతో పూజించుచు చ్యవనుని సంతుష్టు జేసెను.

కొంత కాలమునకు దేవవైద్యులగు నిర్వురు అశ్వినీ దేవతలు చ్యవనాశ్రమమునకు వచ్చి రూపయౌవన సంపన్నయగు సుకన్యను చూచి యిట్లనిరి :—

అశ్వి :— నీ వెవరు ? ఈ వనమునందు ఏమి చేయుచున్నావు ? చెప్పుము.

సుకన్య :— (సిగ్గుతో) నేను శర్యాతి బిడ్డను. చ్యవనుని ధర్మపత్నిని నా పేరు సుకన్య. ఇచట పతి శుశ్రూష చేయుచున్నాను.

అశ్వి :— (నవ్వి) మీ తండ్రి నిన్ను వృద్ధతాపసునకు ఎట్లు ఇచ్చెను ? ఈ వనమునందు మెరుపు తీగవలె మెరయుచున్నావు. నీతో సమానురాలిని దేవకన్యలలో గూడ మేము చూడము. వస్త్రాలంకారములు లేకున్నప్పటికిని నీవు ఈ వనమునంతయు శోభిల్ల జేయుచున్నావు. మంచి వస్త్రభూషణములను ధరించినచో నీ వింకను నెంతగా శోభిల్లుదువో కదా ! ఇంక నీవు ముసలి తనముతో జార్జరితమైన శరీరముగల పతిని ఏల ఉపాసించుచున్నావు. ఈ నీ పతి శరీరము కామ భోగబహిష్కృతము కదా ! నిన్ను పోషించుటకు గాని, రక్షించుటకు గాని అసమర్థుడగు ఈ చ్యవనుని వీడి మా యిరువురిలో నొకరిని వరించి సుఖింపుము. ఈ వృద్ధపతికొరకు నీ నవ యౌవనమును వ్యర్థము చేసికొనకుము.

సుకన్య :— నేను నా పతి దేవుని యెడలనే పరిపూర్ణానురాగముగలదానను. నన్ను నిట్లు శంకించి యడుగకుడు.

అశ్వి :— మేము దేవ వైద్యులము. నీ పతిని రూపయౌవన సంపన్నునిగా జేసెదము. మాతో సమానాకార రూపములు గలవాడగును. అట్లున్న మా ముగ్గురిలో నొకని నీవు వరించుము. నీ కిష్టమైనచో, నీ పతికి ఈ నియమమును తెలిపి యతనినిచటకు తోడ్కొని రమ్ము.

అప్పుడు సుకన్య చ్యవనుని వద్దకుపోయి వారి మాటలనతనికి తెలిపెను. అతడా నియమమునకు అంగీకరించెను. ఆ సంగతి ఆమె అశ్వినీ దేవతలకు తెలిపెను. వారు ఆమెతో 'నీ పతి నీటిలో మునుగు గాక' యని తెలిపిరి. ఆ ప్రకారమే యితడు రూపార్థియై జలములో ప్రవేశించెను. అతనితోపాటే అశ్వినీ దేవతలు గూడ జలములో మునిగిరి. ఆ ముగ్గురు క్షణకాలములో జలమునుండి యీవలకు రాగానే సమాన రూప యౌవన సౌందర్యములు కల వారుగా సుకన్యకు గోచరించిరి. 'మా ముగ్గురిలో నొకరిని వరించుము' అని వారామెతోననిరి. అప్పుడామె నిశ్చల మనస్సుతో పతిని ధ్యానించి వారిలో తన పతినే వరించెను. అప్పుడు చ్యవనుడు తాను కోరిన భార్యను, వయస్సును, రూపమును పొంది మిక్కిలి సంతోషించి, 'అశ్వినీ దేవతలారా! మీరు నాకు చేసిన యీ మేలునకు ప్రతిగా మీకు యజ్ఞములలో సోమపానము చేయునధికారము ఉండునట్లు వరమిచ్చితిని. ఇంద్రుడు చూచుచుండగనే మీరు సోమరసమును పానము చేసెదరు.' అని వారితో ననెను. ఆ వరమును గొని అశ్వినీ దేవతలు సంతోషులై స్వర్గమునకు పోయిరి. చ్యవనుడు సుకన్య కలిసి దేవ దంపతులవలె విహరించుచుండిరి.

'ధర్మరాజా ! అశ్వినీ దేవతలకు యజ్ఞములో సోమపానాధికారము లభించుటకు ఇది కారణము' అని చెప్పి లోమశుడు తర్వాత కథ నిట్లు చెప్పదొడగెను:—

చ్యవనుడు నవ యౌవనముగలవాడైన సంగతి విని శర్యాతి మహారాజు బిడ్డను అల్లుని చూచుటకు చ్యవనాశ్రమమునకు పోయెను. అచట దేవ దంపతులవలె ఆనందముతోనున్న సుకన్యా చ్యవనులను చూచి మిగుల సంతోషించెను. తాను సమస్త భూమండలమునకు చక్రవర్తియైనట్లు ఆనందించెను. చ్యవనునిచేత పూజితుడై శర్యాతి యతనికడ కూర్చుండి మంచి కథలను వినుచుండెను.

తరువాత చ్యవనుడు శర్యాతితో 'రాజా! నీతో మంచి యాగమును చేయించెదను. దానికి కావలసిన సామగ్రిని చేకూర్చుము, అని చెప్పెను. వెంటనే శర్యాతి సంతుష్టుడై శుభ ముహూర్తమునందు సమస్త సంభారాములతో నొక యాగశాలను నిర్మింపజేసెను. అపుడచట చ్యవనుడు శర్యాతి మహారాజుతో యజ్ఞము చేయించెను. 'ధర్మరాజా! ఆ యజ్ఞమునందు గలిగిన యద్భుతమును చెప్పెదను వినుము' అని లోమశుడిట్లు చెప్పదొడగెను:—

"ఆ యజ్ఞములో చ్యవనుడు అశ్వినీ దేవతలకు ఇచ్చుటకు గాను సోమరసమును తన చేతిలోనికి తీసికొనెను. దానిని

ఇంద్రుడు వారించుచు, 'అశ్వినీ దేవత లిరువురును సోమరసమును పొందుటకు అర్హులుకారు. వీరు దేవతలకు వైద్యముచేయుచు వైద్య వృత్తిలో జీవించుచున్నారు గనుక ఆ వృత్తిగలవారికి యజ్ఞములో సోమరసమును పొందుటకు అర్హతలేదు; అని చెప్పెను.

ఆ మాటలు విని చ్యవనుడిట్లనెను:— "ఇంద్రా! ఈ మహాత్ములిరువురు నా వార్ధక్యమును పోగొట్టి నన్ను దేవసమానునిగా అజరుని చేసిరి. నీవు, ఇతర దేవతలు యజ్ఞములో సోమరసమును అనుభవించుచున్నట్లే వీరేల అనుభవించకూడదు? వారుగూడ దేవతలేకదా!"

అదివిని యింద్రుడిట్లనెను:— "మహాత్మా! ఈ యిరువురు వైద్య వృత్తి నవలంబించినవారు. తమకు ఇష్టము వచ్చిన కామ రూపములను ధరించి మర్త్యలోకములో సంచరించుచుందురు. ఇట్టి వీరికి సోమరసమును పొందుటకు అర్హతలేదు."

ఇట్లు ఇంద్రుడు చెప్పుచుండగనే యతనిని అనాదరించి చ్యవనుడు అశ్వినీ దేవతలకొరకు సోమరస భాగమును చేతిలోకి తీసికొనెను. అది చూచి యింద్రుడు, 'చ్యవనా! నీవు వీరికొరకు సోమరసమును గ్రహించినచో ఈ నా వజ్రాయుధముచేత నీ తలపై మోదెదను.' అని యనెను. ఇంద్రుని మాటను నిర్లక్ష్యము చేసి చ్యవనుడు అశ్వినుల కొరకు సోమగ్రహణము చేయగనే యింద్రుడతనిని కొట్టుటకు వజ్రాయుధము పైకెత్తెను. చ్యవనుడు ఇంద్రుని హస్తమును పైననే స్తంభింపజేసెను. తరువాత చ్యవనుడు అగ్నిలో హోమముచేసి తన మంత్రశక్తిచేత నొక మాయను 'కృత్య'యను దాని నుత్పన్నముచేసెను. ఆ మాయ నుండి మహా ఘోర రూపముగలిగి, నాలుగు కోరలు సుదీర్ఘ భయంకరములుగా గోచరించగా 'మదుడు' అను రాక్షసుడుపుట్టెను. అతడు ముందుకువచ్చి యింద్రుని మ్రింగబోయెను. ఇంద్రుడు మిగుల భయపడి 'క్షమించి రక్షించుము, నేటినుండి అశ్వినీ దేవతలకు యజ్ఞములో భాగము లభించుగాక', యని చ్యవనుని వేడుకొనెను. చ్యవనుడు ప్రసన్నుడై యింద్రుని బాహు స్తంభన మునకు విడుదల కల్పించెను.

ఇంద్రుడు సంతుష్టుడై "మహాత్మా! నీ వీర్యము ప్రపంచ ములో నితోధికముగా ప్రకాశించుగాక. ఈ సుకన్యయొక్కయు నీమె తండ్రియగు శర్యాతియొక్కయు కీర్తి లోకములో ప్రఖ్యా తమగుగాక, ఈ ప్రకారముగా నేను నీ తేజస్సును ప్రపంచములో ప్రఖ్యాతము చేయుటకే యీ పనిని చేసితినే కాని మహాత్మా! నిన్ను తిరస్కరించి నీ యెడల అపరాధము చేయుటకుగాదు— నీవు కోరి నట్లే యగుగాక." అని చెప్పెను.

ఆ మాటలు విని చ్యవనుడు సంతుష్టుడై యింద్రుని అను గ్రహించెను. అతడు 'మద' (మదము) రాక్షసుని, సురాపానము నందును, స్త్రీలయందును, జూదపు పాచికలందును, వేటయందును విభజించెను. ఈ నాలుగు మదమునకు స్థావరములు అని భావము. ఇంద్రునకు, అశ్వినీ దేవతలకు సోమరసమును పంచి యిచ్చెను. శర్యాతి మహారాజుచేత యజ్ఞమును పరిపూర్తిగా నెర వేర్చజేసి చ్యవనుడతనిని, అశ్వినీ దేవతలను సంతృప్తిపరచి సుకన్యతో నా వనమునందు యథేష్టముగా విహరించుచుండెను.

"ధర్మరాజా! ఇంద్రుని వజ్రసహిత హస్తమును చ్యవనుడు స్తంభింపజేసిన విధానమును వింటివి. అట్టి చ్యవన మహర్షియొక్క సరస్సు ఇది. ఇక్కడ మీరు స్నానముచేసి పవిత్రులుకండు. ఇచటి నుండి ముందుకు సాగి అనేక తీర్థములను సేవించుచు 'ఆర్చీక' పర్వతమునకు పొండు. ఆ పర్వతమునందు పూర్వము అనేక రాజులు, నర నారాయణులు, ఋషులు తపస్సుచేసి సిద్ధినిపొందిరి. ఈ సమీపముననే పుణ్య నదియగు యమునకలదు. ఇందు కృష్ణుడు తపస్సు చేయుచుండును. ఇదుగో ఈ సమీపముననే ప్రస్రవణ, తీర్థముగలదు. దీనిని బ్రహ్మాది దేవతలు సేవించిరి. ఈ యమునా తీరమునందే పూర్వము 'మాంధాత' మహారాజు, సహదేవ పుత్రుడగు సోమకుడు యజ్ఞములుచేసిరి." అని లోమశుడు చెప్పెను:— ఆమాటలు విని ధర్మరాజు ఇట్లు ప్రశ్నించెను —

మాంధాతృ చరిత్రము

"మహాత్మా ! యువనాశ్వుని పుత్రుడగు మాంధాత మూడు లోకములలో ప్రఖ్యాతుడెట్లయ్యెను ? మూడు లోకములు అతనికి విష్ణువునకువలె వశ్యమునెట్లయ్యెను ? 'మాధాంత' అని యతనికి పేరెట్లు వచ్చెను ? అతని జన్మ వృత్తాంతమేమి ? చెప్పుము.

ఆ ప్రశ్నములకు లోమశుడిట్లు ఉత్తరము చెప్పెను:— "ఇక్ష్వాకు వంశమునందు 'యువనాశ్వుడు' అను రాజు ఉండెను. అతడనేక యాగములను చేసెను. వేయి అశ్వమేధ యాగములు గూడ చేసెను. ఇంత చేసినను అతనికి సంతానము కలుగలేదు. అతి దుఃఖితుడై రాజ్య భారమును మంత్రులపైనునుంచి సర్వదా వనమునందు నివసించుచు శాస్త్రదృష్టమగు విధిచేత తపోవ్రతాదులు చేయుచు తిరుగుచుండెను. ఒకనాడతడు క్షుత్పిపాసలచేత బాధ పడుచు భృగు మహర్షియొక్క ఆశ్రమములో ప్రవేశించెను.''

'ఆ రాత్రియందే భృగునందనుడగు చ్యవనుడు ఒక యాగ మును చేసి మంత్రపూతమగు జలముతో నింపిన యొక కలశమును వేదికపై ఉంచి యుండెను. ఆ జలమును 'సుద్యుమ్నుని' పుత్రు డగు యువనాశ్వునకు ఇంద్ర సమానుడగు పుత్రుడు కలుగవలెనను ఉద్దేశముతోనే చ్యవనుడచట ఉంచి యుండెను. ఆ యుద్దేశము చేతనే యతడా యిష్టిని చేసి యుండెను. ఆ జలము యువనా శ్వుని రాణి త్రాగుటకుగాను ఆశ్రమములో ఉంచబడి యుండెను. మహర్షులా కలశమును అచట వేదికపైన ఉంచి రాత్రి నిద్ర పోయిరి. ఆ యాశ్రమమునకు దాప్పిగొని వచ్చిన యువనాశ్వుడు పానీయము కావలెనని అచ్చటివారి నడిగెను. అతని క్షీణ కంఠ ధ్వని అచట నిద్రించుచున్నవారిని మేల్కొల్పజాలక పోయెను. అప్పుడచట వేదికపై గనపడుచున్న జల కలశమునందుకొని యిష్ట పూర్తిగా నీరుద్రాగి మిగిలిన నీటిని క్రింద పారబోసి కలశము నచ టనే యుంచెను.

కొంతసేపటికి అచట నిద్రించుచున్న ఋత్విజులు మేల్కొని జలహీనమైన కలశమును చూచి, 'ఈ నీరు ఎవరు త్రాగిరి?' అని అందరిని అడిగిరి. యువనాశ్వుడు 'నేను త్రాగితి'నని చెప్పెను. అది విని చ్యవనుడు 'రాజా ! నీవు తప్పుపని చేసితివి. నా తపః ఫలమునంతయు నీ జలములో నుంచితిని. ఇది నీకు పుత్రుడు కలుగవలెనను నుద్దేశముతోనే సిద్ధముచేసి యుంటిని. బల వీర్య తేజోవంతుడగు పుత్రుడీ జలము త్రాగుటచేత పుట్ట గలడు. అతడు ఇంద్రుని గూడ జయించగలవాడగును. నీవీ జలమును పానముచేసియుండగూడదు. ఇది నీ భార్య త్రాగవలసియుండెను. దైవకృతమునకిపుడు చింతించి ప్రయోజనములేదు. దీనికి అన్యథా చేయుటకు నాకు సాధ్యముకాదు. నేను తపోబలముచేత నింపిన యీ జలమును నీవు దప్పిగొని త్రాగితివి. నీకు పుత్రుడు కలుగును. నీకు గర్భధారణ క్లేశము లేకుండ జేసెదను'' అని చెప్పెను.

ఆ తరువాత నూరేండ్లకు మాంధాత గర్భములోని యెడమ పార్శ్వము చీల్చుకొని యొక పుత్రుడు జనించెను. అతడు సూర్యునివలె ప్రకాశించు చుండెను. గర్భ పాటనము వలన మాంధాత మరణించకయుండెను. ఆ బాలుని చూచుటకు ఇంద్రుడు వచ్చెను. అతనిని దేవతలు 'ఈ బాలుడేమి పానము చేయును ?' అని యడిగిరి. అప్పుడింద్రుడు తన చేతి చూపుడు వ్రేలిని ఆ బాలకుని నోటిలో ఉంచి 'అయం మాం ధాస్యతి' (ఇతడు నన్ను పానము చేయగలడు) అని చెప్పెను. అందుచేత ఇంద్రాది దేవతలా బాలకునకు 'మాంధాత' యని పేరు పెట్టిరి. ఇంద్రుని తర్జనిని పానముచేసి మాంధాత పదమూడు మూరల పొడవు పెరిగెను. అతడు తలచినంత మాత్రమున సమస్త వేదశాస్త్రములు అతనికి అవగతములయ్యెను. 'ఆజగవము' అను ధనుస్సు, కొమ్ముతో నిర్మించబడిన బాణములు అతనికడకు స్వయముగావచ్చి చేరెను. ఇంద్రుడు అతనికి రాజ్యాభిషేకము చేసెను. అతడు ధర్మ మార్గముచేత రాజ్యపాలనము చేయుచు మూడు లోకములను వశపరచుకొనెను. అతని అధికారము సర్వత్ర వ్యాపించెను. అన్ని ఉత్తమ వస్తువులు అతనిని చేరెను. అతడు పరిపూర్ణ దక్షిణలచే ననేక యాగములను చేసెను. తత్ఫలముచేతనే అతనికి ఇంద్రుని యర్ధాసనము లభించెను. తన శాసనముచేత ఒక దినములోనే చతుస్సముద్ర ముద్రితమైన భూమండలమునంతయు తన వశములోనికి తెచ్చుకొన గలిగెను. సమస్త భూమండలమునందు అతడు నిర్మించిన యజ్ఞశాలలుండెను. అనేక సహస్ర గోదానములు చేసెను. పన్నెండేండ్లు అనావృష్టి దోషముచేత దేశము బాధపడుచుండగా నతడింద్రుడు చూచుచుండగనే పుష్కలముగా వానలు కురియించి సస్యవృద్ధి చేసెను. చిత్తమును వశములో నుంచుకొని యతడు దేవతలు, మనుష్యులు, తిర్యక్కులు (పశు—పక్షి—మృగాదులు), స్థావరములు (పర్వత—పాషాణాదులు) అనబడు నీ నాలుగు ప్రజాసంతతిని ఏలెను. తన పరాక్రమము చేత లోకములన్నిటిని వశపరచుకొనెను.

'ధర్మరాజా ! ఆ మాధాంత యొక్క యజ్ఞ స్థానమే యిది. ఇది కురుక్షేత్రము యొక్క మధ్యలోనున్న పరమ పవిత్ర స్థానము దీనిని దర్శించి నీవు గూడ మాంధాత వలె ధర్మపాలనముచేసి అక్షయమగు స్వర్గ సుఖమును పొందుము. రాజా ! నీవు కోరిన ప్రకారము మాంధాత చరిత్రము నీకు సమగ్రముగా చెప్పితిని, అని లోమశుడు చెప్పగా విని యుధిష్ఠిరుడు సంతసించి యా తరువాత 'సోమక' మహారాజు వృత్తాంతము తెలుపుమని యడుగగా లోమశుడిట్లు చెప్పదొడగెను:—

'ధర్మరాజా ! పూర్వము "సోమకుడు" అను ధర్మాత్ముడగు రాజు ఉండెను. అతనికి సమాన వయోరూపములుగల నూర్గురు భార్యలు ఉండిరి. ఆ భార్యలయందు చాలకాలము వరకు అతనికి ఒక్క పుత్రుడు గూడ జనించలేదు. వృద్ధావ్యదశయందు ఒక్క కొడుకు పుట్టెను. నూర్గురు భార్యలు అల్లారు ముద్దుగా అతనిని పెంచుకొనుచుండిరి. ఇట్లుండగా నొకనాడు ఒక చీమ ఆ బాలకుని కటి భాగమునందు కుట్టెను. ఆ బాధకు అతడు బిగ్గరగా అరచెను. అదివిని తల్లులు అతని చుట్టుచేరి పెద్దగా నేడ్చిరి. ఆ శబ్దమును అమాత్యపురోహితాదులతో దర్బారులో నున్న రాజు వినెను. ఆ ధ్వనిని తెలుసుకొనుటకు పంపబడిన ద్వారపాలకుడు వచ్చి జరిగిన వృత్తాంతమును 'రాజునకు తెలిపెను. అతడు త్వరగా అంతఃపురమునకు పోయి బాలుని ఓదార్చి తిరిగి సభామంటమునకు వచ్చి మంత్రిపురోహితులతో ఈ విధముగా మంతనము సలిపెను :—

"ప్రపంచములో ఏక పుత్రుడుగల వ్యక్తికన్న అపుత్రకుడే మేలు. ఏకపుత్రుడు శోకకారణమే అగును. నేను ఈ కారణము చేతనే భార్యా శతమును వివాహము చేసికొంటిని. కాని వారిలో ఒక్కతెకు కూడ సంతానము కలుగలేదు. ఎన్నియో ప్రయత్నములు చేయగా యిందరికి గాను ఒక్కడే కొడుకు పుట్టెను. అది నాకు దుఃఖముగా నున్నది. నాకు, నా భార్యలకు వార్ధకము వచ్చినది. మా అందరి ప్రాణములు కేవలము ఒక్క పుత్రునియందే ఆధారపడియున్నవి. కనుక మీరు యోచించి నాకు పుత్రశతము కలుగునుపాయమును, అది ఎంతకఠినమైనను, చెప్పుడు'' అని ఋత్విక్కులను, పురోహితులను ప్రార్థించెను. ఆ మాటకు ఋత్విక్కుడు 'రాజా నూరుగురు కొడుకులు కలుగుటకు ఒక ఉపాయమున్నది. అది నీవు చేయగలిగినచో చెప్పెదను' అని యనెను.' అందుకు సోమకుడు అంగీకరించెను. అప్పుడు ఋత్విజుడు "రాజా నేను చేయబోవు యజ్ఞమునందు నీ యొక్క 'జంతు' అను కుమారుని బలిగాచేసి హోమము చేసినచో ఆ యజ్ఞ ప్రభావము వలన తొందరలోనే నీకు నూర్గురు కొడుకులు పుట్టెదరు. ఆ హోమ ధూమమును నీ భార్యలు ఆఘ్రాణించినచో మహాతేజో బలవంతులగు నూర్గురు కొడుకులను కనెదరు. ఆ నూర్గురిలో నీవు బలిగానిచ్చిన 'జంతు' కుమారుడుగూడ ఒకడుగా జన్మించును. అతని శరీరములో కుడివైపున బంగారపు వర్ణముగల ఒక మచ్చ ఉండును. ఆ గుర్తుచేత అతడు 'జంతువు' అని మీరు గుర్తు పట్టవచ్చును." అని ఋత్విజుడు చెప్పిన విధానమునకు సోమకుడు అంగీకరించెను.

(సశేషము

యాత్రా కేంద్రంగా నాగార్జునసాగర్ అభివృద్ధి

కొంతమంది వాస్తు శాస్త్రజ్ఞులు ఇటీవల నాగార్జునసాగర్‌ను సందర్శించారు. అంతర్జాతీయ యాత్రా కేంద్రంగా నాగార్జున సాగర్‌ను అభివృద్ధి పరచడానికి అవకాశాలు వున్నవని వారు తమ అభిప్రాయాన్ని ఏకగ్రీవంగా తెలిపారు. దీన్ని అభివృద్ధిపరచ డానికి కొన్ని సూచనలు చేశారు.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ యాత్రా విషయాలశాఖ అభ్యర్థనను పురస్కరించుకొని న్యూఢిల్లీ నుంచి శ్రీ బి. బి. పూరి, బొంబాయి నుంచి బిల్డర్స్ అసోసియేషన్‌కు చెందిన శ్రీ యన్. సి. దండ్, హైదరాబాదు నుంచి సర్వశ్రీ యన్. యన్. చౌళ, కే. ఏ. సిద్దిఖీ, యన్. యన్. ఖాదరీ, సయ్యద్ హుసేన్ ఖాదరీ 1970 జూలై 19, 20 తేదీలలో నాగార్జునసాగర్‌ను దర్శించారు. దీన్ని అంత ర్జాతీయ వినోద యాత్రా కేంద్రంగా అభివృద్ధి పరచడానికి ఒక మాస్టరు ప్లాన్‌ను రూపొందించడానికి వీరు ఇక్కడ రెండు రోజులు చర్చలు జరిపారు. అహ్మదాబాదు నుంచి ప్రత్యేకంగా వచ్చిన శ్రీ జోషి హైదరాబాదు నగరంలోనే సంబంధించిన అధికారులతో చర్చలు జరిపారు.

మహిళా సంక్షేమం, యాత్రా విషయాల శాఖామంత్రిణి శ్రీమతి రోడామిస్త్రీ, సమాచార, పౌరసంబంధ, యాత్రా విషయాల శాఖ డైరెక్టరు, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ కన్సల్టింగ్ ఆర్కిటెక్‌లు శ్రీ రఘుకుల్, నాగార్జునసాగర్ సూపరింటెండింగు ఇంజనీరు శ్రీ యం. గోపాలరావు, పి. డబ్ల్యు. డి ప్రాజెక్టు డిప్యూటీ సెక్రటరీ శ్రీ యన్. యన్. జయరావు వాస్తు శాస్త్రజ్ఞులకు నాగార్జున సాగర్ డాము, నాగార్జునకొండ, ఇతర స్థలాలను చూపించారు.

అంతర్జాతీయస్థాయిలో ఈ ప్రాంతాన్ని అభివృద్ధి పరచినట్ల యితే మన దేశంనుంచి గాక విదేశాల నుంచి కూడా యాత్రికులను ఆకర్షించడానికి అవకాశాలున్నాయని శ్రీ బి. బి. పూరి అభిప్రాయ పడ్డారు. డాము స్పిల్-వేకు విద్యుత్ దీపాలంకరణ చేసినట్లయితే ఆ దృశ్యం ఇంకా మనోహరంగా వుండగలదని కూడా ఆయన చెప్పారు

రు. 200 కోట్లతో నిర్మించబడుతున్న నాగార్జునసాగరు డాములో యాత్రా సౌకర్యాలుకూడ ఇతోధికంగా కల్పించినట్లయితే జాతీయ అంతర్జాతీయ యాత్రికులకు ఇది దర్శనీయమైన యాత్రా కేంద్రంగా వుండగలదని శ్రీ యన్. దండ్ చెప్పారు.

టైగర్ లోయలలో తోటలు పెంచాలని, అక్కడ పై నుంచి క్రింది వరకు నీరు చుక్కలు చుక్కలుగా దిగజారే విధ ముగా చేసి, జలపాతాలకు సైడ్ లైటింగ్ ఏర్పాటు చేసినట్లయితే కమనీయమైన దృశ్యంగా ఇది రూపొందగలదని శ్రీ యన్. చౌళ అభిప్రాయ పడ్డారు. అన్ని వర్గాల యాత్రీకులకు తగినట్లుగా వసతి, భోజన సౌకర్యాలుండాలని కూడా చెప్పారు. నాగార్జున సాగర్ ప్రాజెక్టులోకి ప్రవేశించేచోట ఒక సమాచార కేంద్రం వుండాలని సూచించారు.

యాత్రా విషయాల దృష్ట్యా నాగార్జున డాము, నాగార్జున కొండ విశేషాలను దేశ ప్రజలకు తెలపడానికి తగిన చర్యలు తీసు కోవాలని శ్రీ కె. ఏ. సిద్దిఖీ సలహా ఇచ్చారు. నిపుణులతో కూడిన ఒక జట్టును ఏర్పాటుచేసి, వారి సలహా ప్రకారం, ఇట్టి ప్రాజె క్టులలో భారీ యెత్తున యాత్రా కేంద్రాలను అభివృద్ధి జతపరచవచ్చు నని కూడా ఆయన చెప్పారు.


నాగార్జునకొండవద్దనున్న జాతీయ బౌద్ధ వస్తు ప్రదర్శన శాలను గురించి దేశంలో తగిన ప్రచారం చేయాలని సూపరింటెం డింగు ఇంజనీరు శ్రీ యం. గోపాలరావు చెప్పారు. యాత్రికులకు రవాణా సౌకర్యాలను అభివృద్ధి పరచాలని సూచించారు. బౌద్ధ సాంస్కృతిక కేంద్రంగా నాగార్జునకొండను అభివృద్ధిపరచాలని కూడా ఆయన సలహా ఇచ్చారు.

ఒరిస్సా ముఖ్యమంత్రిచే నాగార్జునసాగర్ ప్రశంస

ఒరిస్సా ముఖ్యమంత్రి, శ్రీ ఆర్. ఎన్. సింగ్‌దేవ్, ఒరిస్సారాష్ట్ర రివెన్యూ, నీటిపారుదల శాఖా ఉపమంత్రి శ్రీ హెచ్. ఎస్. పడీ యిటీవల నాగార్జునసాగర్ ప్రాజెక్టును సందర్శించి నప్పుడు దిగువ విధంగా ప్రశంసించారు.

“ నాగార్జునసాగర్‌ను దర్శించినందుకు మాకెంతో ఆహ్లాద కరంగా ఉంది. దేశంలో మానవ నిర్మాత సరోవరంలో యిది చాలాపెద్దది. డామ్‌కూడా దేశంలోకెల్లా ఎత్తైనది. నిధులు సక్రమంగా అందనికారణంగా నిర్మాణం మందకోడిగా జరిగినప్ప టికీ డాము జలాశయ నిర్మాణాన్ని విజయవంతంగా పూర్తిచేసిన ఇంజనీరులు అభినందనీయులు. కాలవ నిర్మాణం 60 శాతం పూర్తి అయింది. వీటిక్రింద సుమారు 10 లక్షల ఎకరాలభూమి సాగు అవుతుంది. ప్రాజెక్టు అన్ని విధాలుగా పూర్తి అయిన తరువాత దీనిక్రింద 40 లక్షల ఎకరాలభూమి సాగు అవుతుంది. ఈ ప్రాజెక్టులో విద్యుచ్ఛక్తికై పవర్ స్టేషను ఇంకా పూర్తి కావలసివుంది. ఇది పూర్తి అయినప్పుడు ఈ ప్రాంతానికి సమృద్ధిగా జలాలు, విద్యుచ్ఛక్తి సరఫరా అవుతాయి. అప్పుడు అనేక క్రొత్త పరిశ్రమలు నెలకొల్ప బడుతాయి. ఆంధ్రప్రదేశ్ సత్వర ఆర్థికాభివృద్ధికి ఇవి దోహదకారి అవుతాయి.

రాజమహేంద్రవర వైభవం



—రావుల శ్రీరామచంద్రమూర్తి

పావన గౌతమీనదికి తూర్పుతీరాన చాళుక్య రాజు రాజ రాజనరేంద్రునిచే నిర్మింపబడి నేటికీ ఆంధ్రప్రదేశంలో పవిత్ర క్షేత్రంగా విరాజిల్లుతోంది రాజమహేంద్రవర పట్టణం. రాజ రాజ నరేంద్రుడు (క్రీ.శ. 1022-1063) ఈ పట్టణాన్ని రాజధానిగా చేసుకొని నలుబది సంవత్సరాలు పరిపాలించాడు. కొంతమంది చరిత్ర కారులు క్రీ.శ.918 నుండి 925 వరకు పరిపాలించిన అమ్మ రాజ విష్ణు వర్ధనుడు రాజమహేంద్రవరం నిర్మించెనని వ్రాశారు. అయితే విన్నకోట పెద్దన్న కావ్యాలంకార చూడామణి అనే గ్రంథంలో రాజరాజ నరేంద్రుడు నిర్మించెనని వ్రాశాడు

ఈనాటికీ చాళుక్య రాజుల కాలం నాటి కట్టడాలు కొన్ని ఈ పట్టణంలో చూడవచ్చును. ఇప్పటి రాజవీధి చాళుక్య రాజులకు ముఖ్య మార్గంగా ఉండి ఊరేగింపులకు ఉపయోగించే వారని చెప్పెదరు. ప్రస్తుత పురపాలక సంఘ నీటి సరఫరా కేంద్రం, ఉన్నత పాఠశాల భవనాలు రాజరాజ నరేంద్రుని అర్ధాంగులు రత్నాంగి, చిత్రాంగుల భవనాలని వినికిడి. ఆ రాణులు వారి భవనాల నుండి సొరంగ మార్గం ద్వారా గోదావరి నదికి స్నానానికి వెళ్ళేవారట.

తెలుగు భాషకు పుట్టిల్లు రాజమహేంద్రవరం. రాజరాజ నరేంద్రుడు తన ఆస్థాన కవి నన్నయ భట్టుని, వేదవ్యాసుడు సంస్కృత భాషలో రచించిన మహాభారతమును తెలుగులో అనువదించమని కోరెను. ఆ గ్రంథం పూర్తయ్యేలోగా రాజరాజ నరేంద్రుడు, నన్నయ భట్టు కూడా స్వర్గస్థులయ్యారు. తరువాత తిక్కన, ఎఱ్ఱాప్రగడలు ఆ గ్రంథాన్ని పూర్తి చేసినప్పటికీ ఆ ఖ్యాతి రాజరాజ నరేంద్రునికి, నన్నయ్య భట్టుకు దక్కింది.

సారంగధర మెట్ట

రాజ రాజనరేంద్రునికి మాయని మచ్చగా నిలిచే, సారంగధర మెట్ట ఈ పట్టణానికి ఉత్తరదిశలో ఉంది. రాజరాజ నరేంద్రుడు పుత్రుడైన సారంగధరుని పెళ్ళి చూపులకు వెళ్ళి చిత్రాంగి అనే రాజపుత్రి సౌందర్యాన్ని చూచి, రాజరాజనరేంద్రుడు తానే రాజ పుత్రిని వివాహమాడాడు ఒక రోజు తన తండ్రి వేటకు వెళ్ళిన సమయాన సారంగధరుడు తన పావురాన్ని పట్టుకోవడానికి చిత్రాంగి భవనానికి వెళ్ళడం తటస్థించింది. సారంగధరుని మీద మనస్సు ఉన్న చిత్రాంగి తన కోర్కెను వెల్లడిస్తుంది కాని ఆ దురాచారానికి సారంగధరుడు పాల్పడడు. తన కోరిక నిరాకరించినందుకు కోపగించి రాజరాజ నరేంద్రుడు పట్టణానికి వచ్చిన తరువాత, సారంగధరుడు తనను బలాత్కరించ బోయినట్లు నెపం వేస్తుంది. విచారణలో సారంగధరుడు ఏమీ చెప్పనందున రాజ రాజ నరేంద్రుడు అతనిని పట్టణానికి చివరగల చిన్న కొండ మీదకు పంపి చిత్రవధ చేయించాడు, కొండ "సారంగధర మెట్ట"గా పిలువబడుతోంది. తరువాత కొన్ని సంవత్సరాలకు నిజం బయల్పడి చిత్రాంగికూడా అదేవిధంగా శిక్షింపబడుతుంది. ఆమెశరీరం ముక్కలుగా చేయబడి ఆ కొండమీద ఉన్న నూతిలో వేయబడింది. చాళుక్య రాజుల కాలం నాటి బళ్ళెములు కత్తుల మొదలైన ఆయుధాలు ఆ నూతిలో ఉంటాయని పెద్దలు చెప్పెదరు. సారంగధరునికి జరిగిన అన్యాయానికి ప్రజలలో ఉద్రేకంవచ్చి రాజరాజ నరేంద్రుని పట్టణం నుంచి తరిమివేశారని అంటారు. దక్షిణ భారతమంతా ఈకథ ప్రచారంలో ఉండి నాటక రూపంలో ప్రదర్శించబడింది. ఈ కథ నిరూపించడానికి చారిత్రాత్మక నిదర్శనాలు లేవని ఇది కేవలం కల్పితమని చెప్పారు. రాజరాజనరేంద్రుడు తనమేనమామ రాజేంద్రుని కుమార్తె అమ్మ నాంగ దేవిని పరిణయమాడినట్లు కొంతమంది చరిత్రకారుల విశ్వాసం. సారంగధరునికి శివుడు పునర్జన్మ ప్రసాదించెనని కొందరి వాదన. ఏమైనప్పటికి రాజరాజ నరేంద్రుని తరువాత చాళుక్య రాజుల ఖ్యాతి నశించెనని చెప్పాలి.

పవిత్ర క్షేత్రం

దక్షిణ భారతదేశంలో పవిత్రనది గోదావరి తీరాన ఈ పట్టణం ఉన్నందున అనేక మంది యాత్రికులు నిత్యం ఇచ్చట స్నానమాడి పూజలు చేస్తుంటారు. కోటిలింగాలలో ఒకటి వారణాశిలోను, మిగిలిన వన్నీ ఈ పట్టణం వద్ద గల గోదావరి నదిలోను ఉన్నవని చెప్పెదరు. అందుచేతనే ఈ పట్టణాన్ని కొందరు దక్షిణ కాశిగా వ్యవహరిస్తారు. కాశీ యాత్ర చేసిన వారు గంగానది నీటితో ఇచ్చట గంగ పూజ జరిపినప్పుడే వారి యాత్ర పూర్తయినట్లు తలుస్తారు. ప్రతి సంవత్సరం మహాశివరాత్రి పర్వదినాన వేలాది మంది యాత్రికులు గోదావరినదిలో స్నానంచేసి శివుని పూజిస్తారు.

పన్నెండు సంవత్సరాల కొకసారి జరిగే "పుష్కర ఉత్సవం" రోజులలో భారత దేశంలోని అన్నిప్రాంతాల నుంచి యాత్రికులు వచ్చిపూజలు జరిపిస్తారు. ఈపట్టణంలో శ్రీ ఆంజనేయస్వామి, మార్కండేయస్వామి, వినాయకుడు, శ్యామలాంబ చాముండేశ్వరి దేవి, కసిమాంబ మున్నగు ఆలయాలు ఉన్నాయి.

భారత దేశంలో గల పెద్ద వంతెనలలో ఒకటిగా చెప్పబడే కొవ్వూరు-రాజమండ్రి పట్టణాలమధ్య ఉన్న వంతెన, ధవళేశ్వరం వద్ద ఆనకట్ట ఆంగ్లేయుల పాలనలో నిర్మించ బడ్డాయి. తూర్పు గోదావరి జిల్లాలో రాజోలు, అమలాపురం, కొత్తపేట, రామచంద్రపురం, కాకినాడ తాలూకాలలో సుమారు మూడులక్షల ఎకరాల భూమి ఈ ఆనకట్ట ద్వారా సాగుచేయబడుతోంది.

సాంఘిక సంక్షేమం

సాంఘిక సంక్షేమ కార్యక్రమాలలో ఈ పట్టణం అనేక సంవత్సరాల నుంచి ముందంజ వేస్తున్నది. సంఘ సంస్కర్త శ్రీ కందుకూరి వీరేశలింగం పంతులు ఈ పట్టణంలో జన్మించారు. వితంతువులకు, అనాథులకు ఆశ్రయమిచ్చి సంఘంలో వారికి స్థానాన్ని ఏర్పరచడానికి పూనుకొని హితకారిణీ సమాజం అనే సంస్థను స్థాపించి తన ఆస్తి అంతా ఆ సంస్థకు అర్పించారు. శ్రీ పంతులుగారి ఆశయాలను అమలులో పెట్టడానికి ఆ సమాజం ఇప్పుడు అవిరళ కృషి చేస్తున్నది.

ఇతర సాంఘిక సంక్షేమ సంస్థలగు శ్రీ గౌతమీ జీవకారుణ్య సంఘం, శ్రీ వీరవెంకట సత్యనారాయణ స్వామి దేవస్థానం కుష్ఠరోగుల అనాథ శరణాలయం, రామకృష్ణమఠం. భారతీయ రెడ్‌క్రాస్ రాజమహేంద్రవర విభాగం కూడా, సమస్యలతో సతమతమౌతున్న ప్రజానీకానికి సేవచేస్తున్నాయి.

ప్రభుత్వ ఆసుపత్రి, క్షయవ్యాధి నిర్మూలనా కేంద్రం, పురపాలక సంఘ మాతా శిశు సంరక్షణాలయాలు, ఇతర ఆసుపత్రుల ద్వారా వైద్య సదుపాయాలు కలుగజేయబడు తున్నాయి.

ఆంధ్రప్రదేశ్‌లోగల జైళ్ళలో పెద్దది ఈ పట్టణంలో ఉన్నది. యాత్రికులు, అధికారుల అనుమతితో నిర్ణీత రోజులలో దానిని సందర్శించ వచ్చును.

విద్యా సంస్థలు

ఈ పట్టణంలో ప్రజల విద్యావసరాలకు అనుగుణంగా వివిధ ప్రాంతాలలో ప్రాథమిక పాఠశాలలు, ఉన్నత పాఠశాలలు నెలకొల్పబడ్డాయి. ప్రభుత్వ కళాశాల, శ్రీ రాజ్యలక్ష్మి మహిళా కళాశాల, ప్రభుత్వ బోధన శిక్షణా కళాశాల, రామదాస్ సహకార శిక్షణ కేంద్రం ఉన్నాయి.


పరిశ్రమలు


పారిశ్రామిక రంగంలో కూడా ఈ పట్టణం అభివృద్ధిచెందు తోంది. ఆంధ్రప్రదేశ్ కాగితపు మిల్లు, భారతీయ పొగాకు కేంద్రం, పింగాణి, అల్యూమినియం పరిశ్రమలు వేలాది మందికి ఉపాధి కల్పిస్తున్నాయి.

ఈ పట్టణ పరిసర ప్రాంతాలలో అనేక ఫలవృక్షాలు, పూల తోటలు పెంచబడుతున్నాయి. ఈ పట్టణానికి సమీపాన గల కడియం నుంచి రకరకాల పూల మొక్కలు, ఫలవృక్ష విత్తనాలు ఇతర రాష్ట్రాలకు ఎగుమతి చేయబడుతున్నాయి.

గోదావరి నదికి అడ్డుగా రాజమహేంద్రవరం వద్ద నూతనంగా నిర్మించబడే రైలు-రోడ్డు వంతెన, బ్యారేజి పూర్తయిన తరువాత భారత దేశంలో పవిత్ర యాత్రా స్థలంగాను, వ్యాపార కేంద్రం గాను ఈ పట్టణం మరింత అభివృద్ధి సాధించ గలదని ఆశిద్దాము, ★

రామప్ప దేవాలయం





వరంగల్లు జిల్లాకు ఈశాన్యంగా సుమారు 40 మైళ్ళదూరంలో "రామప్ప గుళ్ళు" గలవు దాని ప్రక్కనే రామప్ప చెరువు.

మధ్యయుగాల దక్కను దేవాలయ శిల్ప నిర్మాణ హారంలో రామప్ప దేవాలయం నాయకమణి వంటిది. ఆవరణంలోని శాసనమును బట్టి క్రీ. శ. 1234 లో ఇది కాకతీయ శిల్పములలో అద్భుత నిదర్శనము పాలంపేటయందు కాకతీయ గణపతి సామంతుడైన, రేచెర్ల రుద్రసేనానియగు రెడ్డి సామంతునిచే నిర్మింప బడినది. ఈ దేవాలయము కాకతీయ శిల్పమునకు ఉపమానికమని చెప్పవచ్చును.

ఈ దేవాలయమునకు పెద్ద పెద్ద వెడల్పు రాళ్ళతో కట్టిన ప్రాకారం వుంది ఉత్తర దక్షిణపు చివరలలో చిన్న చిన్నవి దేవాలయాలు ఉన్నాయి ఈ దేవాలయం హనుమకొండలోని వేయిస్తంభాల దేవాలయం పద్ధతినిర్మాణశైలిలోనే నిర్మింపబడింది. కాని యింకా అలంకారాలు యిక్కడ ఎక్కువగా ఉన్నాయి

కాకతీయ శిల్పమునందు అసామాన్య శ్రద్ధయు, సూక్ష్మ పరిశీలనయు, సౌందర్య పిపాసయు కానవచ్చును అనాటి శిల్పులు చూపిన విజ్ఞానము వారికే తగును బ్రహ్మాండమగు శిలలను వారు బెండువలె అవలీలగ నెత్తివైచి స్తంభములుగను, ద్వారములుగను ఉపయోగించెడి వారు వారు సామాన్యముగా వాడినవి ఉక్కుతో పోల్చదగిన నల్లశిలలు. అచ్చటచ్చట ఎఱ్ఱనిరాళ్ళుకూడ వాడబడినవి వజ్రకఠినములగు యీ శిలలపై కాకతీయ శిల్పులు వివిధములగు నగిషీపనులు, జంతువుల రూపములు, మనుష్యుల యాకారములు, దేవతా విగ్రహములు, వివిధమగు దుస్తులతో, ఆయుధములతో, భంగిమములతో, అద్భుతమగు నేర్పుతోడను, నిర్దుష్టమగు సూక్ష్మములతోడను మలచిరి. లోహాతి కఠినమగు నీ శిలలు శిల్పుల చేతియందు వెన్నవలె మెత్తబడినవా యని చూపరులు భ్రమపడుటకు అవకాశము గలదు,

ఆ గుళ్ళలోని విగ్రహములు, స్తంభాలపై శిల్పములు, ముఖ్యముగా దేవాలయ మంటపముపై కోణములందు నాలుగు దిశలందు నిలిపిన పెద్ద నల్లరాతి నాట్యకత్తెల విగ్రహాలు అతి సుందరములు ఆ విగ్రహాలపై సొమ్ముల అలంకరణములు వాటి త్రిభంగీ నాట్యభంగిమము శిల్పకారులనే మోహింప జేసినట్లున్నది. అందుచేతనే శిల్పులు

ఆ సుందరాంగులకు తుష్టిపూర్తిగా ప్రసాధన క్రియలను సమకూర్చి అందు రెంటిని నగ్నముగా తీర్చిదిద్ది ఆనందించినారు. దేవాలయములోని స్థంభాలపై నాట్యభంగిమములు, మృదంగాది వాద్యములు వారి రేఖలు చిత్రింపబడినవి.

వివిధ భంగిమములలో నృత్యంచేస్తున్న చిత్రాలు స్థంభాల మధ్యభాగాలను కలుపుతూ, చిత్రించబడి వుండటం ఇక్కడ ప్రత్యేకత. చిత్రాలు, నల్లటినునుపు రాతిమీద చెక్కబడి బాగా తళతళ లాడుతుంటాయి. నిజంగా నృత్యం చేస్తున్నట్లు కండ్లకు కనిపిస్తూ యీ చిత్రాలు సజీవంగా, కళాత్మకంగా చూపరులకు అచ్చెరువు కలిగిస్తూ ఉంటాయి.

ఆ కాలంలో జాయపసేనాని యను నతడు సంస్కృత నాట్య శాస్త్రమును వ్రాసెను. అందలి ఉదాహరణములు, ఆ స్థంభాలపై నాట్యము చేస్తున్న సుందరీమణులే యని యందురు.

కాకతీయ శిల్పులచే సిద్ధము చేయబడిన నందీశ్వరుని విగ్రహములు ముద్దులుమూట గట్టుచు జీవకళతో వుట్టిపడుచున్నవి. రామప్ప దేవాలయములోని నందీశ్వరుని విగ్రహములో సహితము అట్టి జీవకళ నేటికిని, వుట్టిపడుచున్నది. ఏ మాత్రము తగ్గలేదు. నాట్యభంగిమములలోని, శిలావిగ్రహములు యాత్రికులను ఆకర్షించుటకు వానిలోని జీవకళయే ఆదర్శము, అనేకులు వీనిని దర్శించి మురుస్తారు.

దేవాలయ శిఖరం పెద్ద పెద్ద యిటుకలతో నిర్మించబడింది. ఈ ఇటుకలు నీటిలో వేస్తే తేలుతవి.

నేటికిని ఈ దేవాలయము, మారు దేశములనుండి వచ్చు అనేక యాత్రికులను ఆకర్షించుచున్నది.

యాత్రికుల సౌకర్యార్థము హనుమకొండనుండి పాలంపేట వరకు ఆంధ్రప్రదేశ్ రోడ్డు ట్రాన్సుపోర్టువారి బస్సులు నడచుచుండును. యాత్రికులు నివసించుటకు పాలంపేటలో ఒక రెస్టుహౌసు మరియు రామప్ప చెరువుపైన ఒక టూరిస్టు రెస్టుహౌసు, "వనవిహార్" గలదు.

పి. రామస్వామి

నీలో చీకటి తొలగాలి

యస్. వెంకటరంగారెడ్డి

నీలోచీకటి తొలగాలి...
నీవే దీపమై వెలగాలి...
కలతల భావాలు కరగిపోవాలి...
కూరిమి భావాలే నిలచి పోవాలి...
స్వార్థమనే పిశాచం నిన్నువీడాలి...
సోదర భావమే నీలోరావాలి...
నీలోచీకటి తొలగాలి...
నీవే దీపమై వెలగాలి...
నీలో, కంటకాలే అణగి పోవాలి...
నవ్వే కుసుమాలే వికసించాలి...
కోపమే నిన్ను చూచి పారిపోవాలి...
కష్టాలే, సుఖాలని, కష్టిస్తే సుఖముందని
మేధస్సుతో ముందుకు పోవాలి...
అభ్యుదయదారులలో సాగ పోవాలి...
అనురాగ సుధ జల్లు కురిపించాలి
నీ ఇల్లు రతనాలతో నిండాలి...
నీ మనసునవ్వులతో ఆడాలి నీలోచీకటి తొలగాలి
నీలో చీకటి తొలగాలి
నీవే దీపమై వెలగాలి
నిర్మల మనసులో దైవము నిలువాలి
న్యాయమే నీలో గూడు కట్టుకోవాలి
నీ మనసే నీతికి మందిరం కావాలి
నీవే ప్రగతికి పందిరి వేయాలి
నీలోని కలలన్నీ నిజాలై నిలువాలి
నీవే జాతికి వెలుగయి పోవాలి
నీలో చీకటి తొలగాలి
నీవే దీపమై వెలగాలి

* * *

చైతన్యమూర్తులు

దేశబంధు చిత్తరంజన దాస్

(జననం: నవంబరు 5, 1870)

"దేశానికి స్వాతంత్ర్యం సముపార్జించే యత్నంలో నేను మరణిస్తే ఈ దేశంలో మళ్ళీ మళ్ళీ జన్మిస్తాను. జన్మించి దాని కోసం జీవిస్తాను. ఆశతో అపేక్షతో జీవిస్తాను. నాయావచ్ఛక్తీ, నా యావచ్ఛక్తినీ అంకితంచేసి కృషి చేస్తాను. నా కాంక్ష ఫలించేదాకా నా ఆశయం నెరవేరేదాకా కృషిచేస్తాను" అన్నాడు దేశబంధు చిత్తరంజన దాస్

స్వాతంత్ర్య సమరం సమాప్తం కాకుండానే ఆయన 1925 జూన్ 16వ తేదీన తనువు చాలించాడు. దేశ స్వాతంత్ర్యంకోసం చిత్తరంజనుడు చేసిన త్యాగం మహత్తరమైనది. మనకు స్వాతంత్ర్యం సిద్ధించింది కనుక దానికోసం మనం ఇప్పుడు చేయవలసిన త్యాగం ఏమీలేదు. మనం ఇప్పుడు చేయవలసిన సాధన వైయుక్తిక ఔన్నత్యం కోసం. మనం ఈ నాడు చేయవలసిన కృషి సంఘ సౌభాగ్యం కోసం.

చిత్తరంజనుని నైతిక భావన అసమాన్యమైనది. ఆయన తండ్రి భువనమోహన దాస్ విస్తారంగా ఋణాలు చేయవలసి వచ్చింది. ఒక మిత్రునికి జామీను వుండడంవల్ల అతడు చెల్లింపవలసి ఉండిన 40,000 అప్పుకూడా భువనమోహనునిపై పడింది. చిత్తరంజనుడు బారిస్టరు. 'లా' ప్రకారము ఆ అప్పులు తీర్చవలసిన బాధ్యత ఆయనకు లేదు. మానవుడు చేసిన చట్టానికి కాక దైవ శాసనానికి తలఒగ్గిన ధర్మవేత్త ఆయన. కన్న తండ్రి బాధ్యుడైన దాదాపు 70 వేల రూపాయిల ఋణాన్ని తీర్చి చిత్తరంజనుడు ధర్మ దేవతకు నీరాజనం పట్టాడు.

దీనులకూ దుఃఖితులకూ ఆయన ఆశ్రయంగా ఉండేవాడు. పురులియా పట్టణంలో పిత్రార్జితమైన యింటిలో అనాథాశ్రమాన్ని స్థాపించి దానికోసం నెలకు రెండువేలరూపాయిలు ఖర్చుచేస్తూ ఉండేవాడు. విద్యాసంబంధాశ్రమానికి రెండు లక్షల రూపాయిలు తన యింటివాళ్ళకు తెలియకుండానే గుప్తదానం చేశాడు. ఈనాడు నూరురూపాయల విరాళం లాంటిది ఇస్తే నూరుమంది చేతనైనా పొగిడించుకొని వార్తాపత్రికల్లో నూరు పంక్తులైనా వ్రాయించుకొంటేనేకాని తృప్తి కలగని మనస్తత్వం ప్రబలింది. చిత్తరంజనుని చిత్తశుద్ధి ఎంత ప్రశస్తమైనది!

ఒకనాడు ఒక ప్రముఖ వ్యక్తి చిత్తరంజనునితో ఇలా అన్నాడు; "దాసుబాబు, మీరు ఎంతమందికో దానం చేస్తున్నారు. వారంతా పాత్రులే అంటారా? మీ ఔదార్యాన్ని అవకాశంగా చేసుకొని అనేకులు మిమ్మల్ని వంచించి అనుచితంగా ప్రయోజనం పొందుతున్నారు" దాసుబాబు మందహాసం చేస్తూ ఇలా జవాబు చెప్పాడు; "హుఁ కొందరు అలా ప్రయోజనం పొందుతూ ఉండవచ్చు. నేను మోసపోతున్నాని నేను ఎప్పుడూ అనుకోను. నేను నా ధనాన్ని భగవానుని సేవకోసం వినియోగిస్తున్నానని నా విశ్వాసం. పోనీ నేను ఎవడు పాత్రుడూ, ఎవడు అపాత్రుడూ అని వివేచన చేసుకుపోతూఉంటే వారి గుణ దోషాలను నిర్ణయించడంలోనే నాకాలం వ్యయమైపోతుంది. మరి నేను దానం చేయడానికి సమయం ఎప్పుడు చిక్కుతుంది?"

కల్పవృక్షం అర్థించిన వారికందరికీ లేదనకుండా కాదనకుండా ఇస్తుంటుంటారు. యోగ్యతా అయోగ్యతా విచక్షణ చేస్తుందా కల్పతరువు? చేయదనే అనుకోవాలి. అలాగే చిత్తరంజన కల్పభూజం కూడా.

ఒకసారి ఒక విధవరాలు తన కుమార్తె వివాహం కోసం సహాయం అర్థించడానికి వచ్చింది దాసుబాబు దగ్గరికి. "ఎంత డబ్బు కావలసివస్తుం దమ్మామీకు?" అని అడిగాడు చిత్తరంజనుడు. "బాబుగారూ, ఏడు వందలు అవసరం ఉంది. అందులో మూడువందలు ఇల్లిల్లూ భిక్షమెత్తి పోగుచేసుకొన్నాను. ఇక..." అని ఆ పేదరాలు అంటూ ఉండగానే ఆ మహనీయుడు మధ్యలోనే అడ్డు వచ్చి "మంచిది-మంచిది ఆ మూడు వందలు మీరు మీదగ్గర పెట్టుకోండి. ఆ తరువాత కూడా మీకు ఖర్చుఉంటుంది కదా. ఇదిగో ఈ ఏడువందలు తీసుకొని వెళ్ళండి" అని సాగనంపాడు.

సహాయనిరాకరణోద్యమంలో లక్షలు తెచ్చే బారిస్టరు వృత్తికి తిలోదకాలిచ్చిన దేశబంధుడు ఆర్థికంగా చాలా కటకట లాడవలసి వచ్చింది. తాను స్వయంగా కష్టపడుతున్నా ఇతరుల కష్టాలలో ఆదుకోవడం ఆయన సహజగుణం. ఇక కొద్దిరోజులలో చనిపోతాడనగా ఆపద్యామూర్తి తన ఉంగరం అమ్మించి ఒక మాతృమూర్తికి ఆమె పుత్రిక వివాహం కోసం ఆరువందల రూపాయలు అందజేశాడు. అవసానదశలో ఆయన తన భవనాన్ని ఒక ధర్మకర్తృ సంఘానికి అప్పగించి మరణ శాసనం వ్రాసి యిచ్చాడు. ఆ ఆస్తిని అమ్మివేసి మొదట తన ఋణాలన్నీ తీర్చివేయాలి. మిగినసొమ్ము ఆలయనిర్మాణమూ, మహిళా శిక్షణ, సంక్షేమ కార్యక్రమాలకూ వినియోగించాలని ఆయన నిర్దేశించాడు.

యౌవనంలో నాస్తికునిగా ఉండిన చిత్తరంజనుడు క్రమంగా పరివర్తనం చెందాడు. ఆయనలో భక్తి ఉప్పొంగింది. పరమ వైష్ణవునిగా పరిణతి పొంది మయూర పింఛమండితుడు, మురళీ మోహనుని చింతిస్తూ అంతిమశ్వాస తీశాడు భారత మాతృ చిత్తరంజకుడు చిత్తరంజనుడు.

కావ్యకంఠ వాసిష్ఠ గణపతి ముని

(జననం : నవంబరు 17, 1878)

పాండిత్యం పల్లవించి కవిత్వం పుష్పించిన కమనీయ తరువు కావ్యకంఠ గణపతి శాస్త్రి. మేధస్సు వికసించి తపస్సు ఫలించిన మహనీయ వృక్షం వాసిష్ఠ గణపతి ముని.

ఇప్పటి శ్రీకాకుళం జిల్లాలోని కలువరాయి అనే ఒక చిన్న గ్రామానికి చెందిన అయ్యల సోమయాజుల నరసింహశాస్త్రి



కుమారుడు గణపతి శాస్త్రి అసాధారణ మేధావి ఐన ఆ బాలుడు ఆరవయేటనే ఏకసంథాగ్రాహిగా ప్రసిద్ధిపొందాడు. పదవయేట ఆశువుగా పాండవ ధార్తరాష్ట్ర సంభవం అనే 34 శ్లోకాల సంస్కృతఖండ కావ్యాన్ని ఒక్కగంటలో చెప్పాడు.

పదమూడేళ్ళ ప్రాయంలోనే బాల గణపతి ప్రౌఢకవి భవభూతి పలికినంతటి అతిశయంతోను ఇలా అన్నాడు.

ఇహ కేషాంచి దేషాచేన్న సంతోషాయ కాకతిః
కి మానందాయ కాకానాం బాలకోకిల కాకలీ

నా వాక్కు కొందరు అల్పజ్ఞులకు సంతోషం కలిగించక పోతే నాకు నష్టం ఏముంది ? కాకుల ఆనందం కోసం బాలకోకిల మధురధ్వని చేస్తుందా ?

ఉత్తరదేశంలో దాక్షిణాత్యులపట్ల ఔదాసీన్యం ఉండిన రోజులలో గణపతి శాస్త్రి నవద్వీపం వెళ్ళి అక్కడ పండిత సభలో

గణపతి రితి కవికులపతి రతిదక్షో దాక్షిణాత్యోహమ్ "నేను గణపతి అనే కవికులపతిని, అతి సమర్థుణ్ణి, దక్షిణ దేశస్థుణ్ణి" అని చెప్పి భేరీ మోగించి పలికాడు. అక్కడ జరిగిన కఠిన పరీక్షలో ఉత్తీర్ణుడై కావ్యకంఠ బిరుదాన్ని సంపాదించాడు. "ప్రాచీనులైన కాళిదాసాది మహాకవులు ఎలాంటి కీర్తిని పొందారో వారిని అనుసరించిన నీకు కూడా అలాంటి కీర్తి కలిగింది" అని ప్రశంసా పత్రంలో గణపతి కవిని ప్రస్తుతించారు

చెన్నపట్టణంలో కూడా కావ్యకంఠుడు తన ప్రజ్ఞా ప్రాభవాన్ని ప్రదర్శించాడు ఒకనాడు ఒక వైద్యుడు ఒక ఆయుర్వేద వైద్య గ్రంథాన్ని గణపతి శాస్త్రి చేతిలో పెట్టాడు. శాస్త్రి దానిని ఒకసారి మొదటినుంచి చివరిదాకా చదివి ఇచ్చివేశాడు వైద్యుడు కొన్ని సందేహాలను తీర్చుకోడానికి ప్రశ్నలు వేశాడు. గణపతి శాస్త్రి మళ్ళీ పుస్తకం చూడకుండానే ఆయా శ్లోకాలను వల్లించి తాత్పర్యం చెప్పాడు.

శాస్త్రికి ఇంగ్లీషురాదు. ఆంగ్ల శబ్దాల తియ్యదనాన్నీ ఆంగ్ల కవుల భావాలలోని విశిష్టతనూ తెలియజేస్తూ ఒక పెద్దమనిషి షేక్స్‌పియర్ రచించిన మాక్బెత్ నాటక కథనూ, విశేషాలనూ తెలియజేశాడు శాస్త్రికి. వెంటనే ఆ మహామనీషి

డంకన్ నామ మహీపతి స్సమభవాత్
స్కాట్లాండు దేశే పురే

అని మొదలుపెట్టి మాక్బెత్ నాటక కథను అనర్గళధారతో సొంతంగా చెప్పుకొని పోయాడు

గణపతి శాస్త్రి కొన్నాళ్ళు అరుణాచలంలో అధ్యాపకునిగా పని చేశాడు. తమిళం వచ్చిన వారికి కాని ఆ ఉద్యోగం ఇవ్వరు. ఆ మహామేధావి పదిరోజులు తిరగకుండా తమిళం మాట్లాడం, చదవడం, వ్రాయడం నేర్చుకొని ఆ భాషలోనే విద్యార్థులకు పాఠాలు చెప్పగలిగాడు అరుణాచలంలో ఉండినప్పుడే ఆయన రెండేళ్ళలోపునే వేదాలను అభ్యసించి భాష్యాన్ని అవగతం చేసుకొన్నాడు.

గణపతిశాస్త్రికి పంద్రెండవ యేటనే వివాహం అయింది. ఆయనకు ఎంత పాండితీ ప్రాభవమూ కవితా నిదగ్ధ్యమూ ప్రాప్తించినా మొదటినుంచీ ఆయన మనస్సంతా తపోవిభూతిపైనే ఉండేది. ఆయన ఎన్నో క్షేత్రాలను దర్శించి ఎంతో కాలం తపస్సు చేశాడు. కోటి సంఖ్యలో మంత్ర జపం చేసిన ఆయనకు తుష్టి కలగలేదు. సిద్ధి కలిగినట్లు కనబడలేదు. తుదకు ఆయనకు అరుణాచలంలో రమణ మహర్షి వల్ల మహోపదేశం లభించింది. తపస్సు అనే శబ్దానికి మహర్షి చేసిన నిర్వచనం: "నేను నేను అనేది ఎక్కడి నుంచి వస్తూ ఉందో దానిని గురించి చింతన చేస్తే అది ఉద్భవించిన చోటనే లీనమై పోతుంది. అదే తపస్సు." గణపతిముని మహర్షికి శిష్యుడయ్యాడు.

గణపతిముని ఆ తరవాత చాలా చోట్ల జ్ఞాన ప్రచారం చేశాడు. ఆయన హైదరాబాద్–సికిందరాబాద్ నగరాలను కూడా సందర్శించి అనేక సభలలో ఉపన్యసించి చాలా మందికి ఉపదేశం చేశాడు.

ఆయన కొన్నాళ్ళు రాజకీయాలలో ఉండడం కూడా తటస్థించింది. 1923లో కాకినాడలో జరిగిన కాంగ్రెసు మహాసభకు హాజరై ఆయన స్త్రీల హక్కులను గురించీ, అస్పృశ్యతా నివారణను గురించీ ఉపన్యసించాడు వైదికధర్మ పరాయణుడైన ఆయన అస్పృశ్యతను ఖండిస్తే అందరికీ ఆశ్చర్యం కలిగింది. "ధర్మ తత్త్వం తెలుసుకోవాలంటే శాస్త్రాలను విమర్శనాత్మకంగా అధ్యయనం చేసి అవగాహనం చేసుకోవాలి. దేశ కాల భేదాల వల్ల

కలిగే సంప్రదాయాలనే పట్టుకొని వాటిని పాటించడమే ధర్మం అని అనుకోవడం పొరపాటు" అని ఆ మహా విద్వాంసుడు విశదం చేశాడు.

బాహ్యవేషాలూ, దొంగ సన్యాసులూ అంటే గణపతిమునికి కిట్టేది కాదు. హాస్యాస్పదాలైన అర్థరహిత సంప్రదాయాలను సంస్కరించుకోవాలని ఆయన ప్రబోధించారు. లింగ వర్ణ భేదం పాటించకుండా అందరికీ మంత్రార్హత ఉండాలని ప్రాచీన భారత వైభవాన్ని పునరుద్ధరించాలంటే, ఆనాటి ఋషుల తేజస్సూ, శక్తీ ఈనాడు భారతీయులలో ప్రవేశించాలంటే దేశమంతా మంత్రబలంతో స్పందించాలనీ ఆయన విశ్వసించాడు.

ఆయన తన గ్రామం కలువరాయలోనే జీవిత చరమ దశను గడపాలని అనుకున్నాడు. కాని ఆయన శిష్యులు ఆయనను ఖర్గపురం తీసుకొని వెళ్ళారు. ఆయన తపస్సు చేసుకొంటూ ధర్మబోధ చేస్తూ ఖర్గపురంలోనే 1936 జూలై 25వ తేదీని నిర్యాణం చెందాడు.

డాక్టర్ భోగరాజు పట్టాభి సీతారామయ్య

(జననం: నవంబరు 24, 1880)

పశ్చిమ గోదావరి జిల్లా గుండుగొలను గ్రామ కరణం భోగరాజు సుబ్రహ్మణ్యం శ్రీరామ పట్టాభిషేక మహోత్సవాలు జరిపిస్తూ ఉండేవాడు. ఆయన కుమారుడు పట్టాభి సీతారామయ్య పుట్టేటప్పటికి తండ్రిగారి శ్రీరామ మహోత్సవాలలో హరించి పోయిన



కర్పూరం లాగ ఆయన ఆస్తి కూడా కరిగిపోయింది. దానికితోడు పట్టాభి నాలుగోయేట తండ్రిగారు పరమపదించారు. పినతండ్రి ప్రతి నెలా ఇచ్చే ఏడురూపాయలే ఆధారం. దానిపై ఆధారపడిన వారు పట్టాభి తల్లీ, నలుగురు పిల్లలూ. తిండీ, బట్టకూ గడవని పరిస్థితి. పుస్తకాలు కొనడం అంటే గగన కుసుమాల కోసం యత్నించినటే. ఎరువు తెచ్చుకోవడం తప్ప వేరేగతిలేదు. బినా బాలుడు ఏకసంథాగ్రాహి. ఇలాంటి నికృష్ట పరిస్థితులను నిగ్రహించి పట్టాభి మెట్రిక్యులేషన్ పరీక్షలో ఉత్తమ శ్రేణిలో ఉత్తీర్ణుడయ్యాడు.

ఎంత కష్టమైనా ఉన్నదానితో కాలక్షేపం చేయడమే కాని ఒకరికి చెయ్యి చాచి దేహి అని అడిగని ఆత్మాభిమాని పట్టాభి ప్రతి పరీక్షలోనూ ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణుడై ప్రతి పోటీలోనూ నెగ్గి సంపాదించిన స్కాలర్‌షిప్పులతోనూ, బహుమతులతోనూ బి.ఏ. వరకూ నెట్టుకొని వచ్చాడు.

చదువుకొనే రోజుల్లో సహాయం కోసం ఒకరికి చెయ్యి చాచనట్లే ఆయన తన రాజకీయ జీవితంలో కూడా పదవుల కోసమూ అధికారం కోసమూ ఎవరికీ సలాములు చేసి పందిగీరాలు పాడి మాగధ స్తోత్రాలు చేయలేదు. 1937లో మదరాసు ప్రభుత్వంలో మంత్రిగా చేరవలసినదని రాజాజీ చేసిన అభ్యర్థనను ఆయన నిరాకరించాడు. ఆయన నిర్వహించిన పదవులు రెండే రెండు. డబ్బైయొకటిలో అడుగుపెట్టేముందు కాంగ్రెసు అధ్యక్ష పదవీ, డబ్బైయొకటిలో పడిన తరువాత మధ్యప్రదేశ్ గవర్నరు పదవి.

తన ఆశయాలకూ విశ్వాసాలకూ భంగం కలిగేలాగా సమాధానపడే తత్త్వంకాదు ఆయనది. అవసరమైతే అనీబెసెంట్, పటేల్, నెహ్రూ వంటి ఉద్దండులతో తలపడే సాహసమూ, వాదించి ఔననిపించుకోగల సామర్థ్యమూ ఆయనకు ఉండేవి. ఆయన ఆయుధాలు అరుపులూ, ఆవేశమూ కావు. వాస్తవికాంశాలనూ, గణాంకాలనూ కుప్పించి హేతు బద్ధంగా తర్కించి ఎదుటివానిని చిత్తు చేయగల ధీరవిత్తు వాడాయన.

ఉపన్యాసాలు దంచడం, ఊరేగింపులు జరిపించుకోవడం, సభలలో మాలలు వేయించుకోవడం ఆయనకు గిట్టవు. ఆయన ఒక హిందీ సూక్తిని గాంధీజీ మెచ్చుకొని దానిని అట్టమీద వ్రాయించి ఆశ్రమంలో వేలాడ దీయించాడట. ఆ సూక్తి, జో కుఛ్ కహనా హై తో హాథ్ సే కహో. చెప్పదలచుకున్నది చేతితో చెప్పు—అని అర్థం. వాక్శూరత్వం కాదు కార్యశూరత్వం ఉండాలి. అన్నమాటా


గాంధీజీ సిద్ధాంతాలను మనసారా నమ్మి తు చ తప్పకుండా పాటించినవ్యక్తి డాక్టర్ పట్టాభి. గాలివాటులాగ గడియకొక వైపునకు తిరిగే అస్థిరుడుకాడాయన. చివరివరకూ ఆయన గాంధీజీకి అచ్చమైన శిష్యుడిగానే ప్రవర్తించాడు. రాజకీయ ఆందోళన పట్లకంటె నిర్మాణ కార్యక్రమం పట్లనే ఆయనకు మక్కువ ఎక్కువ.

డాక్టర్ పట్టాభి బహుముఖ ప్రజ్ఞాశాలి. ఆయన వృత్తి వైద్యమైనా ఆయనకు తెలిసిన విషయాలు అనేకం. ఆయన నేర్చిన ప్రతి ఒక విషయమూ కూలంకషంగా నేర్చేవాడు. అసాధ్యమైన ఆశయాల ఆకాశంలో విహరించేవాడుకాడాయన. ఆయన లోకజ్ఞానం గల ఆచరణవాది. ప్రయోజనకరమైన ఎన్నో సంస్థలను స్థాపించిన ప్రతిభాశాలి ఆయన. బందరు జాతీయ కళాశాల, అఖిల భారత చరఖా సంఘం ఆంధ్రశాఖ ఆయన కృషి ఫలితమే. తెలుగు

దేశంలోని ఆంధ్ర ఇన్స్యూరెన్స్ కంపెనీ, ఆంధ్రబ్యాంకు కూడా ఆయన సృష్టియే ఈ బ్యాంకు ప్రస్తుతం ప్రైవేటు రంగంలోని బ్యాంకు అన్నిటిలోకీ పెద్దదిగా వృద్ధిపొందింది

ఆంధ్రోద్యమానికి దోహదం చేసిన ప్రాజ్ఞుడు పట్టాభి. దేశంలో మూడవ భాగం విస్తీర్ణం కలిగి ఉండి జనాభాలో నాల్గవ వంతు పంచుకున్న స్వదేశ సంస్థానాల ప్రజల అధోగతిని గురించి పట్టించుకునే నాథుడు లేని రోజులలో ఆ దీనులకోసం అవిరామంగా కృషిచేసిన మాన్యుడు పట్టాభి ఆయన కాంగ్రెసు చరిత్రకారుడు అన్నిటిని మించి ఆయన గాంధీ సిద్ధాంత వ్యాఖ్యాత అంతకు మించి ఆయన గాంధీ సిద్ధాంతాలలో అచంచలమైన విశ్వాసంగల గాంధీ అనుయాయి

అవసరాన్ని బట్టి మార్పు చెందని మనిషిగా, నీతి పథంలో నడమ త్రిప్పని మానవునిగా జీవించి డాక్టర్ పట్టాభి హైదరాబాదులో 1959 డిసెంబరు 17 వ తేదీని పరమపదించాడు



యెహూది మెనూహిన్

జో అచ్యుతానంద జో జో ముకుంద
లాలి పరమానంద రామ గోవింద

అని అమ్మ కమ్మగా పాడుతూ ఉంచే ఏడుస్తున్న బిడ్డ నిద్ర పోతుంది గొల్ల పిల్లడు పిల్లన గ్రోవి ఊదుతూ ఉంటే మోరలెత్తి పశువులు పరవశత్వం పొందుతాయి పాములవాడు నాగస్వరం పాడుతూ ఉంచే చుట్ట చుట్టుకొని ఉన్న పాము చట్టున నిలువుగా లేచి పడగ విప్పి ఆడుతుంది పశువులనూ, పక్షులనూ మానవులనూ పరవశత్వం పొందించగల శక్తి నాదానికి ఉంది. నాదానుభూతిని పొంది ఈశ్వరానుభూతిని సాధించిన పూర్వులు మన త్యాగరాజాదులు.

ఈనాడు తన వాయులీన వాద్య వైభవంతో వివిధ దేశ ప్రజలకు ఆనందానుభూతిని కలిగించి అంతర్జాతీయ సద్భావాన్ని సమాహితం చేస్తున్న ప్రతిభాశాలి యెహూది మెనూహిన్

ఈయన న్యూయార్కు నగరంలో 1916 ఏప్రిల్ 22 వ తేదీన జన్మించాడు. ఆయనకు సంగీతం జన్మతః వచ్చింది. నాల్గవ యేటనే సంగీత విద్యాభ్యాసం మొదలు పెట్టాడు తొమ్మిదవ యేటనే సంగీత కచ్చేరీ చేశాడు. 1935 లో ప్రపంచంలోని వివిధ దేశాలలో పర్యటించి అనేక నగరాలలో 110 గాన సభలు చేశాడు. ఇరవై ఏళ్లు నిండకుండానే ఇంతటి కళా ప్రాభవాన్ని ప్రదర్శించాడు సహజ సిద్ధమైన ప్రతిభను మరింత ప్రకాశవంతం చేయడానికి రెండేళ్లపాటు ఇంటిపట్టున ఉండి సాధన చేశాడు

ఆ తరువాత మెక్సికోలో, మధ్య అమెరికాలో, కరిబియన్ సముద్ర ద్వీపాలలో, దక్షిణ అమెరికాలో సౌహార్ద్ర పర్యటన చేశాడు రెండవ ప్రపంచ యుద్ధ కాలంలో మిత్ర రాజ్యాల సైనికుల వినోదం కోసం ఎన్నో సంగీత కచ్చేరీలు చేశాడు అనేక సంక్షేమసంస్థల సహాయార్థం ఉచితంగా కచ్చేరీలు చేశాడు నాజీల అత్యాచారాలకు గురి ఐన వారి సంక్షేమానికీ, వివిధ దేశాల శరణార్థుల సహాయానికీ లక్షల డాలర్లను విరాళంగా ఇచ్చాడు

మెనూహిన్ భారతదేశానికి పరమ మిత్రుడు ఆయనకు భారత సంస్కృతి పట్ల అపారమైన గౌరవం, ఆయన ఉదాత్త భావ సంపన్నుడు. భౌతిక సంపదకు కాని, ఆధ్యాత్మిక సంపదకు కాని మానవుడు సొంతగాడు కాదు పోషకుడు, సంరక్షకుడు మాత్రమే అంటాడు ఆయన దీనిని బట్టి ఆయనలో భారతీయ తత్త్వం ఎంత ప్రబలంగా ఉందో బోధపడుతుంది.

ఆయన ప్రతిభా ప్రాభవానికి ప్రశంసా చిహ్నంగా ప్రపంచంలో అనేక విశ్వవిద్యాలయాలు, వివిధ ప్రభుత్వాలు గౌరవ బిరుదాలను ప్రదానం చేసి సత్కరించాయి భారతదేశం కూడా ఆయన అసాధారణ వ్యక్తిత్వాన్ని, మహత్తరమైన సేవా పరాయణత్వాన్ని గుర్తించి అంతర్జాతీయ అవగాహనాన్ని పెంపొందించినందుకు ఆయనకు ఈ సంవత్సరం జవహర్‌లాల్‌నెహ్రూ బహుమానాన్ని ప్రదానం చేసింది

ముక్కు పచ్చలారని పసితనంలోనే సహజ సంగీత ప్రజ్ఞను ప్రదర్శించి చిన్నారి పొన్నారి చిరుత ప్రాయంలోనే కొమ్ములు తిరిగిన సంగీత కోవిదుల కోవలో చేరి ప్రపంచ సంగీత చరిత్రలో శాశ్వత స్థానాన్ని సంపాదించుకొని తన కళా కౌశలాన్ని మానవ మానసిక ఔన్నత్యానికీ. విశ్వ మానవ సౌభాగ్యానికీ అంకితం చేసిన మేధావి, మహనీయుడు యెహూది మెనూహిన్

—కల్యాణ సింగ్




రాష్ట్ర గవర్నరు శ్రీ ఖండూభాయ్ దేశాయ్ సెప్టెంబరు 5 న జూబ్లీహాలులో ఉపాధ్యాయుల దినోత్సవాలకు అధ్యక్షత వహించారు.




రాష్ట్ర గవర్నరు శ్రీ ఖండూభాయ్ దేశాయ్ సెప్టెంబరు 7 1971; జనాభా లెక్కల సేకరణకు సంబంధించిన శిక్షణ కార్యక్రమాన్ని జూబ్లి హాలులో ప్రారంభించారు.

నగరంలో




భారత దేశంలో ఇంగ్లాండు హైకమీషనర్ సర్ మోరిస్ జేమ్స్ సెప్టెంబరు 8 న రాష్ట్ర గవర్నరును కలుసుకున్నారు.



మారిషస్ మంత్రి ఆగస్టు 28 న హైదరాబాదు వచ్చినపుడు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, తదితరులు స్వాగతం పలికారు.




ఆగస్టు 15 న ఆరోగ్య వైద్య శాఖా మంత్రి 11 వ ఆంధ్రప్రదేశ్
సంక్షేమ రాఫిల్ డ్రా తీశారు.




ఎలక్ట్రిక్ కన్‌స్ట్రక్షన్ అండ్ ఎక్విప్‌మెంట్ కంపెనీ



రజతోత్సవాలు ఆగస్టు 29 న జరిగాయి.



పౌర రక్షణ అత్యవసర సహాయ శిక్షణ సంస్థను హోంమంత్రి
ఆగస్టు 29 న సందర్శించారు.



సెప్టెంబరు 9 న సహకారసంఘాల రిజిస్ట్రారుచే "సహకార సంఘాల
అనుబంధ విషయాలు" గ్రంథావిష్కరణ (రచన: పి. శేషాద్రి)



రాష్ట్ర సమాచార కేంద్రంలో
ఆగస్టు 13 న బాలల చిత్రలేఖన పోటీ జరిగింది.

హంపయ్య

చెంకూరి రంగయ్య నాయుడు

అలనాడు భారతమాత దాస్యశృంఖలాల భారంతో కృంగిపోయి విముక్తి కోసం దుంపిల్లుతున్న సమయం. భరతఖండం తెల్లజాతివారి ఇనుప బోనులో రగులు కొన్నది. భారతీయ వైభవం మంట గలసి పోయింది భారత వీరుల కత్తి పదనుల కీర్తి మాయమై పోయింది.

ఆంగ్లేయుల చేతినీడలో గుత్తికోటను ఏలుతున్నాడు మురారి రాజు. పరపాలనను చీదరించు కొనే గుత్తి, స్వాతంత్ర్యాన్ని వాంఛించే గుత్తి! ప్రాణానికి వెనుదీయని శౌర్య నిధులను గన్న గుత్తి-తలవాల్చక తప్పలేదు.

దొరలు రాబోతున్నారంటూ హఠాత్తుగా వచ్చిన వార్తకు ఊరంతా అట్టుడికినట్లుడికి పోయింది. దొరలు వస్తే తమ బాగోగులు విచారించి, కష్టాలు తీరుతాయన్న సంబరం లేక పోగా వారి హృదయాలను ఏదో భయం ఆవహించింది. స్త్రీలు వాకిళ్ళు మూసి అదురుతున్న గుండెలను అరచేతులతో కప్పుకొని శ్వాస పీల్చ కోడానికి గూడా హడలి పోతున్నారు. ఈ రోజు కూలి గింజలకు కూడ నోచుకోలేదని నిరుపేదలు, కాపు పడతులు చింతించారు.

ప్రజ లనుకొన్నట్లు గానే దొరల పరివారం వచ్చి ఊరి బయట నిలబడింది. వనితలు తలుపులు బిడాయించు కొన్నారు. కరణాలు. రెడ్లు మొదలైన పెద్దలు దొరలకు స్వాగతమివ్వడానికి బయలు దేరారు.

హనుమప్పకు కూటికి ఠక్కువైనా గుణానికిలోటు లేదు. కంటిలో నీరు పెట్టుకొంటున్న భార్యకు ధైర్యం చెప్పి, ఆకు దోటకు బయల్దేరాడు. తోటలోని చెట్లన్నిటినీ నీళ్ళతో తడిపి కొద్దిసేపు నిద్రకుపక్రమించాడు.

హంపయ్యకు హఠాత్తుగా మెలకువ వచ్చింది. ఎవరివో స్త్రీల దీనాలాపనలు విన వచ్చాయ్. లేచి కూర్చున్నాడు.

ఇద్దరు వనితలు భీతహరిణల్లా పరుగెత్తుకుంటూ వస్తున్నారు.

స్త్రీలు : హంపయ్యా! రక్షించు ... మమ్మల్ని రక్షించు హంపయ్యా. మమ్మల్ని బలవంతం చేస్తూ ఇద్దరు దొరలు మా వెంట బడుతున్నారు. మా మానం కాపాడు హంపయ్యా!

హంపయ్య : ఊఁ ... దొరలా! (రౌద్రంతో) దొరలుకాదు. దైవమైనా సరే. స్త్రీలను చెఱపబూనిన పొగరు బోతుల విడువను. చర్మం ఒలుస్తాను. రక్తం త్రాగుతాను—సరే మీరు వెళ్ళి లోపల తల దాచు కోండి.

స్త్రీలు : అలాగే హంపయ్యా (లోపల చెట్ల చాటున దాక్కొంటారు)

దొరలు . (ఆతుర్తతో హంపయ్యతో) ఇద్దరు స్త్రీలు ఈ వైపుగా పరుగెత్తుక వచ్చారు. తోట లోపలి కేమైనా వెళ్ళారా?...ఏయ్...నిన్నే. సమాధానం చెప్పు.

హంపయ్య: హూ ... వెళ్ళారు ... మీ గొంతుకు గొళ్ళెం తగిలించమని చెప్పి మరీ వెళ్ళారు,

దొరలు : ఏయ్...ఏమిటా వాగుడు... ఈ తోటలోపలికి స్త్రీలెవరైనా వెళ్ళారా? (హంపయ్య క్రోధంతో మాట పెగలక అల్లాగే చూస్తుంటాడు). సరే... ఇక వీణ్ణడిగి ప్రయోజనం లేదోయ్...రా... మనం పోదాం. (అంటూ ముందుకు పోబోతారు)

హంపయ్య : ఒరేయ్! పొగరు బోతుల్లారా! ఆగండి! నా బొందిలో ప్రాణముండగా మీ దౌష్ట్యం కొనసాగ నీయను. స్త్రీలను చెఱప బూనిన మీ రక్తం త్రాగుతాను. (అంటూ ఒకని పైకి లంఘించి జుట్టు పట్టుకొని ఇవతలకు లాగి పడేస్తాడు)

రెండవవాడు : ఏయ్...ఏయ్... అటన్ని వదులు... లేదా.

హంపయ్య : లేదా...

రెండవవాడు : లేదా... (మొలనుండి పిస్తోలు తీస్తాడు.) నేటితో నీ ఆయువు అంతమై పోతుంది.

హంపయ్య : ఆ! నా అంతం చూస్తావటరా దౌష్ట్యుడా! రా! కామాంధులారా! మీ రక్తంతో భారత మాతకు తర్పణం వదుల్తా!

రెండవవాడు : అడుగు ముందుకు వేశావో...ఏయ్...ఆగు...నీకే చెప్తున్నా...
(హంపయ్య వినకుండా ముందుకు నడుస్తాడు. ఆకిరాతకుడు నిర్దాక్షిణ్యంగా పిస్తోలు ప్రేలుస్తాడు).

హంపయ్య : (వక్షస్థలం నుండి రుధిరం కారుతుండగా). కిరాతకుల్లారా! పవిత్ర భారతావనిని అపవిత్రం చేయడానికొచ్చి అన్యాయాన్ని నలుమూలలా వ్యాపింపజేస్తున్నారా! మీ అరాచకాన్ని అరికట్టడానికి నా ప్రతి రక్తపు బిందువు వీర భారతీయుడై జన్మించి...
మీ...అంతం ... చూస్తాయ ... ఆ...(మూలుగుతూ నేలపై ఒరిగి పోతాడు)

దొరలు : హ్హా...హ్హా హ్హా... చచ్చాడు. మన రక్తాన్ని చవిచూచే వెధవ తన రక్తాన్నే ధారపోసుకొన్నాడు... హూ...రావోయ్! పోదాం. (కర్కశంగా నవ్వుకుంటూ వెళ్తారు.)

స్త్రీలు : (బయటకు పరుగెత్తు కొంటూవచ్చి) హంపయ్యా! అయ్యో! హంపయ్యా! మాకోసం...పవిత్ర భారతావనిలో ధర్మ సంస్థాపనార్థం...నీ పవిత్రాత్మను ఆహుతి జేసికొన్నావా! అయ్యో! ఆంధ్రవీరుడా! హంపయ్యా! ... అటు చూడు–హంపయ్యా! అటు చూడు! ఒక్క ఆంధ్రవీరుడు కొఱత వడిన కారణంగా ఆంధ్ర జనని చీరకొంగు ఎలా అశ్రుప్లావిత మౌతోందో! అయ్యో ... ఆంధ్రవీరుడా! హంపయ్యా! తెల్ల జాతి ఘాతుక చర్యల నరికట్టడంతో అఖిల భారత ప్రజానీకానికి ఆదర్శ పురుషుడవనిపించుకొన్నావ్. హంపయ్యా! నీ చరితంబు అమరంబగు గాక...నీ... చరితంబు అమరంబగు గాక !

గిరిజన బాలురకు పౌష్టిక ఆహారం

తూర్పు గోదావరి జిల్లా, అడ్డతీగల గిరిజన పంచాయతీ సమితిలో యీ సంవత్సరంనుండి, మూడు సంవత్సరాలూ, అంతకు తక్కువ వయస్సుగల గిరిజన బాల బాలికల నిమిత్తం పౌష్టిక ఆహార తీవ్రతర పథకాన్ని అమలు జరుపుతున్నారు. వార్షికంగా రు. 50,000 ల ఖర్చుతో సమితిలో 16 కేంద్రాలను ప్రారంభించాలని ప్రతిపాదించారు. ఈ కేంద్రాలలో తయారైన పౌష్టిక ఆహారాన్ని గిరిజన బాల బాలికలకు పంపిణీచేస్తారు.

సమితిలో గిరిజన బాల బాలికల నిమిత్తం 3 నుండి 6 సంవత్సరాల బాల బాలికలకు 8 బాలవాడీ పాఠశాలలను నిర్వహిస్తున్నారు. ఈ పాఠశాలలలో పిల్లలకు పుష్టికరమైన ఉప ఆహారం యిస్తూ విద్య నేర్పుతున్నారు. ప్రతి బాలవాడీలో 30 నుండి 35 మంది పిల్లలను చేర్చుకున్నారు.

సమితిలో 4 ఆశ్రమ పాఠశాలలు ఉన్నాయి. వాటిలో 6 నుండి 14 సంవత్సరాల మధ్య వయస్సుగల 80 పిల్లలు విద్య అభ్యసిస్తున్నారు. వారికి ఆహారం, వసతి, దుస్తులు, పుస్తకాలు అధికంగా యివ్వబడుతున్నాయి. 1969–70 లో ఎలిమెంటరీ విద్యా కార్యక్రమం క్రింద యీ నాలుగు పాఠశాలల నిర్వహణకు రు. 34,000 లు ఖర్చు చేశారు.

సమితిలో 4 ఎలిమెంటరీ పాఠశాలలలో 145 మంది పిల్లలకు నాలుగు మధ్యాహ్న భోజన కేంద్రాలను నిర్వహిస్తున్నారు. రు. 5448 ల ఖర్చుతో వారికి ఆహారం, పుస్తకాలు ఉచితంగా యిస్తున్నారు.

సమితిలో ఎలిమెంటరీ, సెకండరీ పాఠశాలల గిరిజన విద్యార్థుల నిమిత్తం బాలల వసతి గృహం నిర్వహించబడుతున్నది. దానిలో 100 మంది గిరిజన బాలురు ఉన్నారు. దీనికై వార్షికంగా రు. 10,000 లు ఖర్చుచేస్తున్నారు. సమితిలో గిరిజన బాలికల నిమిత్తం బాలికల హాస్టల్ ఉంది. దానిలో 60 మంది బాలికలను చేర్చుకున్నారు. అడ్డతీగలలో రు. 20,000 ల ఖర్చుతో క్రొత్తగా వసతి గృహం పక్కా భవనం నిర్మిస్తున్నారు.

సమితిలో 1969–70 లో గిరిజనులు, యితర బాల బాలికల నిమిత్తం 78 కేర్ పోషణ కేంద్రాలు ఉన్నాయి. తద్వారా 2350 మందికి లాభిస్తున్నది. 1969–70 లో రు. 9,873 ల విలువచేసే పుస్తకాలు, పలకలు, దుస్తులు, మొదలైన వాటిని ఎలిమెంటరీ పాఠశాలలలోని గిరిజన బాల బాలికలకు ఉచితంగా పంపిణీచేశారు.

మెదక్ జిల్లాలో కొత్త పరిశ్రమలకు అవకాశాలు

అవిశనూనె తయారీ

జిల్లాలో అవిశ గింజలు ఎక్కువ మొత్తంలో లభిస్తాయి. వాటి ద్వారా శుద్ధిచేసిన అవిశ నూనెను యిక్కడ తయారు చేయవచ్చు. దానిని పెయింట్స్, వార్నిష్ పరిశ్రమలలో విరివిగా ఉపయోగిస్తారు. శుద్ధి చేసిన అవిశ నూనెను తయారు చేసే యూనిట్లు జిల్లాలో లేవు. ఈ నూనెను ఎగుమతి కూడ చేయవచ్చు. జిల్లాలో ఒక యూనిటును నెలకొల్పడానికి అవకాశాలు ఉన్నాయి.

పండ్లు, కూరగాయలను భద్రపర్చడం


మెదక్ జిల్లాలో అనేక రకాల పండ్లు, కూరగాయలు లభిస్తాయి. రాష్ట్రంలో భద్రపరచిన పండ్లు, కూరగాయలకు ఎక్కువ డిమాండు ఉంది. ఇటువంటి వస్తువులకు రాష్ట్రం వెలుపలి ప్రాంతాల ఉత్పత్తిదార్ల నుండి పోటీ ఉంటుంది. వనరులు లభిస్తున్న దృష్ట్యా యీ జిల్లాలో ఒక యూనిటును నెలకొల్పవచ్చు.

ఉల్లిగడ్డ పొడి (వెల్లుల్లి)

ఉల్లి గడ్డ చాల రుచికరమైన పదార్థం. అందువల్ల దీనిని ఆహార పదార్థాల తయారీలో ఎక్కువ ఉపయోగిస్తారు. 1960-61లో జిల్లాలో 590 టన్నుల ఉల్లి గడ్డ ఉత్పత్తి అయింది. ఇక్కడ లభించే ఉల్లి గడ్డను పొడిగా మార్చవచ్చు. వంట పదార్థాలకే గాక మందుల తయారీకి కూడా ఉల్లిగడ్డ డిమాండు ఉంది. కేంద్ర ఆహార సాంకేతిక పరిశోధనా సంస్థలో ఉల్లిగడ్డకు పొడితయారీలో నూతన విధానాలను కనుగొన్నారు. జిల్లాలో ఉల్లిగడ్డ పొడి తయారీలో యీ విధానాలను అనుసరించ వచ్చును.

శుద్ధిచేసిన ఆముదం నూనె

జిల్లాలో ఆముదం గింజలు అధికంగానే ఉత్పత్తి అవుతాయి. వాటిని శుద్ధి చేసిన నూనెగా మార్చవచ్చును. శుద్ధి చేసిన ఆముదం నూనె అనేక విధాలుగా ఉపయోగింపబడుతుంది. ఆముదం నూనెకు విదేశాలలో మంచి గిరాకీ ఉంది. రాష్ట్రంలో శుద్ధి చేసిన ఆముదం నూనె తయారీ యూనిట్లు చాలా కొద్దిగా ఉన్నాయి. శుద్ధి చేసిన ఆముదం నూనె తయారీ పరిశ్రమకు మంచి అవకాశాలుఉన్నందున ఒక యూనిటును యీ జిల్లాలో నెలకొల్పవచ్చు.



చర్మకార వస్తువుల పరిశ్రమ

జిల్లాలో ప్రస్తుతం ఉన్న ఒక యూనిటులోను, కుటీర పరిశ్రమల స్థానలలోను తోళ్లను శుభ్రం చేయడం జరుగుతున్నది. శుద్ధి చేసిన మెరుపుగల తోళ్లకు మంచి గిరాకీ ఉంది. ఆంధ్రప్రదేశ్‌లో 1966లో రూ.1.65 లక్షల విలువగల యిటువంటి రకం తోళ్లకు డిమాండు ఉంది. ఈ రకం తోళ్లను తయారు చేసే యూనిట్లు రాష్ట్రంలో లేవు. జిల్లాలో ఒక యూనిటును నెలకొల్పవచ్చు.

శుద్ధి చేసిన కుసుమ నూనె

జిల్లాలో 1960-61లో 2,630 టన్నుల కుసుమ విత్తులు ఉత్పత్తి అయినాయి. శుద్ధి చేసిన కుసుమనూనె తయారీకి వాటిని వాడవచ్చు. హైదరాబాదు మార్కెటులో వార్షికంగా రు. 0.5 లక్షల విలువ గల కుసుమనూనె విక్రయింపబడుతున్నది. వచ్చే కొద్ది సంవత్సరాలలో యీ నూనెకు "గిరాకీ" యింకా పెరుగవచ్చును. రాష్ట్రంలో ప్రస్తుతం శుద్ధిచేసిన కుసుమనూనెను తయారు చేయడం

లేదు. జిల్లాలో పసుపు గింజల్ని గానుగ ఆడడానికి, శుద్ధి చేసిన నూనె తయారీకి ఒక యూనిటును నెలకొల్పవచ్చు.

ఎముకల పొడి

చంపబడిన, మృతి చెందిన జంతువుల ఎముకలను యెండ బెట్టి క్రష్ చేసి ఎముకల పొడి తయారు చేయవచ్చు. మెదకు జిల్లాలో ఎముకల పొడి తయారు చేసే యూనిట్లు లేవు. ఎముకల పొడిని ఎరువుగా ఉపయోగించవచ్చు. ఎరువుల మిశ్రమాల తయారీలో కూడా ఉపయోగిస్తారు. ఎముకల పొడిని విదేశాలకు ఎగుమతి చేయవచ్చు. ఈ ప్రాంతంలో ముడిసరుకు లభిస్తున్న దృష్ట్యాను, ఎముకల పొడికి గిరాకీ ఉన్న దృష్ట్యాను జిల్లాలో యీ పరిశ్రమను నెలకొల్పవచ్చు.

కారం పొడి

మెదకు జిల్లాలో మిర్చి హెచ్చుగా లభిస్తుంది. మిర్చికిబదులుగా మిర్చిపొడి వాడకం ఎక్కువ అవుతుంది. మిర్చిపొడి వంట కాలంలో అధికంగా ఉపయోగిస్తారు. దీనికి గిరాకీ బాగా ఉంది. రాష్ట్రంలో మిర్చి పొడిని తయారు చేసే పరిశ్రమ దారులు చాలా తక్కువ మంది ఉన్నారు. జిల్లాలో ఒక యూనిటును నెలకొల్పవచ్చు.

వాహనాల తుత్తనాగపు బోలుల తయారీ

మెదకు, హైదరాబాదు జిల్లాల సరిహద్దులలో ఉన్న లింగంపల్లిలో వాహనాల బోల్టులు, నట్లులు, వాషర్‌లు అవసరమైన పెద్ద తరహా పరిశ్రమ ఉంది. 1965లో రు. 5.4 లక్షల విలువ చేసే యీవస్తువులను ఉపయోగించారు. ఇక్కడికి పెద్దతరహా పరిశ్రమలకు యీ వస్తువుల అవసరం ఎక్కువగా ఉన్న దృష్ట్యా, యీ పరికరాలను తయారు చేసే యూనిటును నెలకొల్పడానికి ముందు పెద్ద తరహా పరిశ్రమలతో కాంట్రాక్టు చేసుకోవాలి. జిల్లాలో ఒక యూనిటును నెలకొల్పవచ్చు

చిత్తూరు జిల్లాలో కొత్త పరిశ్రమలకు అవకాశాలు

(గతసంచిక తరువాయి)

పలకలు

1. 1957–58లో సుమారు రూ. 50,000 విలువగల పలకలకు గిరాకీ వుంది. మద్రాసు, మైసూరు, కేరళ నుంచి చెప్పుకోదగినంత గిరాకీవుంది.

2. ఈ పలకల గిరాకీ ఏటా 15 శాతం పెరుగుతోందని అంచనా.

3. ఇతర ప్రాంతాలనుంచి పలకలకు గిరాకీవున్న దృష్ట్యానూ నిపుణులైన పనివారు లభ్యం అవుతున్న దృష్ట్యానూ యీ ప్రాంతంలో కొత్త యూనిట్లను నెలకొల్పడానికి అవకాశం వుంది.

సిరా తయారీ

1957–58లో యీ జిల్లాలో సుమారు రూ. 31,000ల విలువ చేసే సిరాకు గిరాకీవుంది.

గడచిన కొన్నేళ్ళుగా సిరా అమ్మకాల్ని చూస్తుంటే దీనికి రోజురోజుకీ గిరాకీ పెరుగుతున్నదని తెలుస్తుంది. కొత్తగా అనేక పాఠశాలలు, కళాశాలలు ప్రారంభించబడడంతో యీ గిరాకీ మరింతగా పెరిగే అవకాశం వుంది.

ప్రస్తుతం యీ జిల్లా అవసరాలను యిక్కడి సిరా ఉత్పత్తియూనిట్లు తీర్చలేకపోతున్నాయి

ఫౌంటెన్ పెన్‌లలో వేసుకునే సిరాలను, కలంపుల్ల సిరాలను, ఇంక్ పేడ్‌లలోవాడే సిరాలను తయారుచేసే లఘు పరిశ్రమల యూనిటును ఒకదానిని యీ జిల్లాలో నెలకొల్పుకోవచ్చు. ఇందుకు చిత్తూరు గాని, తిరుపతిగాని తగిన ప్రదేశం.

కాగితం సంచులు, కవర్లు

కాఫీ పౌడరు, పిప్పరమెట్లు, రెడీమేడ్ వస్త్రాలు, బిస్కట్లు మొదలైన వినియోగదారుల వస్తువులను పేకింగ్ చేయడానికి వివిధ సైజుల్లో కాగితం సంచులు అవుసరమవుతాయి. ప్రభుత్వ సంస్థలకు, ప్రయివేటు సంస్థలకు కవర్లు విరివిగా అవసరమౌతాయి.

వీటిని ఆటోమేటిక్ యంత్రాలద్వారా తయారు చేయవచ్చు. లేదా కావలసిన సైజుల్లో కత్తిరించి, క్రీజింగుచేసి మడతలు పెట్టి, అంటించి కూడా తయారుచేయవచ్చు.

వీటిని తయారు చేయడానికి ఒకటో, రెండో యూనిట్లను యీ జిల్లాలో నెలకొల్పవచ్చు.

పెయింట్లు, వార్నిషులు

వీటిని తయారుచేసే యూనిటు ఒకటి కూడా యీ జిల్లాలోలేదు. ఇవి చాలావరకు విజయవాడ నుంచీ, మద్రాసునుంచీ, దిగుమతి చేసుకోవడం జరుగుతున్నది.

వీటిని తయారు చేయడానికి కావలసిన ముడి సరకు చిత్తూరు జిల్లాలోనూ, దాని పరిసరాలలోనూ కొంతవరకు లభిస్తాయి.

వీటిని తయారుచేసే ఒక యూనిటును యిక్కడ నెలకొల్పుకోవచ్చు.

హోల్డాల్‌లు వాటర్‌ప్రూఫ్ సంచులు

తిరుపతిని సందర్శించడానికి అసంఖ్యాకంగా యాత్రికులు వస్తుండడంవల్ల నీటితడి యింకని గుడ్డలతో చేసే సంచులకు యిక్కడ గిరాకీ వుంది.

దక్షిణాదిలో హోల్డాల్‌లకు, వాటర్ ప్రూఫ్‌ల సంచులకు ఏటా 50 శాతం చొప్పున గిరాకీ పెరుగుతోంది.

వీటిని తయారుచేసే యూనిటు చిత్తూరు జిల్లాలో ఒకటైనా లేదు.

వీటిని తయారుచేయడంలో పెద్దగా నైపుణ్యం కూడా అక్కరలేదు. పెట్టుబడి కూడా తక్కువే.

ఖండసారి చక్కెర

1955_56లో 56,000 టన్నుల చెరకు గెడ ఉత్పత్తి అయ్యింది.

ఖండసారి చక్కెరను చెరకుగెడ నుంచి తయారు చేయవచ్చు.

ఖండసారి చక్కెరను తయారుచేయడానికి వాడే పరికరాల్ని యిప్పుడు మనదగ్గరే తయారు చేస్తున్నారు.

కొత్త యూనిట్లను ప్రారంభించే వారికి లక్నోలోని భారతీయ చెరకు పరిశోధనా సంస్థ వారు సాంకేతిక సహాయాన్ని అందజేస్తారు.

ఈ జిల్లాలో ఖండసారి చక్కెరను ఉత్పత్తిచేసే యూనిట్లు కొన్ని కొత్తవాటిని యిక్కడ నెలకొల్పవచ్చు.

తోలుశుద్ధి పదును

శుద్ధిచేసి, పదును పెట్టిన చర్మాలను తయారుచేసే యూనిట్లు ఏవీ యీ జిల్లాలో లేవు.

ఈ జిల్లాలో గొర్రెతోలు శుద్ధియూనిట్లు రెండే రెండు వున్నాయి.

శుద్ధిచేసిన తోళ్ళను పదును పెట్టడానికి, తోలువస్తువులను తయారు చేయడానికి వీలుగా చర్మాన్ని బాగుచేయడానికి ఒక యూనిటును యిక్కడ నెలకొల్పవచ్చు.

పాదరక్షలు

తోలుతో చేసిన పాదరక్షల్ని తయారుచేసే క్రమబద్ధమైన యూనిటు యీ జిల్లాలోలేదు.

ఇక్కడ ఏటా రూ. 3,50,000లు విలువచేసే పాదరక్షలకు గిరాకీ వుంది.

ఈజిల్లాలోఏటా రూ. 75,000లు విలువచేసే పాదరక్షలు మాత్రమే తయారవుతాయి.

వ్యవస్థా పరమైనపద్ధతిలో ఒకయూనిటును నెలకొల్పవచ్చు.

తీగమేకులు

దక్షిణాది అంతటా తీగమేకులకు మంచి గిరాకీ వుంది.

పేకింగ్ పెట్టెలు మొదలైన వాటికి తీగమేకులు అవసరమౌతాయి. చిత్తూరు జిల్లాలో పలకలను నునుపు చేసిన నల్లరాయిని ఎగుమతి చేసేటప్పుడు యీ చెక్కపెట్టెలలో పెట్టి పంపిస్తుంటారు.

ఈ జిల్లాలో తీగమేకుల్ని తయారుచేసే యూనిటు ఒక్కటీ లేకపోవడం వల్ల యితర ప్రాంతాలనుంచి దిగుమతి చేసుకోవడం జరుగుతోంది.

తిరుపతిలోగాని, చిత్తూరులోగాని ఒక యూనిటును నెలకొల్పవచ్చు.

గొడుగుల తయారీ

చిత్తూరు జిల్లాలో ఏటా రూ. 25,000ల విలువ చేసే గొడుగులు అమ్ముడవుతున్నాయి.

ఇప్పుడు ఈ జిల్లా అవసరాలకి కావలసిన గొడుగుల్ని మద్రాసునుంచి దిగుమతి చేసుకుంటున్నారు.

గొడుగులకు ఏటా 13 శాతం చొప్పున గిరాకీ పెరుగుతున్నట్టు అంచనా.

ఈ పని చెయ్యడంలో నిపుణులైన పనివారు లభిస్తారు. ఒక యూనిటును నెలకొల్పుకోడానికి మంచి అవకాశాలు వున్నాయి.

గొడుగుల తయారీలో ముఖ్యమైన విడిభాగాలైన రిబ్బులు ఊచలు, బట్ట బొంబాయి నుంచిగాని, మద్రాసునుంచిగాని దిగుమతి చేసుకోవచ్చు. గొడుగు కర్రల్ని కేరళనుంచి, తెప్పించుకోవచ్చు.

మోటారు కార్లలో వాడే స్టోరేజి బేటరీలు

మోటారు రవాణాకు చిత్తూరు జిల్లా కేంద్రం.

ఈ జిల్లాలో రైల్వే సౌకర్యాలు అంతబాగా అభివృద్ధి చెందని కారణంగా వర్తక వాణిజ్యాల్లో సరుకు రవాణా అంతా లారీలద్వారానే జరుగుతుండడం వల్ల యిక్కడ స్టోరేజి బేటరీలకు బాగానే గిరాకీవుంది.

ఇప్పుడు వీటిని బెంగుళూరు నించీ, మద్రాసు నించీ కొనుగోలు చేసుకుంటున్నారు.

రోడ్లు బాగా అభివృద్ధి చెందుతున్నందువల్ల ముందు ముందు యీ ప్రాంతంలో మోటారు వాహనాలు అధికమై స్టోరేజి బేటరీలకు గిరాకీ పెరిగే అవకాశంవుంది.

ప్రస్తుతం ఈ బేటరీలను తయారుచేసే చిన్న యూనిటు ఒక్కటే చిత్తూరు జిల్లాలో వుంది. ఈ యూనిటును విస్తరింపజేసేందుకు మంచి అవకాశం వుంది.

స్టీలు ఫర్నిచరు, రేకు సబ్బు పెట్టెలు, పిల్లల రేకుబొమ్మలు మొదలగునవి తయారీ

తిరుపతి యాత్రా కేంద్రం కావడంవల్ల యీ వస్తువులకు బాగా గిరాకీవుంది.

పైవస్తువుల్ని తయారుచేయదలచిన వారికి హైదరాబాదులోని లఘుపరిశ్రమల సేవాసంస్థ వివరంగా తెలియజేస్తుంది

జాతీయ లఘుపరిశ్రమల కార్పొరేషను యంత్రాలను, పరికరాలను వాయిదా చెల్లింపుల పద్ధతిపై లఘుపరిశ్రమల వారికి అందజేస్తుంది.

(ఇతర వివరాలకు హైదరాబాదులోని పరిశ్రమల శాఖ డైరెక్టరుకు వ్రాసి తెలుసుకోవచ్చు.) ★

దశాబ్ది కాలంలో:
భీంగల్ పంచాయతీ సమితి

ఏ రంగంలోనైనా జరిగిన అభివృద్ధి అంచనావేసి చెప్పటంచాల కష్టమైనపని. పన్నెండేండ్లుగా అభివృద్ధిజెందుతున్న బ్లాకును గురించి చెప్పాలంటే అన్ని రంగాలలో జరిగిన ప్రగతి సమీక్ష చేయవలసి ఉంటుంది. గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి విషయమై ప్రత్యేక శ్రద్ధ తీసుకోబడింది. సోషలిస్టు వ్యవస్థ సమాజ నిర్మాణానికి గట్టి పునాదులు వేయబడినాయి. ప్రజల జీవన స్థాయీ ప్రమాణాలు పెరిగాయి. అందరికి సమానావకాశాలు కల్పించబడ్డాయి. దళిత ప్రజల ఉద్ధరణకు తగిన చర్యలు తీసుకోబడుతున్నాయి. సమాజంలో అన్ని వర్గాల ప్రజలలో, మనమందరమూ భాగస్వాములే అనే భావం కలుగుతున్నది.

ఈ సూత్రాల ఆధారంగా నిజామాబాదుజిల్లాలోని భీంగల్ పంచాయతీ సమితి గత దశాబ్దకాలంలో ముందడుగు వేసింది. ఈ బ్లాకులో 81 గ్రామాలు ఉన్నాయి. జనాభా 95534. ప్రజల ప్రధాన వృత్తి వ్యవసాయం. సేద్యం పనులు మందకొడిగాఉండే కాలంలో వీరు బీడి ఆకులు ఏరడం, బీడీలు తయారుచేయడంవంటి పనులలో నిమగ్నులై జీవనభృతి సంపాయిస్తున్నారు. పండేండ్ల క్రితం యీ బ్లాకు ఏర్పడినప్పుడు ఇందులో 70,000 ఎకరాలు సాగు అయ్యేవి. అందులో 7,500 ఎకరాలకు మాత్రమే నీటి పారుదల సౌకర్యం ఉండేది. ఐతే నేడు భీంగల్ బ్లాకులో మొత్తం 77,500 ఎకరాలు సాగు అవుతున్నాయి. ఇందులో 8,950 ఎకరాలకు నీటి పారుదల సౌకర్యం ఉంది. బంజరు భూములను పచ్చని పైరు భూములుగా మార్చడానికి అనేక పథకాలు చేపట్టిన ఫలితంగా ఇది సాధ్యమైంది. భూమి అభివృద్ధికి రుణాలు ఇవ్వబడినాయి. కొత్తగా సేద్యపు బావులు త్రవ్వబడినాయి. ఇది వరకు ఉన్న వాటిని బాగుచేయడం జరిగింది.

సేద్యభూమిలో 10 శాతం ప్రాంతంలో ఎక్కువ దిగుబడినిచ్చే వరి వంగడాలు పండించడం జరుగుతున్నది. బ్లాకు ఏర్పడకపూర్వం రైతులు ఎకరానికి 5 లేక 6 క్వింటాళ్ళ ధాన్యం మాత్రమే పండించగలిగేవారు. ఐతే ఇప్పుడు వారు ఎకరానికి 20 నుంచి 22 క్వింటాళ్ళ ధాన్యాన్ని సునాయాసంగా పండిస్తున్నారు. రసాయనిక ఎరువుల వాడకం ఇప్పుడు కొత్త విషయమేమీ కాదు. దీని అవసరాన్ని ప్రతి ఒక్కరూ గుర్తిస్తున్నారు. ఈ బ్లాకులో లోగడ 3 డిపోలు మాత్రమే ఎరువులు సరఫరా చేసేవి. ఇప్పుడు ఇట్టి డిపోలు 20 ఉన్నాయి. రైతులు పాత అలవాట్లకు, ఆచారాలకు స్వస్తి చెప్పి, ఇప్పుడు ఆధునిక వైజ్ఞానిక పద్ధతులను అనుసరిస్తున్నారు. క్రిమి సంహారక మందులు వగైరాలు ఉపయోగించి పైరులకు వచ్చే తెగుళ్లను వ్యాధులను అరికట్టగలుగుతున్నారు. గత సంవత్సరంలో యీ బ్లాకులో 1000 ఎకరాలలో విమానం ద్వారా మందులు చల్లడం జరిగింది. ఈ సంవత్సరం 5000 ఎకరాలకు వర్తించే కార్యక్రమాన్ని అమలు జరుపుతారు. పరిశ్రమల రంగంలో వడ్రంగం, కమ్మరం వృత్తులు జీవనాధారంగా గల వృత్తి పనివారలకు శిక్షణ ఇచ్చే నిమిత్తం బ్లాకులో శిక్షణ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు.

విద్యాహీనమైన సమాజంలో ప్రజాస్వామ్య విలువలను గుర్తించడంగానీ, ప్రజాస్వామ్య భావాన్ని ప్రసరింపజేయడంగానీ సాధ్యంకాదు. స్వాతంత్ర్యం లభించిననాటినుండి ప్రజా బాహుళ్యంలో విద్యావ్యాప్తికి తీవ్రంగా కృషి జరుగుతున్నది. పంచాయతీ రాజ్ వ్యవస్థ ఏర్పడిన తర్వాత దానికి మరింత ప్రాముఖ్యత ఇవ్వబడింది. నిర్బంధ విద్యాపథకంక్రింద 5388 మంది బాలబాలికలను పాఠశాలలో చేర్పించారు. 1960-61 లో 79 ప్రాథమిక పాఠశాలలు ఉండగా ఇప్పుడు వాటి సంఖ్య 84కు పెరిగింది. వాటికి తోడు 5 ఉన్నత పాఠశాలలు, 10 మాధ్యమిక పాఠశాలలు ఉన్నాయి. గిరిజన సంక్షేమశాఖ నిర్వహించే కేంద్రంతోపాటు 36 మధ్యాహ్న భోజన కేంద్రాలను నిర్వహిస్తున్నారు. ఈ బ్లాకులో 5 సాంఘిక సంక్షేమ హాస్టళ్లు ఉన్నాయి. షెడ్యూలు కులాలు, షెడ్యూలు తెగలకుచెందిన 30 మంది చొప్పున పిల్లలు వాటిలో ఉన్నారు. షెడ్యూలు తెగలకు చెందిన విద్యార్థులకు విద్యాసౌకర్యాలు, ఆర్థిక సహాయం అందజేయబడుతున్నాయి.

ఈ బ్లాకు ప్రజలు కుటుంబ నియంత్రణ విషయంలో కూడా వెనుకంజవేయలేదు. బ్లాకులో రెండు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలున్నాయి. ప్రజారోగ్యానికి నాలుగు ఉపకేంద్రాలు, కుటుంబ నియంత్రణకు రెండు ఉపకేంద్రాలు పనిచేస్తున్నాయి.

ఆర్థికంగా అన్ని ప్రాంతాలు సమంగా అభివృద్ధిచెందడానికి వీలుగా వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికి ప్రత్యేక శ్రద్ధ వహించబడుతున్నది. ప్రాదేశిక అభివృద్ధిపథకంక్రింద భీమగల్లులోయ పథకాన్ని అమలుజరుపుతున్నారు. మూడు సంవత్సరాలలో అమలు జరుపుతున్న యీ పథకంద్వారా బీడుభూములను సేద్యంయోగం చేసి నీటిపారుదల సౌకర్యం కల్పించడానికి రూ. 65 లక్షలు ఋణాలుగా మంజూరు చేసారు. ఈ పని పురోభివృద్ధిదశలో ఉంది. ఇంత వరకు రూ. 15,50,600 లు ఋణాలుగా మంజూరు చేశారు. జాతీయ రక్షణనిధికి ఇక్కడి ప్రజలు విరివిగా విరాళాలు అందజేశారు. 9,318.51 గ్రాముల బంగారం, బాండ్లలో పెట్టుబడిపెట్టారు. 1965లో చైనా దురాక్రమణ సందర్భంలో ప్రధాన మంత్రినిధికి రూ. 24732 లు ప్రజలు విరాళంగా ఇచ్చారు.

గ్రంథ సమీక్ష

చేతనావర్తం (వచన కవితాసంకలనం)

ప్రచురణ : సాహితీ బంధుబృందం, వరంగల్లు, ప్రతులకు ఆంధ్ర సారస్వత పరిషత్, బొగ్గులకుంట, హైదరాబాదు.

కవులు :

సంపత్కుమార, సుప్రసన్న, వే. నరసింహారెడ్డి, జగన్నాథం

ఇందులో నలుగురు కవులు, నాలుగు మార్గాలు ఎవరి చేతన వారిది, అభివ్యక్తి వారిది. చెప్పే తీరులో స్పందన అందరిలోను ఉంది. ఒకరిది విశ్వచేతనలోని వెలుగులునిండిన సౌందర్య శిల్పం. మరొకరిది నిశితమైన వ్యంగ్య ధోరణి. వేరొకరిది జీవన వేదాంతం. దీపాలు వేరైనా వెలిగే తీరులోను, చూపించే వస్తువులోను వైవిధ్యం ఉంది. నింద కవిత్వం అయితే స్పందన ఉండాలి ఆనందం కవిత అయితే కనిపించని కాలాన్ని ముందు చూపించాలి.

చేతనావర్తం–యీ మధ్య వచ్చిన మంచి కవితా సంకలనాల్లో ఒకటి.

" ఆనంద భావన, అనుభూతి ప్రసారణ అనంత జగచ్చైతన్యావగాహన నా కవితకు ప్రేరణాలు" అంటాడు సంపత్కుమార.

' ఆత్మాశ్రయం ' లో మూడుకానీ, ఏడు కానీ, ముప్పయి యేడు కానీ, రంగం మీద కదా ఉంది–పారిపో వీల్లేదు' అనే ఆశావాదాన్ని ప్రబోధిస్తాడు.

"అను నిత్యమూ చూస్తున్న సంఘటనలు నా గుండెను కలచి పెడితే, కదిలిస్తే, కలిగిన ఆవేశాన్ని కొంత సంయమనం చేసుకొని కవితగా మలచడానికి ప్రయత్నం చేశాను" అంటాడు నరసింహారెడ్డి.

"కదులు, నువ్వు చూడాల్సింది పడమటికి కాదు, తూర్పుకు నా వైపుకు".

" కాలాన్ని కత్తిరించిచూడకు. "

అందుకే 'ఉత్సాహం కవిత, ఉదయం కవిత, స్వచ్ఛమైన స్వేచ్ఛ కవిత, చైతన్యం కవిత' అంటాడు.

పేర్వారం జగన్నాథం — ' రంగు రంగుల బురఖాలతో సంగనాచి కుతర్కాలతో, పైశాచిక వికటాట్టహాసాలతో మనిషిని మరింత పాశవిక దుస్థితికి దిగజార్చే కుహనా సంస్కారాలతో నిండిన జీవిత కశ్మలాన్ని విచ్ఛిన్నంచేసి గుండె గుండెకు వంతెన కట్టి — మనిషి మనిషినీ జ్యోతిర్గళంలా వెలిగించటం ' తన కవిత అంటాడు

మంచి పేరడీలు రాస్తాడు జగన్నాథం

ఒక జాతి కవిత్వం ఆ జాతి సమష్టి చైతన్య పురోగమనానికి సూచిక. జీవితంలోని సుఖ దుఃఖాల నడుమ వాటి కతీతంగా సాక్షాత్కరించే తీయని వేళ కవిత ' అంటాడు సుప్రసన్న.

అఖండ కాలాన్ని— ఖండకాలంలోనే వెలిగించుకోవాలని అంటాడు. జీవించదు గత కాలం, సాక్షాత్కరించదు భవిష్యత్తు, వర్తమానం వెలుగుతుంది. వెలుగుతో వెలగడం మేలు.'—

'యుగపద' సుప్రసన్న తాత్త్విక మౌలికమైన కవితా శిల్పానికి పతాక.

'భావన దీపం అనుభవం దాని నీడ
జీవితం కల గలసిన వెలుగుల చీకట్ల వాడ
జ్ఞాపకం వెచ్చని చలి—తీయని ఆకలి
వెన్నెలతో నవ్విస్తూ చేతుల కందని జాబిలి

'అనుశీలన' చివర చేర్చబడిన కవితా ప్రస్తావ రోచిస్సు.

అందంగా వ్రాయబడిన కవితను ఆలోచన నింపిన కవితను ఆధునికరను వెలార్చే తీరుగా అచ్చువేయించారు.

ఈ ప్రయత్నం అత్యంతం శ్లాఘనీయం

–ఆరిపిరాల విశ్వం

చిత్ర ప్రకృతి (కావ్యం)

రచయిత: పెద్దిబొట్ల రామచంద్రరావు

ప్రచురణ: సాహితీ సమితి, ఒంగోలు, ఒంగోలుజిల్లా వెల రు. 2.50

కృతులు కవి చిత్త ప్రకృతినిబట్టి వెలుపడుతాయి. ఈ చిత్రప్రకృతి కూడా అట్టిదే. తేటగీతులు రాయలేనివాడు తెలుగువాడు కాదనియు, కందము రాయనివాడు కవి కాదనియు లోకములో పరంపరాగతముగా వచ్చిన ఒక నానుడి. చైతన్య చిత్ర ప్రకృతి ననుభవించాలి. ' పూర్ణ పురుషుడు పరమాత్మల పురుష ప్రవృతి, శివుని అర్ధాంగి పార్వతి చిత్రప్రకృతి' అను భావనతో నీ చిత్ర ప్రకృతిని శివశ్రీభావమున శివీకరించుకొనుచూ అయిదువందల యిరవై తేటగీతులతో రచయిత కూర్చిన గీతికాంజలి యిది. తేటగీతుల తియ్యందనముతో తెలుగు తన ముందు చక్కగా ప్రతిబింబిస్తున్నది. మూడు ఖండములుగా విభజింపబడిన యిందు స్వాతంత్ర్య యోధులనుగూర్చి, ప్రకృతి నిత్య నూతనత్వమునుగూర్చి, నీతి విషయములును, భక్తిభావములును చక్కగా అనేకానేక రస విషయములను రచయిత పొందుపరిచినాడు.

"ఎంత కాలము మోహాబ్ధి నీదగలను, అంతుపొంతును లేని యీ యబ్ధి యందు ఏదియో యేలనో యెట్లొ యెరుకపడదు నెయ్య మొప్పార నిన్జేరు నిముసమెపుడు?" వంటి సరళ భాషాభావ శైలీ రచన చిత్రప్రకృతి కావ్య ప్రకృతియై ఈ గీతికాంజలి రసాంజలియై ఒప్పుతున్నది

-- సుధామ

జానపద సాహిత్యము - ఎంకి పాటలు

'రేణుశ్రీ'

భారత దేశము అనాది నుండియు సర్వకళలకు నిలయము. సంగీత సాహిత్యాది కళలకు ఆటపట్టు. వీనిలో జానపద సాహిత్యము విశిష్టమై ప్రముఖ స్థానము వహించి యున్నది. జానపద సాహిత్య మనగానే తలంపునకు వచ్చువారలు " ఎంకి, నాయుడు బావ "లు. వీరు ఈ సాహిత్యమునందు నాయికానాయకులో లేక తెనుగు కవిత్వమునకు జీవము పోసిన మహనీయులో అనయుట సాహసముతో కూడినది. వీరి నివాస స్థలములు గ్రామసీమలు. వీరి జానపద జీవితము, ఆశయములు, భావములు, భారతజాత్యభ్యుదయమునకు ప్రతిబింబములై జానపద సాహిత్యమునందు చిరస్థాయిని పొందినవి. ఎంకి నాయుడు బావల జీవన విధానమును మనోభావాలను కొంత తెలిసికొందము.

పూలబాసలు

ఎంకి గొప్పతనము ఈ క్రింది సాహిత్యము వలన తెలియును.

" పూల బాసలు తెలుసు ఎంకికి-తోట
పూలమనసులు తెలుసు ఎంకికి ॥

పూల మొక్కల నీటి జాలుగ నిలుసుండి
పూలన్ని నీపాటె ఆలించెనంటాది ॥ పూల ॥

పూలతో వియ్యాలు పూలతో కయ్యాలు
మానల్లె నన్నుంచి తానె పూవేనేమొ ॥ పూల ॥

ఇది పాటవలె పాడుటకును అనుకూలముగా ఉన్నది. ఈ పదమునందు నాయుడుబావ ఎంకికి గొప్పదనమును చూపుచున్నాడు. ఎంకికి పూలభాషలు వచ్చునట. తోట యందలి పూల మనసులు కూడ బాగుగా తెలియునట. పూల మొక్కల వద్ద నిల్చుండి పాడుచుండ పూలన్నియు ఎంకి పాటలోని మాధుర్యమును గ్రోలి వినునట. కడపట నాయుడు బావను వదలి ఎంకి పూవై పోవునేమో యని నాయుడు బావ భయము.

నాయుడుబావను వదలి ఎంకి క్షణముండలేదు. దానికి ఈ క్రింది పదమే తార్కాణము.

జాముఱేతిరి యేళ జడుపు గిడుపు మాని
సెట్టుపుట్ట దాటి సేనిలో నేనుంటె
మెల్లంగ వస్తాది నా ఎంకి
సల్లంగ వస్తాది నా ఎంకి ॥

పచ్చన్ని చేలోకి వంటు ఎన్నెల్లోన
సిరి సేరాగట్టి నీటు గొస్తావుంటె
వొయ్యారి మొలకింటు నా ఎంకీ
వొనలచ్చిమనిపించు నా ఎంకీ ॥

యేతమెత్తేకాడ ఎదురూగ కూకుంటె
మల్లీ యెప్పటల్లె తెల్లారి పోతుంటె
సెందురుణ్ణీ తిట్టు నా ఎంకీ ;
సూరియుణ్ణీ తిట్టు నా ఎంకీ ॥

నాయుడు బావ జాముఱాత్రి వేళకే పొలము పని చూచుటకు వెళ్ళగా ఎంకి కూడ బావకు సహాయముగ చేనికి పోవును. ఆ వెడలు నట్టి తీరును చూచి " వనలక్ష్మి " తరలి వచ్చుచున్నదా యన్నట్లు నాయుడు బావ భ్రమ పడును. అనగా అందములో ఎంకి వన లక్ష్మికి ఏ మాత్రము తీసిపోదని భావము. ఎంకి సరసన సరసములతో పొలము పని, తోట పని, మొదలగునవి సూర్యోదయాత్పూర్వం ముగించుకొని తన కష్టములనే మరచెడివాడు నాయుడుబావ. ఏతమ్మెత్తునపుడు ఎదురుగా కూర్చున్న తన ఎంకిని చూచుచు నాయుడుబావ ఈ లోకమునే మరచి పోయెడివాడు. ఆమెకు కూడ ఇది సరదాగా వుండెడిది. అందుచేతనే అప్పుడే అస్తమించు చంద్రుని, ఉదయించు సూర్యుని తిట్టును. ఇట్టి ముచ్చట్లు నాయుడుబావ మనకెన్నో చెప్పును.

తిరుపతి యాత్ర

నాయుడుబావకు ఎంకిపై వల్లమాలిన అభిమానము. వేంకటేశ్వరునితో రాత్రిపగలనక ఎల్లప్పుడు ఎంకిని చల్లగకాపాడుమని కోరుటకై నాయుడుబావ చేయు తిరుపతి యాత్రా విధమునకు మచ్చుతునక ఈ క్రింది పదము.

ఎంకీ నాతోటి రాయే-మన యెంకటేశ్వరుణ్ణి
యెల్లి సూశొద్దాము॥ ఎంకి॥
ఆవుల్ని దూడల్ని అత్తోరికాడుంచి
మూట ముల్లే గట్టి మునలోళ్ళతో సెప్పి
ఆ సామి మీదేటొవూసులాడుకొంటు
కొండ మెట్లన్నీ నీ కొంగట్టు కెక్కాలి
రేతిరి పగటేల రెప్పయ్య కెంకీని
సల్లంగ సూడుమని సామితో జెప్పాలి ॥ ఎంకీ ॥

ఆవులను దూడలను అత్తగారింట్లో వదలి ముదుసళ్ళకు తమ ప్రయాణము సంగతి తెలిపి వారి ఆజ్ఞ తీసికొనుట మన వారి సంప్రదాయము. ఇది ఎంకి నాయుడు బావలకు పెద్దల యెడ గౌరవమును వ్యక్తము చేయుచున్నది. ఆ స్వామి మహిమలను తలంచుచు కొండ మెట్లన్నియు ప్రయాస లేక నధిరోహించు తన ఎంకిని చల్లగ చూడుమని ప్రార్థించుటలో ఎంకిపై నాయుడు బావకు గల ప్రేమను సూచించును. దయ తలచి తిరుపతి వేంకటరమణుడే వీరిని అమరులుగ జేసెనేమో!

నీతోటె వుంటాను

పిల్లకపట మెరగనిది యెంకి. ఎంకి నాయుడుబావ నుండి కోరున దొక్కటే. అదే నిష్కల్మషమైన మర్మము లేని మనస్సు. నాయుడుబావ ఎంకికి ప్రాణముతో సమానము. ఎంకిని వదలి నాయుడుబావ, బావను వదలి ఎంకి యుండలేరు వారి కపటము లేని మనస్సులను తలపింప జేయుపదము సాక్షి.

" నీ తోటె వుంటాను నాయుడుబావా
నీ మాటె యింటాను నాయుడుబావా ॥ '

" సరుకు లేమి కావాలె సంతన పిల్లా—నువ్వు
మరిమరిమడిసి మనసియ్యి నాయుడుబావా ? "

" సక్కదనము కేమిత్తు సంతన పిల్లా — నువ్వు
సల్లగుండు పద్దాక నాయుడుబావా "

' యేడనే నీ కాపురమొ యెలుగు పిల్లా ? — నీ
నీడలోనే మేడ కడతా నాయుడుబావా ? '

నాయుడుబావ ప్రశ్నలకు ఎంకి ఇచ్చిన సమాధానములు నిష్కల్మషమైనవేకాక, ఎంకి మనస్తత్వమును కూడ సూచించును. ఎంకి, నాయుడు బావను అమితంగా ప్రేమించుననుటకు నిదర్శనము ఎంకి ఎల్లప్పుడు కోరునది నాయుడుబావ చల్లగ నుండుటయే ఎంకి కాపురము, వెలుగు అన్నియు నాయుడుబావ నీడలోనే ఎంకి భారతీయ స్త్రీ ధర్మమును ఎంత చక్కగ జీర్ణించుకున్నదో గదా! ఎంకి, నాయుడు బావల యెడబాటు వలన కలిగిన సంక్షోభము, సంచలనము, ఆవేదన క్రింది పదములో సువ్యక్తములైనవి.

రావద్దె నాపక్క రావద్దె యెంకీ
ఆపొద్దెమిస పొత్తు లయిపోయె ఎంకీ ॥

... ...
... ...

యేడ నువు వుంటావొ, యేళ్ళన్ని ఈదానె
యేట వస్తుండావొ యీశ్వరుణ్ణడిగానె ॥

ఎంకి,నాయుడు బావకు సుందర మోహనమూర్తి. ఒక్క నవ్వే వజ్రవైడూర్యాలు చేయునట. ఇంకగా చెప్పనేల ? నాయుడుబావ హృదయమునే చూరగొన్నది. ఆ విషయ మిందు వివరింపబడినది.

" యెంకి వంటి పిల్ల లేదోయ్ లేదోయ్
యెంకి నా వంకింక రాదోయ్ దోరాయ్
మెళ్ళో పూసల పేరు తల్లో పూవుల సేరు
కళ్ళెత్తితేసాలు కనకాబిసేకాలు ॥

సెక్కిట సిన్నీమచ్చ సెబితె పాలదులచ్చ
ఒక్క నవ్వేయేలు వొజ్జిరవొయిడూరాలు ॥ "

ఎంకి నాయుడుబావల జీవితగమనము చాలా చిత్రమైనది " సాటేలా ! నీకుమాటేలా " అను పదమునందు ఎంకి ఔన్నత్యము, ప్రతిభ ప్రకటితములైనవి.

జానపద సాహిత్యములో నిట్టి రచనలు కోకొల్లలు. ఇందు జాతీయ జీవన మధికముగా ప్రతిబింబించినది. ఇట్టి సాహిత్యము నాదరించువారు చాల తక్కువ. అందుచే మరుగు పడుతున్న ఈ సాహిత్యమును సేకరించినచో మన జాతి నుద్ధరించిన వారమగుదుము!

నాడు: నేడు

మును నఖండ దేశమునకునై పోరాట
మిపుడు ఖండమునకె యింటిపోరు
ఖండితముగ ఖల్కుగుండెలే కరువయ్యె
ఏమిశాయ వచ్చు - ఈశ్వరాజ్ఞ.

పొరుగువారి నంప పోరాడిరానాడు
పొరుగువారి నింప పోరునేడు
పోరుగుపోరు మాన్పు బుద్ధులంగడివోయె
ఏమి శాయవచ్చు - ఈశ్వరాజ్ఞ.

—గోపన్న



కరీంనగరం జిల్లాలో ఖరీఫ్ పంట ప్రణాళిక

కరీంనగరం జిల్లాలో వ్యవసాయోత్పత్తిని ఎక్కువ చేసే ఉద్దేశంతో 1970–71 సంవత్సరానికి ఖరీఫు ప్రణాళిక ఒకటి రూపొందించబడింది. అంతేకాకుండ పారిశ్రామిక కార్యకలాపాలను యెక్కువచేసి పశుసంపదను అభివృద్ధి పరిచేందుకు కూడా ఉపయోగపడేవిధంగా ఈ ప్రణాళిక తయారుచేయబడినది.

భూసారాన్ని పరిరక్షించు, పొలాలనుంచి యెక్కువ పంట సాధించడానికిగాను వ్యవసాయ రంగంలో అభివృద్ధికర పద్ధతులు ప్రవేశపెట్టడానికి కార్యక్రమం ఒకటి తలపెట్టబడింది. భూములను సేద్యయోగ్యంగా చేయడం, భూసారం కొట్టుకొని పోకుండా తగిన చర్యలు తీసుకోవడం, ఎక్కువ దిగుబడినిచ్చే వరివంగడాలు, జొన్న, మొక్క జొన్న విత్తనాలు ఉపయోగించడంవంటి చర్యలు తీసుకోబడుతాయి. సకాలంలో ఎరువులు వగైరా ఉపయోగించబడిన ఈ కార్యక్రమం విజయవంతం కావడం ఆధారపడివుంటుంది. కనుక వ్యవసాయానికి అవసరమయ్యే పరికరాలు, ఎరువులు, క్రిమి హారక మందులు సకాలంలో తగినంతగా సరఫరా చేయడానికి తగిన చర్యలు తీసుకోబడినాయి.

కొత్త బావులు త్రవ్వడానికి పాతవాటిని మరమ్మతు చేయించడానికి తగిన చర్యలు తీసుకోబడుతున్నాయి. ఇందువల్ల భూములకు నీటి సరఫరా జరగడానికి వీలుకలుగుతుంది. అంతేకాకుండా చిన్ననీటి పారుదల వనరులను ఇతర చెరువులను మరమ్మతులు చేయడానికి తగిన శ్రద్ధ తీసుకోబడుతున్నది. సహకార సంస్థల ద్వారా రైతాంగానికి స్వల్ప, మధ్య కాలిక రుణాలను ఇప్పించడానికి తగిన ఏర్పాట్లు చేయబడినాయి. ఈ పరిస్థితి సౌకర్యంవల్ల రైతులు తమ భూములను అభివృద్ధిపరచి ఎక్కువపంట ఉత్పత్తి చేయడానికి వీలుకలుగుతుంది.

ఈ ప్రణాళిక విజయవంతంగా అమలు జరిగినప్పుడు అదనంగా 17998 ఎకరాల భూమికి నీటిపారుదల సౌకర్యం ఏర్పాటు కాగలదని అంచనా వేయడం జరిగింది. పంట కూడా 13,502 టన్నులు అదనంగా పండగలదని ఆశింపబడుతుంది. నీటివనరుల నిర్మాణానికిగల అవకాశాలను పరిశీలించిన తరువాత ఖరీఫ్ పంట కాలంలో ఈ పనులను చేపట్టాలని సంకల్పించబడింది.

వ్యవసాయోత్పత్తికి గ్రామీణ విద్యుచ్ఛక్తి సరఫరా తోడ్పడే విధంగా కార్యక్రమం నిర్ణయించడం జరిగింది. వ్యవసాయానికి ఉపకరించే విద్యుచ్ఛక్తి కనెక్షనులు ఇవ్వడానికి అధిక ప్రాధాన్యత ఇవ్వాలని నిర్ణయం తీసుకోవడం జరిగింది.

పశు సంపదను పెంపొందించడానికి మామూలుగావున్న పథకాలుకాక కొన్ని ప్రత్యేక పథకాలు రూపొందించడం జరిగింది. రైతులకు ఎక్కువ ఆదాయం కల్పించే వుద్దేశంతో పాలసేకరణ, నిలవ, మార్కెటింగు పథకం ఒకటి తయారు చేయబడింది. జంతువుల వైద్యశాలలను ఆధునిక పద్ధతులలో ఏర్పాటు చేయడానికి తగిన చర్యలు తీసుకోబడినాయి. మత్స్య పరిశ్రమాభివృద్ధికిగాను పెద్ద పంచాయితీల ఆధీనంలో 10 పెద్ద చెరువులలో చిరు చేపలను పెంచడానికి పథకం తయారు చేయబడింది. దీనివల్ల పంచాయితీల ఆదాయం పెరగడానికి అవకాశం ఏర్పడుతుంది.

లఘు పరిశ్రమలను ప్రోత్సహించడానికి తగిన చర్యలు తీసుకోబడుతున్నాయి. ఇక్కడ పరిశ్రమలు నెలకొల్పదలచినవారికి వాణిజ్య బ్యాంకుల ద్వారా పరపతి సౌకర్యాలు కల్పించడానికి కృషి చేయడం జరుగుతున్నది. త్వరలోనే కరీంనగరం కో ఆపరేటివ్ స్పిన్నింగ్ మిల్లు ఉత్పత్తి ఆరంభిస్తుంది జిల్లాలో శ్రేష్ఠమైన ప్రత్తిని పండించడానికి కృషి సలుపబడుతున్నది. ప్రత్తి పంటకు తగిన ప్రోత్సాహం ఇచ్చే ఉద్దేశంతో ఈ ప్రణాళికా కాలంలో 50 ప్రదర్శన క్షేత్రాలను పెంచడానికి సంకల్పించబడింది.

1970 జూలై 24 న పోచంపాడు ప్రాజెక్టు నుంచి విడుదలైన జలాలు కరీంనగరం జిల్లాలో 25,000 ఎకరాలకు నీటి సౌకర్యం కల్పిస్తాయి. నీటి పారుదలతో ఆయకట్టు కూడా అభివృద్ధి చెందుతూవుంటాలి కనుక, మెట్పల్లి, జగిత్యాల తాలూకాలలో భూమి తనఖా బ్యాంకు ద్వారా రైతాంగానికి రూ. 15 లక్షల మేరకు రుణాలు ఇప్పించే కార్యక్రమం చేపట్టబడింది. భూములను సేద్యయోగ్యంగా మార్చడానికి అగ్రోఇండస్ట్రీస్‌శాఖ కృషి చేస్తున్నది. బుల్‌డోజర్లు, ట్రాక్టర్లు ఆయకట్టు ప్రాంతానికి తరలించబడినాయి. ఇవి ఇప్పుడు పనిచేస్తున్నాయి కూడా. పోచంపాడు జలాలను సక్రమంగా, శాస్త్రీయంగా ఉపయోగించే విషయమై రైతుల కొరకు కొన్ని ప్రయోగాత్మక క్షేత్రాలు నెలకొల్పబడినాయి. ఖరీఫు ప్రణాళిక కాలంలో పోచంపాడు ప్రాజెక్టు ప్రాంతంలో చెరకు పంటను ప్రోత్సహించడానికి కొన్ని ప్రదర్శన క్షేత్రాలు ఏర్పాటు చేయబడినాయి. ఇది విజయవంతమైనపుడు ముందు ముందు ఈ జిల్లాలో సహకార చక్కెర ఫ్యాక్టరీ స్థాపించడానికి అవకాశాలు ఏర్పడుతాయి. ★

జిల్లాలనుండి

రక్షిత మంచినీటిసరఫరాకు ముఖ్యమంత్రి ప్రారంభోత్సవం

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి శ్రీ కాసు బ్రహ్మానందరెడ్డి, వనపర్తిలో రు. 1[0] లక్షల ఖర్చుతో నిర్మించబడిన రక్షిత మంచినీటి సరఫరా పథకానికి ప్రారంభోత్సవం చేశారు. జిల్లా పరిషత్తు అధ్యక్షుడు శ్రీ కె. కె. రెడ్డి యీ ఉత్సవానికి అధ్యక్షత వహించారు.

ముఖ్యమంత్రి ఈ సమావేశంలో ప్రసంగిస్తూ ఈ ప్రాంతం వెనుకబడి ఉన్న దృష్ట్యా గ్రామీణ అభివృద్ధి కార్యక్రమాల పథకం అమలులో మహబూబు నగర్, నల్లగొండ జిల్లాలను చేర్చుకోవాలని తాను కేంద్రానికి సూచించానని అన్నారు. ఈ పథకం క్రింద గ్రామీణ అభివృద్ధికి రాష్ట్రం కేటాయించే నిధులకుతోడు యీ జిల్లాకు అదనంగా రెండుకోట్ల రూపాయలు లభిస్తాయి. పథకం అమలు ఖర్చులో 10 శాతం తాము పెట్టుబడి పెట్టాలని మిగతా 90 శాతం డబ్బును జాతీయం చేయబడిన బ్యాంకులు ఋణంగా అందజేస్తాయని పారిశ్రామిక వేత్తలకు, వ్యవసాయ దారులకు, ఆసక్తిగల యితరులకు ముఖ్యమంత్రి విజ్ఞప్తి చేశారు. 16,000 మందికి ఉపాధి కల్పించే బొగ్గు ప్రాతిపదికగల ఎరువుల ఫ్యాక్టరీని రామగుండంలో త్వరలోనే ప్రారంభిస్తారని ఆయన అన్నారు. రు. 6 కోట్ల ఖర్చుతో కేబిల్ ఫ్యాక్టరీకూడా నిర్మించబడుతుందనీ, దానితో నిరుద్యోగ సమస్య కొంతవరకు తీరుతుందనీ ఆయన అన్నారు.

భూ ఆక్రమణ ఉద్యమాన్నిగూర్చి ప్రస్తావిస్తూ రాష్ట్రంలో భూమిలేని పేదలకు యింతవరకు 21 లక్షల ఎకరాల భూమిని పంపిణీ చేశారని ముఖ్యమంత్రి అన్నారు. వనపర్తి తాలూకాలో అర్హులైనవారికి అటవీ భూములను పంపిణీ చేయాల్సిందిగా తాను ఉత్తర్వులు జారీ చేస్తానని ముఖ్యమంత్రి అన్నారు. వనపర్తిలో ప్రాథమిక పాఠశాలకు కొత్త భవనం నిర్మాణానికి రు. 25,000 లు మంజూరు చేస్తానని ఆయన హామీ యిచ్చారు.

గ్రామాలకు విద్యుచ్ఛక్తి సరఫరానుగూర్చి ముఖ్యమంత్రి ప్రస్తావిస్తూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో యింతవరకు 1,300 గ్రామాలకు విద్యుచ్ఛక్తి సరఫరా చేయబడిందనీ, అందులో మహబూబు నగర్ జిల్లాలో 320 గ్రామాలకు విద్యుచ్ఛక్తి లభించిందని ఆయన అన్నారు.

జిల్లాపరిషత్ అధ్యక్షుడు శ్రీ కె. కె. రెడ్డి ప్రసంగిస్తూ ఈ జిల్లా చాలా కాలంవరకు సంస్థానాల అధీనంలో ఉన్న కారణంగా అన్ని రంగాలలోను చాలా వెనుకబడి ఉన్నదనీ, అందువల్ల చిన్న తరహా నీటి వసరులు, విద్యుచ్ఛక్తి పథకాల అమలుకు ఎక్కువ నిధులను మంజూరుచేయాలని ముఖ్యమంత్రికి విజ్ఞప్తి చేశారు.

హరిజన యిండ్ల కాలనీకి ప్రారంభోత్సవం

ఒంగోలు జిల్లా కలెక్టరు, శ్రీ పి. కె. దొరైస్వామి, చిన్న గంజాంలో ప్రభుత్వం రు. 72000/- ల ఖర్చుతో 60 హరిజన కుటుంబాలకై నిర్మించిన బేతంవారి బాపూజీనగర్ కాలనీకి ప్రారంభోత్సవం చేశారు. కాలనీ నిర్మాణంలో హరిజనులు శ్రమ దానం చేశారు.

కలెక్టరు ప్రసంగిస్తూ జిల్లాలో 10 కాలనీల నిర్మాణం పను లను చేపట్టారనీ, యిటువంటి ప్రజాహిత కార్యక్రమాలను విజయ వంతంగా అమలు జరపడంలో ప్రజలు సహకరించాలని అన్నారు.

పంచాయతీ సమితి అధ్యక్షుడు శ్రీ కె రామస్వామిరెడ్డి సమావేశానికి అధ్యక్షత వహించారు. ఆయన ప్రసంగిస్తూ కాలనీ నిర్మాణాన్ని త్వరితగతిని పూర్తిచేసిన అధికారులను అభినందించారు.

మెదకు జిల్లాలో గ్రామాలకు విద్యుచ్ఛక్తి సరఫరా

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విద్యుచ్ఛక్తి మండలి అధ్యక్షుడు, శ్రీ ఎ. కృష్ణస్వామి, మెదకు జిల్లా రామసానిపల్లి, తానుపల్, చిలవర, ఇంద్రకన్, అంతారం గ్రామాలలో రెండు రోజులపాటు పర్యటించిన సందర్భంలో అక్కడ ప్రసంగిస్తూ విద్యుచ్ఛక్తి ఉత్పత్తి పంపిణీ విభాగాలను గూర్చి వివరిస్తూ గ్రామీణ ప్రాంతాలలో వ్యవసాయదారులకు సౌకర్యాలు కల్పించే నిమిత్తం 50 శాతం తక్కువ రేటుపై వారికి విద్యుచ్ఛక్తి సరఫరా చేయబడుతున్నదని అన్నారు.

జిల్లా కలక్టరు శ్రీ ఎన్. చక్రవర్తి ప్రసంగిస్తూ ప్రజలు గ్రామాలలో చీకటిని పారదోలడానికి మాత్రమేగాక పేదరికాన్ని రూపుమాపడానికి కూడా విద్యుచ్ఛక్తి వినియోగించాలని అన్నారు. రైతులకు విద్యుచ్ఛక్తి మోటార్లను సరఫరా చేయడానికి అనేక సంస్థలు, బ్యాంకులు సిద్ధంగా ఉన్నాయనీ రైతు యీ సదుపాయాన్ని వినియోగించుకోవాలని కలెక్టరు ఉద్బోధించారు.

పశువైద్యశాల భవనానికి శంకుస్థాపన

మహబూబునగర్ జిల్లా కలక్టరు, శ్రీ ఎం. అసదుల్లా సయీద్, సెప్టెంబరు 6 వ తేదీన వనపర్తి పంచాయతీ సమితిలోని ఘనపురంలో పశువైద్యశాల భవనానికి శంఖుస్థాపన చేశారు జిల్లా పరిషత్తు అధ్యక్షుడు, శ్రీ కె. కె. రెడ్డి యీ ఉత్సవానికి అధ్యక్షత వహించారు.

ఖమ్మం జిల్లాలో వ్యవసాయ ఋణాలు

ఖమ్మం జిల్లాలో ఆధునిక వ్యవసాయాన్ని అమలుజరపడానికి వీలుగా రైతులకు "పంటకాలంలో సేద్యపు పనులకు ఋణం" పథకం క్రింద ఋణాలు యివ్వడానికి కొన్ని కమర్షియల్ బ్యాంకులు ఖమ్మం జిల్లా మధిర సమితిలోని గంధంపల్లి-కొత్తపేట, రాంపేడులలోని రెండు బహుళార్థ సాధక సహకార పరపతి

సంఘాలను సెలక్టుచేశాయి. ఎల్లెందులోని స్టేట్ బ్యాంకు ఆఫ్ హైదరాబాదు బ్రాంచి కార్యాలయంవారు యీ రెండు సంఘాలకు వరుసగా రు 3,65,160 రు 83,610 లు మంజూరుచేశారు

మంజూరు చేసిన మొత్తం రు. 4,48,770 లలోను, రు. 1,82,559 లను యీ సంఘాలకు అప్పుడే అందజేశారు

ఉన్నత పాఠశాల భవనానికి యు. పి. గవర్నరు ప్రారంభోత్సవం

ఉత్తర ప్రదేశ్ గవర్నరు, డా బెజవాడ గోపాలరెడ్డి, సెప్టెంబరు 6 వ తేదీన నెల్లూరు జిల్లా సంగం గ్రామంలో ఉన్నత పాఠశాల కొత్త భవనానికి ప్రారంభోత్సవం చేశారు ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ఆయన ప్రసంగిస్తూ ఉన్నత పాఠశాల భవన నిర్మాణానికి ఉదారంగా రు 20,000 లు విరాళం అందజేసిన కీ శే గుట్టిగుండ్ల బాలకృష్ణారెడ్డి కుటుంబాన్ని కొనియాడారు జిల్లా పరిషత్తు అధ్యక్షుడు శ్రీ ఎం గోపాలరెడ్డి అధ్యక్షత వహించారు

రాష్ట్ర పౌర సరఫరా శాఖామంత్రి, శ్రీ ఆనం సంజీవరెడ్డి, కీ శే బాలకృష్ణారెడ్డి చిత్రపటాన్ని ఆవిష్కరించారు, గ్రామీణ రక్షిత మంచినీటి సరఫరా పథకం, లిఫ్ట్ ఇర్రిగేషన్ పథకం, పంచాయతీ భవనం, ఉన్నత పాఠశాల భవనం, పశువైద్యశాలవంటి సౌకర్యాలను సమకూర్చుకోవడంలో కలిసికట్టుగా కృషిచేసిన గ్రామస్థులను ఆయన అభినందించారు

కేంద్ర మంత్రిచే బెస్తల కాలనీకి శంకుస్థాపన

కేంద్ర ప్రభుత్వ ఆరోగ్య, కుటుంబ నియంత్రణ శాఖా మంత్రి శ్రీ బి యస్ మూర్తి ఇటీవల తూర్పుగోదావరి జిల్లా దుమ్ములపేటలో 50 ఇండ్లు గల బెస్తల కాలనీకి శంకుస్థాపన చేశారు ఇటీవల తుఫాను దెబ్బకు గురియైన జాలరులకు గృహవసతి కల్పించడానికి ఆ జిల్లా కలెక్టరు ఒక పథకాన్ని మంజూరుచేశారు

ఇండ్ల నిర్మాణం త్వరలో పూర్తిచేయవలసిందని మంత్రి జాలరులకు వినతిచేశారు

శాసన సభ్యులు శ్రీ సి వి కే రావు ప్రసంగిస్తూ ఈ విషయంలో కలెక్టరు చూపిన ప్రత్యేక శ్రద్ధకు హర్షం వెల్లడించారు.

గ్రామీణ విద్యుదీకరణ

చిన్నతరహా నీటి పారుదల శాఖామంత్రి శ్రీ వి పురుషోత్తమరెడ్డి, ఆగస్టు 15వ తేదీన నకిరేకల్లు పంచాయతీ సమితిలోని పనిపాకల గ్రామంలో విద్యుచ్ఛక్తి సరఫరాకు ప్రారంభోత్సవం చేశారు

ఆ సందర్భంగా జరిగిన సభలో ఆయన ప్రసంగిస్తూ గ్రామీణ ఆర్థికరంగంలో విద్యుచ్ఛక్తి ప్రముఖపాత్ర వహిస్తున్నదని అన్నారు

జిల్లా పరిషత్తు అధ్యక్షుడు, శ్రీ రంగారెడ్డి ప్రసంగిస్తూ మరికొన్ని లిఫ్టు ఇరిగేషన్ పథకాలను అమలు జరపాల్సిన అవసరాన్ని గూర్చి నొక్కిచెప్పారు, జిల్లా పరిషత్తు ఉపాధ్యక్షుడు శ్రీ సి మల్లారెడ్డి ప్రసంగిస్తూ నల్లగొండ జిల్లాలో గండ్లుపడిన చెరువులను మరమ్మతు చేయాల్సిన అవసరాన్ని గూర్చి వివరించారు



మధ్య తరహా నీటి పారుదల శాఖా మంత్రి శ్రీ ఆర్ నారప రెడ్డి ఆగస్టు 28 న కొరిసపాడు సమితి కార్యాలయంలో విద్యుచ్ఛక్తికి ప్రారంభోత్సవం చేశారు.

మురుగునీటి పారుదలకు రూ. 60 కోట్లు

మధ్యతరహా నీటిపారుదల, వరద నిరోధక శాఖల మంత్రి శ్రీ ఆర్ నారపరెడ్డి ఇటీవల కొరిసిపాడులో ప్రసంగిస్తూ గత రెండు సంవత్సరాలలో రాష్ట్రంలో మురుగునీటి పారుదల పథకాల అమలు నిమిత్తం రు 8 కోట్లు ఖర్చు చేశారని అన్నారు

పంచాయతి సమితి భవనానికి, విద్యుచ్ఛక్తి సరఫరాకు ప్రారంభోత్సవంచేస్తూ ఆయన యీ విషయం తెలియచేశారు రాష్ట్రంలో మురుగునీటి పారుదల పథకాలన్నిటి అమలుకు రు 60 కోట్లు అవసరమవుతాయని ఆయన పేర్కొన్నారు

రెండు సంవత్సరాలలో గుండ్లకమ్మ ప్రాంతమంతటికి నాగార్జునసాగర్ జలాలను అందజేయడం జరుగుతుందని మంత్రి అన్నారు ప్రత్యేక పథకం క్రింద సమితిలో 65 గ్రామాలకు విద్యుచ్ఛక్తి సరఫరా చేయబడుతుందని ఆయన వెల్లడించారు సమావేశానికి అధ్యక్షత వహించిన జిల్లా పరిషత్తు అధ్యక్షుడు శ్రీ రమణారెడ్డి ప్రసంగిస్తూ కొత్త జిల్లా సర్వతో అభివృద్ధికి తీవ్రంగా కృషిచేయాల్సిన అవసరాన్ని గూర్చి నొక్కిచెప్పారు

తెగుళ్ళ నివారణ కార్యక్రమం

వ్యవసాయ శాఖామంత్రి శ్రీ కాకాని వెంకటరత్నం, ఆగస్టు 29వ తేదీన మిర్యాలగూడెంలో వరితెగుళ్ళ నివారణ కార్యక్రమానికి ప్రారంభోత్సవం చేశారు నాగార్జునసాగర్ ప్రాజెక్టు ప్రాంతంలో యీ తెగుళ్ళు ఎక్కువగా ఉన్నాయి ఈ సందర్భంగా ఆయన ప్రసంగిస్తూ రు. 14 40 లక్షల ఖర్చుతో 20,000 ఎకరాల ప్రాంతంలో తెగుళ్ళ నివారణకు యీ పథకం అమలుజరుపుతున్నామని అన్నారు ఈ ఖర్చులో కేంద్రప్రభుత్వ 50 శాతం, రాష్ట్ర ప్రభుత్వం 25 శాతం, మిగతా 25 శాతం రైతులు భరిస్తారని వెల్లడించారు

తిరుపతిలో గ్రుడ్ల మార్కెటు కేంద్రం స్థాపనకు విజ్ఞప్తి

వ్యవసాయశాఖ మంత్రి శ్రీ కాకాని వెంకటరత్నం యిటీవల తిరుపతి సందర్శించిన సందర్భంలో, చంద్రగిరి తాలూకులో కోళ్ల పెంపకం అభివృద్ధినిగూర్చి సమీక్షించారు పెరుగుతున్న అవసరాలను ఆదుకోవడానికి వీలుగా యీ పరిశ్రమను పెంపొందించాల్సిన అవసరాన్ని గూర్చి ఆయన చెప్పారు

శ్రీ ఎన్ నారాయణస్వామి ప్రసంగిస్తూ కోళ్ల పెంపకందార్లకు లాభించే విధంగా తిరుపతిలో గుడ్ల మార్కెటింగ్ కేంద్రం, గుడ్ల పొడి పరిశ్రమను నెలకొల్పాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు



కుటుంబ నియంత్రణ కార్యక్రమం అమలులో విజయం సాధించినందుకు (1968–69) ఖమ్మం బి డి ఓ కు కలెక్టరు శ్రీ ప్రేమరాజ్ మాథుర్ బహుమతి ప్రదానం చేశారు

మహాత్మాగాంధీ విగ్రహం ఆవిష్కరణ

చిన్నతరహా నీటిపారుదల శాఖామంత్రి శ్రీ వి పురుషోత్తమరెడ్డి, చింతపల్లి పంచాయితీ సమితిలోని చేపూరు గ్రామంలో మహాత్మాగాంధీ విగ్రహాన్ని ఆవిష్కరిస్తూ అహింసద్వారా పరదేశ పాలననుండి భారతదేశానికి విముక్తి కలిగించిన అపూర్వమైన ఆయన స్మృతికి జోహార్లు అర్పించారు

జిల్లా పరిషత్తు అధ్యక్షుడు శ్రీ కె. రంగారెడ్డి ప్రసంగిస్తూ నల్లగొండ జిల్లాలోని వెనుకబడిన ప్రాంతాలకు లిఫ్ట్ ఇరిగేషన్ పథకాలను మంజూరు చేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తిచేశారు.

ఒంగోలులో పాల ప్రాజెక్టు

వ్యవసాయ శాఖామంత్రి శ్రీ కాకాని వెంకటరత్నం, ఒంగోలులో బహిరంగసభలో ప్రసంగిస్తూ ఒంగోలులో త్వరలోనే రు 10 లక్షల ఖర్చుతో పాల ప్రాజెక్టును ప్రారంభించడం జరుగుతుందని వెల్లడించారు కొత్తగా ఏర్పాటైన ఒంగోలు జిల్లా అభివృద్ధికి ప్రభుత్వం, ప్రజా ప్రతినిధులు నిర్విరామంగా కృషిచేయాలని మంత్రి విజ్ఞప్తిచేశారు

నెల్లూరులో కోళ్ళమార్కెటింగ్ కేంద్రం

వ్యవసాయ శాఖామంత్రి శ్రీ కాకాని వెంకటరత్నం, నెల్లూరు జిల్లా ముదివర్తి గ్రామంలో రైతుల సమావేశంలో జిల్లా పరిషత్తు అధ్యక్షుడు శ్రీ ఎం గోపాలకృష్ణారెడ్డి అందజేసిన విజ్ఞాపన పత్రానికి సమాధానమిస్తూ గుడ్లు, కోళ్ళ మార్కెటింగ్‌కు నెల్లూరులో ఒక కోళ్ళ మార్కెటింగ్ కేంద్రాన్ని నాయుడుపేట, సూళ్ళూరుపేట ప్రాంతాలలో ఉప కేంద్రాలతోసహా నాయుడుపేటలో కీలకగ్రామ కేంద్రాన్ని నెలకొల్పుతామని చెప్పారు

వెనుకబడిన ప్రాంతాలైన ఆత్మకూరు, ఉదయగిరి, సూళ్ళూరుపేట తాలూకాలలో అధిక సంఖ్యలో పశువైద్య సంస్థలు ఉండాలని మంత్రి అన్నారు

కీలకగ్రామ కేంద్రానికి అవసరమైన యంత్ర పరికరాలు యితర అవసరాల నిమిత్తం రు 20,000/– లు విరాళంగా యిస్తానని శ్రీ పి గురువప్పచెట్టి వాగ్దానం చేశారు

తిరుమలలో చేతి పరిశ్రమ వస్తువుల విక్రయశాలకు ప్రారంభోత్సవం

రాష్ట్ర లఘుపరిశ్రమల శాఖామంత్రి, శ్రీ జి సి వెంకన్న యిటీవల తిరుమల కొండలపై చేతి పరిశ్రమ వస్తువుల విక్రయ శాలకు ప్రారంభోత్సవం చేశారు ఈ సందర్భంగా ఆయన ప్రసంగిస్తూ రాష్ట్రంలో సంప్రదాయక హస్తకళలను పునరుద్ధరించడానికి లఘుపరిశ్రమలను పెంపొందించాల్సిన అవసరాన్నిగూర్చి నొక్కి చెప్పారు ప్రస్తుత సంవత్సరంలో ప్రణాళికా పథకాలక్రింద రు 6 9 లక్షల్ని, ప్రణాళికేతర పథకాలక్రింద రు 7 95 లక్షలను రాష్ట్ర ప్రభుత్వం కేటాయించిందని ఆయన పేర్కొన్నారు

రాష్ట్ర ప్రభుత్వం, రాష్ట్రంలో 7 విక్రయశాలలను, కొత్త ఢిల్లీలో ఒక విక్రయశాలను నిర్వహిస్తున్నదని మంత్రి అన్నారు.

విజయవాడ, విశాఖపట్నంలలో రెండు విక్రయశాలలు నిర్మించడానికి వరుసగా రు 90,000, రు 1.22 లక్షలను రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసిందని ఆయన వెల్లడించారు

నిజామాబాద్‌లో వరిపంట తెగులు నివారణకు విమానంద్వారా మందులుచల్లే కార్యక్రమం

నిజామాబాదు జిల్లాలో సుమారు 50,000 ఎకరాలపైన వరిపంట తెగులును అరికట్టేందుకు విమానంద్వారా మందులుచల్లే కార్యక్రమానికి వ్యవసాయశాఖమంత్రి శ్రీకాకాని వెంకటరత్నం సెప్టెంబరు 10 న ప్రారంభోత్సవంచేశారు

నిజామాబాదు జిల్లాలో రైతులు, ఆధునిక సేద్య పద్ధతులు అవలంభిస్తూ, భారీయెత్తున విమానంద్వారా మందులు చల్లించే ఏర్పాట్లు చేయడానికి ముందుకు వస్తున్నందుకు మంత్రి రైతులను అభినందించారు

విమానంద్వారా మందులు చల్లడానికి అయ్యే ఖర్చును భరించడానికి భారత ప్రభుత్వం అంగీకరించింది క్రిమి సంహారక మందుల కొరకు రాష్ట్రప్రభుత్వం 50 శాతం సబ్సిడీ ఇస్తుంది మిగతాభాగాన్ని రైతులు భరించవలసి వుంటుంది

ఖానాపూర్‌లో ఉన్నత పాఠశాల భవనానికి ప్రారంభోత్సవం

పంచాయతీరాజ్ శాఖామంత్రి శ్రీ తోట రామస్వామి సెప్టెంబరు 6 వ తేదీన ఖానాపూర్‌లో రు. 60,000 ల ఖర్చుతో నిర్మింపబడిన ఉన్నత పాఠశాల నూతన భవనానికి ప్రారంభోత్సవంచేశారు ఈసందర్భంగా జరిగిన సభలో ఆయన ప్రసంగిస్తూ విద్యార్థులు, రాజకీయాలు, సమ్మెలలో పాల్గొనడంవల్ల వారి భవిష్యత్తు దెబ్బతింటుందని హెచ్చరించారు జిల్లా పరిషత్తు ఉపాధ్యక్షుడు శ్రీ ఆర్ బాపూ సభకు అధ్యక్షత వహించారు

గుంటూరులో తుఫాను బాధితుల సహాయార్థం రూ. 8.5 కోట్లు ఖర్చు

గుంటూరులో పల్లపు ప్రాంతాలలో తుఫాను దెబ్బకు గురియైన ప్రజలకు సహాయం చేయడానికి రూ 8 5 కోట్లు ఖర్చు పెట్టడం జరిగిందని జిల్లా కలెక్టరు శ్రీ యం వెంకటరత్నం చెప్పారు త్వరలోనే మరొక 3,000 ఇండ్లు నిర్మించడం జరుగుతుందనికూడా ఆయన చెప్పారు



వ్యవసాయ శాఖామాత్యులు శ్రీ కాకాని వెంకటరత్నం ఆగస్టు 13న మహబూబ్‌నగర్‌జిల్లా కడర్తల్‌లో పాల శీతల కేంద్రానికి శంకుస్థాపన చేశారు

గత సంవత్సరం 13,000 మంది విద్యావంతులైన నిరుద్యోగులకు ఉద్యోగాలు ఇవ్వబడినాయని, 157 పరిశ్రమలు స్థాపించబడినాయని, నాగార్జునసాగర్ ఆయకట్టులో అనేక వ్యావసాయక పరిశ్రమలు నెలకొల్పబడగలవని కలెక్టరు తమ ఆశాభావం వెల్లడించారు అగ్నిగుండాల సీసం ప్రాజెక్టులో ప్రాథమిక పని కొనసాగుతున్నది ఇందుకొరకు ఒక స్పెషల్ ఆఫీసరు నియమించబడినారు రు 200 కోట్ల అగ్నిగుండాల సీసం—రాగి ప్రాజెక్టు పూర్తి అయినప్పుడు జిల్లా రూపురేఖలు పూర్తిగా మారిపోగలవని కలెక్టరు చెప్పారు

జిల్లా ఆర్థికాభివృద్ధికై ప్రజలు కష్టపడి పనిచేయాలని ఆయన ఉద్బోధించారు 1968–69లో పొన్నూరు పంచాయతీ సమితి కుటుంబ నియంత్రణ విషయంలో ప్రశంసనీయమైన ప్రగతి సాధించినందుకు, ఆ సమితి ప్రెసిడెంటు శ్రీ యం హనుమంతరావుకు కలెక్టరు రూ 300ల నగదు బహుమతిని, ఒక ట్రోఫీని బహూకరించారు

జిల్లా పరిషత్తు అధ్యక్షులు శ్రీ యం నాగేశ్వరరావు కూడా ప్రసంగించారు

కుటుంబ నియంత్రణ తీవ్రతర ప్రచారం

చిత్తూరు జిల్లా మదనపల్లి బ్లాకులో అసిస్టెంటు కలెక్టరు శ్రీ ఎస్ కె పచౌరి యిటీవల కుటుంబ నియంత్రణ, ప్రణాళికా ప్రచారం గూర్చిన తీవ్రతర ప్రచార కార్యక్రమానికి ప్రారంభోత్సవం చేశారు బి కొత్తకోట, కురబాలకోట, కోసువారిపల్లి, చిన్న తిప్ప సముద్రం, రెడ్డివారిపల్లి పంచాయతీ సమితులలో యీ ప్రచార కార్యక్రమాన్ని అమలు జరుపుతున్నారు కడపలోని

క్షేత్ర ప్రచార డైరెక్టొరేటు విభాగం నిర్వహించే కుటుంబ నియంత్రణ సమాజాభివృద్ధి విషయాలపై బుర్రకథ కార్యక్రమం కూడా యిందులో ఒక భాగం

శాసనసభ్యుడు శ్రీ ఎ నర్సింగరావు ప్రసంగిస్తూ, ప్రభుత్వం అమలు జరుపుతున్న వివిధ అభివృద్ధి పథకాల ద్వారా ప్రయోజనం పొందాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు

బెస్తల కాలనీకి శంకుస్థాపన

తూర్పు గోదావరి జిల్లా కలెక్టరు ఆగస్టు 18 న ఉప్పాడ గ్రామంలో జాలరుల కాలనీకి శంకుస్థాపన చేశారు. తుఫాను బాధితుల సహాయార్థం, జాలరుల కొరకు ఇక్కడ ఇండ్లు నిర్మించబడుతాయి


ఉప్పాడ తీర ప్రాంతంలో 270 ఇండ్లు నిర్మించబడుతాయని కలెక్టరు చెప్పారు ప్రతి ఇల్లుకూ రూ 1,000 ఖర్చు అవుతుంది తుఫాను బాధితుల సహాయ నిధినుంచి ఒక్కొక్క ఇంటికి రూ. 500 లు ఇవ్వబడుతాయి మిగిలిన మొత్తం స్వచ్ఛంద సేవాసంస్థలు సేకరించిన నిధినుంచి ఇవ్వబడుతుందని ఆయన తెలిపారు శ్రమదానం చేసి ఇండ్ల నిర్మాణం పూర్తిచేయవలసిందని కలెక్టరు జాలరులకు విజ్ఞప్తి చేశారు ఈ సందర్భంలో ఏర్పాటైన బహిరంగ సభకు కాకినాడ లయన్సు క్లబ్బు అధ్యక్షులు శ్రీ డి వి రామారావు అధ్యక్షత వహించారు

శాసన సభ్యులు శ్రీ సి హెచ్ వెంకటరత్నం ప్రసంగిస్తూ, జిల్లాలో సంక్షేమ కార్యక్రమాలు అమలు జరపడానికి కలెక్టరు చొరవతీసుకొని కృషిచేస్తున్నందుకు ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు తీర ప్రాంతంలో కమ్యూనికేషనులను అభివృద్ధిపరచినట్లయితే సముద్రపు చేపల రవాణా సులభమవుతుందని ఆయన కలెక్టరుకు చెప్పారు

విద్యుచ్ఛక్తి సరఫరాకు ప్రారంభోత్సవం

చేనేత శాఖామంత్రి శ్రీ పి భగవంతరావు ఇటీవల దొడ్లేరు గ్రామంలో వీధి లైట్లకు ప్రారంభోత్సవం జరుపుతూ శ్రీశైలం జలవిద్యుచ్ఛక్తి ప్రాజెక్టు పూర్తిఅయిన తరువాత రాష్ట్రంలో 60 గ్రామాలకు విద్యుచ్ఛక్తి సరఫరా చేయడం జరుగుతుందని చెప్పారు వ్యవసాయోత్పత్తికి విద్యుచ్ఛక్తిని వినియోగించాలని ఆయన ఉద్బోధించారు ప్రజలు తరలి వెళ్ళకుండా గ్రామాల్లోనే వృత్తి పనులు కొనసాగించడానికి గాను ప్రభుత్వం సౌకర్యాలు కల్పించేందుకు ప్రయత్నం చేస్తున్నదని తెలిపారు శాసనసభ్యులు శ్రీ జి రామస్వామి రెడ్డి ప్రసంగిస్తూ గ్రామాభ్యుదయానికి ప్రజలు ఐక్యతతో కృషిచేయాలని విజ్ఞప్తి చేశారు

రాజుపాలెం సమితి అధ్యక్షులు శ్రీ వై నాగిరెడ్డి ఈ సభకు అధ్యక్షత వహించారు



అనంతపురం జిల్లా, ధర్మవరం తాలూకా కునుతూరు గ్రామంలో ఆగస్టు నెలలో, హైదరాబాదులోని సంచార ఆహార, పోషక పదార్థ విభాగంవారు ప్రదర్శన ఏర్పాటు చేశారు

రెంటచింతలలో సహకార చక్కెర ఫ్యాక్టరి

ఇటీవల చేనేత, సహకార చక్కెర మిల్లుల శాఖామంత్రి శ్రీ పి భగవంతరావు సత్తెనపల్లిలో జరిగిన బహిరంగ సభలో మాట్లాడుతూ రెంటచింతలలో త్వరలో ఒక సహకార చక్కెర ఫ్యాక్టరీ ఆరంభించబడుతుందని, దానికి కేంద్ర ప్రభుత్వ మంజూరీ లభించిందని తెలిపారు

గ్రామీణ గృహనిర్మాణ ప్రాజెక్టు క్రింద ఇండ్లు నిర్మించడానికి కేంద్ర ప్రభుత్వం రూ 36 కోట్లు ఖర్చు పెడుతుందని మంత్రి చెప్పారు మన రాష్ట్రానికి కేంద్ర ప్రభుత్వం 12,400 పవర్ మగ్గాలు మంజూరీ చేసింది ఈ పవర్‌మగ్గాలు మహారాష్ట్ర, కేరళ, మద్రాసు రాష్ట్రాలలో సక్రమంగా పనిచేస్తున్నాయి మన రాష్ట్రంలో కూడా వీటిని లాభసాటిగా ఉపయోగించాలని మంత్రి చెప్పారు అమ్ముడుపోని చేనేత వస్త్రాల నిలవలకు రాష్ట్ర ప్రభుత్వం రూ 30 లక్షల సబ్సిడీ మంజూరు చేసిందనీ, ఇదివరకే రూ 16 లక్షలు విడుదల అయినాయనీ ఆయన తెలిపారు ఫిరంగిపురం, రాజుపాలెం సమితి అధ్యక్షులు కూడా ప్రసంగించారు

చిత్తూరులో భూముల పంపిణీ

భూమి పంపిణీ తీవ్రతర పథకం క్రింద చిత్తూరు జిల్లాలో యింతవరకు 73,210 ఎకరాల భూమిని 28,468 మందికి పంపిణీ చేశారు

జిల్లాలోని అనేక తాలూకాలలో పంపిణీ నిమిత్తం 58,552 ఎకరాల భూమి లభ్యమవుతుంది



1968–69లో కుటుంబ నియంత్రణ కార్యక్రమం అమలులో సాధించిన విజయాలకుగాను హనుమకొండ పంచాయతీ సమితి అధ్యక్షులు శ్రీ యస్ సత్యనారాయణకు వరంగల్లు జిల్లాకలెక్టరు శ్రీ కె. ఆర్ వేణుగోపాల్ బహుమతి ప్రదానం చేశారు

సమితి అధ్యక్షుని దాతృత్వం

పశ్చిమ గోదావరి జిల్లా, నల్లజర్ల పంచాయతీ సమితి అధ్యక్షుడు, శ్రీ కె శ్రీనివాసరావు, తమ స్వంతడబ్బుతో 1969–70 సంవత్సరంలో సమితిలోని ఉత్తమ పాఠశాలలకు రొక్కం బహుమతులు అందజేయడానికి ప్రత్యేక పథకాన్ని ప్రవేశపెట్టారు

హరిజన దినోత్సవం

కర్నూలుజిల్లా వడ్డెమాను గ్రామంలో ఆగస్టు 30వ తేదీన హరిజన దినోత్సవం జరుపబడింది పరిశుభ్రమైన గృహము, ఆరోగ్యవంతమైన పసిబాలుర పోటీలు, ప్రాథమిక పాఠశాల బాలబాలికలకు ఆటలలో పోటీలు జరుపబడినవి

బహిరంగ సభకు శ్రీ మద్దూరు సుబ్బారెడ్డి యం. ఎల్ సి గారు అధ్యక్షత వహించారు సమితి అధ్యక్షులు శ్రీ బి తిమ్మారెడ్డిగారు తమ ఉపన్యాసంలో హరిజన దినోత్సవ కార్యక్రమ ప్రాముఖ్యతను గూర్చి తెలిపారు

అనంతపురం జిల్లాలో కరువు నివారణ చర్యలు

అనంతపురంలో జిల్లా కలెక్టరు శ్రీ యల్ సుబ్బయ్య, సంజీవరెడ్డి స్టేడియంలో ఆగస్టు 15వ తేదీన ప్రసంగిస్తూ దేశ ప్రజలందరూ సమైక్యతతో మెలగాలనీ, జాతీయ సమైక్యతకు కృషిచేయాలని ఉద్బోధించారు.

అటవీశాఖలో పనిచేస్తున్న ఉద్యోగులు కొందరు తమ విధి నిర్వహణలో ధైర్యసాహసాలు ప్రదర్శించినందుకు వారికి కలెక్టరు నగదుబహుమతులు పంచిపెట్టారు కుటుంబనియంత్రణ విషయంలో గణనీయమైన కృషిచేసినందుకు రాయదుర్గ పంచాయతీ సమితి ఒక ట్రోఫీనీ, రూ 300 ల బహుమతిని ప్రకటించింది దుద్దెకుంట గ్రామపంచాయతి రు 300ల నగదు బహుమతిని గెలుచుకొంది రొద్దం హెల్తు ఇన్స్పెక్టరు శ్రీ యం రామప్పకు రూ 200 లు, ఒక బంగారు పతకం బహుమతిగా ఇవ్వబడినవి పామిడికి చెందిన శ్రీ కె. ఓబులేశు, రూ 100 లను, వెండి కప్పు బహుమతిగా పొందారు.

వెనుకబడ్డ తరగతుల వారికి ఖరీఫ్ ప్రణాళిక


ఆదిలాబాదులోని ఖానాపూరు పంచాయతీ ఖరీఫ్‌సమితి ప్రణాళికను విజయవంతంగా అమలుపరుస్తున్నది రైతులకు సకాలంలో మేలురకం విత్తనాలు, రసాయనిక ఎరువులు వగైరా సరఫరా చేయబడినాయి ఇంతవరకు రూ 6,500 ల మేరకు రైతులకు రుణాలు మంజూరుచేయడం జరిగింది ఈ రుణాలు తీసుకొన్న వారిలో 60 శాతం మంది రైతులు వెనుకబడిన తరగరుతులకు షెడ్యూలు కులాలకు చెందినవారువున్నారు

నెల్లూరులో 36091 ఎకరాల పంపిణీ

నెల్లూరుజిల్లా కలెక్టరు శ్రీ యం వీరరాఘవన్ ఆగస్టు 15వ తేదీన ప్రసంగిస్తూ 1969 నవంబరులో భూముల పంపిణీ కార్యక్రమం ఆరంభమైన తరువాత జిల్లాలో ఇంతవరకు హరిజనులకు గిరిజనులకు మొత్తం 18,413 ఎకరాలు పంపిణీచేయడం జరిగిందనీ, భూములేని పేదప్రజలకు కూడా భూములు పంచిపెట్టబడినాయనీ తెలిపారు ఇంతవరకు మొత్తం 36091 ఎకరాలు పంచిపెట్టబడినాయి ఈ కార్యక్రమంవల్ల 33492 మందికి భూములు లభించాయి

ఖానాపూరు సమితికి కుటుంబ నియంత్రణ బహుమతి

అదిలాబాదు జిల్లాలో 1968–69 సంవత్సరంలో కుటుంబ నియంత్రణ విషయంలో ప్రశంసనీయమైన కృషిచేసినందుకు ఆ జిల్లాలోని ఖానాపూరు సమితి రూ 300 ల ప్రథమ బహుమతి గెలుచుకొంది ఆ సమితి బి డి ఓ శ్రీ బి నర్సింగరావు కుటుంబ నియంత్రణకొరకు అవిరళ కృషిచేసిన కారణాన ఆయా సేవలను పరిగణించి ఆయనకు రూ 100 ల నగదు బహుమతి, ఒక వెండి కప్పు బహుమతిగా ఇవ్వడం జరిగింది



తెనాలి బస్సుస్టాండులో వున్న, స్వాతంత్ర్య సమరం మృత వీరుల స్మారక చిహ్నాల దృశ్యం.

గిరిజన ప్రాంతాల అభివృద్ధికి రూ. 2 కోట్లు కేటాయింపు

శ్రీకాకుళంలోని మునిసిపాల్ మైదానంలో బహిరంగ సభలో ఇన్‌ఛార్జి కలెక్టరు శ్రీ పి. వి. రావు ప్రసంగిస్తూ దేశం, రాష్ట్రంతోపాటు శ్రీకాకుళం జిల్లాకూడా అభివృద్ధి పథంలో పురోగమిస్తున్నదని చెప్పారు.

గత సంవత్సరం 5300 ఎకరాలలో మేలురకం విత్తనాలు వేసిపంటలు పండించడం జరిగింది. 1000 చిన్నతరహా నీటి వనరులను పునరుద్ధరించడం జరిగింది. వెనుకబడిన ప్రాంతమైన మందసలో సహకార చక్కెర ఫ్యాక్టరీ స్థాపించబడింది. గత సంవత్సరం ఆఖరు వరకు 404 గ్రామాలకు విద్యుచ్ఛక్తి సరఫరా కార్యక్రమం అమలుపరచబడింది. 54000 ఎకరాల భూమి, బీద హరిజనులకు పంచిపెట్టడం జరిగిందని శ్రీ పి. వి. రావు చెప్పారు.

కరీంనగర్‌లో 12673 ఎకరాల భూమి పంపిణీ

కరీంనగర్‌లో ఆగస్టు 15వ తేదీన జరిగే బ్రహ్మాండమైన బహిరంగ సభలో కలక్టర్ ఇన్చార్జి శ్రీ ఎన్. వెంకట్రామయ్య ప్రసంగిస్తూ గత సంవత్సరం జిల్లాలో జరిగిన అభివృద్ధిని గూర్చి వివరించారు. ఈ సంవత్సరం కూడా అదేస్థాయిలో అభివృద్ధిని సాధించడానికి దీక్షబూనాలని ఆయన ప్రజలకు విజ్ఞప్తిచేశారు.

1968-69 వ సంవత్సరానికి సంబంధించిన కుటుంబ నియంత్రణ జిల్లాస్థాయి బహుమతిని ఉత్తమ సమితిగా నిర్ణయించబడిన హుజూరాబాదు పంచాయతీ సమితికి అందజేయబడింది.

నల్లగొండలో లీడ్ బ్యాంక్

నల్లగొండ జిల్లా కలక్టరు శ్రీ రమేశ్ గ్రోవర్, యిటీవల నల్లగొండలో స్టేట్ బ్యాంకు ఆఫ్ హైదరాబాదు నిర్వహిస్తున్న లీడ్ బ్యాంకు పథకానికి ప్రారంభోత్సవం చేశారు.

తెలంగాణాలో ప్రప్రథమంగా లీడ్ బ్యాంకు పథకాన్ని అమలు జరపడానికి నల్లగొండను ఎన్నిక చేసినందుకు స్టేట్ బ్యాంకు ఆఫ్ హైదరాబాదును కలక్టరు అభినందించారు. పరపతి సౌకర్యాలు లోపించిన ప్రాంతాలను తెలుసుకోవడానికి జిల్లాలో జరిపే సాంకేతిక ఆర్థిక సర్వే కార్యక్రమంలో అవసరమైన సహాయాన్ని అందజేస్తామని కలక్టరు హామీయిచ్చారు.

ఆదిలాబాదు జిల్లాలో 55,366 ఎకరాల పంపిణీ

ఆదిలాబాదు కలెక్టరు శ్రీ అల్లాయార్‌ఖాన్ ఆదిలాబాదు పోలీసు పెరేడు మైదానంలో జరిగిన బ్రహ్మాండమైన బహిరంగ సభలో ప్రసంగిస్తూ, స్వాతంత్ర్యం వచ్చిన తరువాత దేశంలో వ్యవసాయం, పరిశ్రమలు, విద్య, నీటి వనరులు, విద్యుచ్ఛక్తి రంగాలలో జరిగిన ప్రగతిని గూర్చి మాట్లాడారు.

జిల్లాలో జరిగిన అభివృద్ధి కార్యక్రమాలను గురించి కలెక్టరు ప్రస్తావిస్తూ, గత సంవత్సరం ప్రభుత్వం మంజూరీచేసిన కోటి రూపాయలలో రూ 94 లక్షలు రోడ్ల అభివృద్ధి, స్కూలు భవనాలు, సామాజిక మందిరాలు, సేద్యపుబావులు, త్రాగునీటి పథకాలు, గ్రామీణ విద్యుచ్ఛక్తి సరఫరా పథకాలు మున్నగువాటికి ఖర్చుచేయడం జరిగిందని చెప్పారు. 1970 జూలై నాటికి జిల్లాలో భూములులేని బీదప్రజలకు 55, 366 ఎకరాలు భూమి పంపిణీ అయ్యిందని చెప్పారు. మరొక 5, 37, 000 ఎకరాలు త్వరలో పంపిణీ చేయబడుతాయని ఆయన చెప్పారు.

బాలభవన్‌కు ప్రారంభోత్సవం

నల్లగొండ మహిళా క్లబ్ అధ్యక్షురాలు శ్రీమతి శారదా ఆర్. గ్రోవర్ 29-8-70 తేదీన బాలభవన్‌కు ప్రారంభోత్సవం చేశారు. రూ 70,000 ల ఖర్చుతో యీ భవనం నిర్మించబడుతున్నది.

సమావేశానికి అధ్యక్షత వహించిన జిల్లా కలక్టరు, శ్రీ రమేశ్‌గ్రోవర్ ప్రసంగిస్తూ 1961 లో శిశు సంక్షేమ జిల్లా మండలి ప్రారంభించబడిందనీ, శిశు సంక్షేమాన్ని పెంపొందించడం, బాలల నైతిక శారీరక అభివృద్ధికి కృషిచేసే ప్రధాన లక్ష్యాలతో యీ మండలి కృషిచేస్తున్నదనీ అన్నారు.

ఆంధ్రప్రదేశ్ సంక్షేమ నిధినుండి భవన నిర్మాణానికి రు. 25,000 లు విరాళంగా యిచ్చారు.

బ్యాంకుల జాతీయకరణపై చర్చాగోష్ఠి

శ్రీకాకుళంలో సెప్టెంబరు 1న ప్రాంతీయ గ్రంథాలయం, క్షేత్ర ప్రచారశాఖ కలసి బ్యాంకుల జాతీయకరణపై ఒక చర్చాగోష్ఠిని ఏర్పాటు చేశాయి. ఈ సందర్భంలో గుంటూరులోని యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా చీఫ్ ఏజెంటు శ్రీ వై. యన్. హెగ్డే ప్రసంగిస్తూ శ్రీకాకుళం జిల్లాలో గిరిజన ప్రాంతాలలో ఏర్పాటుచేసిన ఈ బ్యాంకు శాఖలు సంతృప్తికరంగా పనిచేస్తున్నా

రాష్ట్ర ప్రభుత్వం, రాష్ట్రంలో 7 విక్రయశాలలను, క్రొత్త ఢిల్లీలో ఒక విక్రయశాలను నిర్వహిస్తున్నదని మంత్రి అన్నారు

విజయవాడ, విశాఖపట్నంలలో రెండు విక్రయశాలలు నిర్మించడానికి వరుసగా రు 90,000, రు 1 22 లక్షలను రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసిందని ఆయన వెల్లడించారు

నిజామాబాద్‌లో వరిపంట తెగులు నివారణకు విమానంద్వారా మందులు చల్లే కార్యక్రమం

నిజామాబాదు జిల్లాలో సుమారు 50,000 ఎకరాలపైన వరిపంట తెగులును అరికట్టేందుకు విమానంద్వారా మందులు చల్లే కార్యక్రమానికి వ్యవసాయశాఖమంత్రి శ్రీ కాకాని వెంకటరత్నం సెప్టెంబరు 10 న ప్రారంభోత్సవం చేశారు

నిజామాబాదు జిల్లాలో రైతులు, ఆధునిక సేద్య పద్ధతులు అవలంబిస్తూ, భారీయెత్తున విమానంద్వారా మందులు చల్లించే ఏర్పాట్లు చేయడానికి ముందుకు వస్తున్నందుకు మంత్రి రైతులను అభినందించారు

విమానంద్వారా మందులు చల్లడానికి అయ్యే ఖర్చును భరించడానికి భారత ప్రభుత్వం అంగీకరించింది క్రిమి సంహారక మందుల కొరకు రాష్ట్రప్రభుత్వం 50 శాతం సబ్సిడీ ఇస్తుంది మిగతాభాగాన్ని రైతులు భరించవలసి వుంటుంది

ఖానాపూర్‌లో ఉన్నత పాఠశాల భవనానికి ప్రారంభోత్సవం

పంచాయతీరాజ్ శాఖామంత్రి శ్రీ తోట రామస్వామి సెప్టెంబరు 6 వ తేదీన ఖానాపూర్‌లో రు. 60,000 ల ఖర్చుతో నిర్మింపబడిన ఉన్నత పాఠశాల నూతన భవనానికి ప్రారంభోత్సవం చేశారు ఈసందర్భంగా జరిగిన సభలో ఆయన ప్రసంగిస్తూ విద్యార్థులు, రాజకీయాలు, సమ్మెలలో పాల్గొనడంవల్ల వారి భవిష్యత్తు దెబ్బతింటుందని హెచ్చరించారు జిల్లా పరిషత్తు ఉపాధ్యక్షుడు శ్రీ ఆర్ బాపూ సభకు అధ్యక్షత వహించారు

గుంటూరులో తుఫాను బాధితుల సహాయార్థం రూ. 8.5 కోట్లు ఖర్చు

గుంటూరులో పల్లపు ప్రాంతాలలో తుఫాను దెబ్బకు గురియైన ప్రజలకు సహాయం చేయడానికి రూ 8 5 కోట్లు ఖర్చు పెట్టడం జరిగిందని జిల్లా కలెక్టరు శ్రీ యం వెంకటరత్నం చెప్పారు త్వరలోనే మరొక 3,000 ఇండ్లు నిర్మించడం జరుగుతుందనికూడా ఆయన చెప్పారు



వ్యవసాయ శాఖామాత్యులు శ్రీ కాకాని వెంకటరత్నం ఆగస్టు 13న మహబూబ్‌నగర్ జిల్లా కడతల్‌లో పాల శీతల కేంద్రానికి శంఖుస్థాపన చేశారు

గత సంవత్సరం 13,000 మంది విద్యావంతులైన నిరుద్యోగులకు ఉద్యోగాలు ఇవ్వబడినాయని, 157 పరిశ్రమలు స్థాపించబడినాయని, నాగార్జునసాగర్ ఆయకట్టులో అనేక వ్యావసాయక పరిశ్రమలు నెలకొల్పబడగలవని కలెక్టరు తమ ఆశాభావం వెల్లడించారు అగ్నిగుండాల సీసం ప్రాజెక్టులో ప్రాథమిక పని కొనసాగుతున్నది ఇందుకొరకు ఒక స్పెషల్ ఆఫీసరు నియమించబడినారు రు 200 కోట్ల అగ్నిగుండాల సీసం–రాగి ప్రాజెక్టు పూర్తి అయినప్పుడు జిల్లా రూపురేఖలు పూర్తిగా మారిపోగలవని కలెక్టరు చెప్పారు

జిల్లా అర్థికాభివృద్ధికై ప్రజలు కష్టపడి పనిచేయాలని ఆయన ఉద్బోధించారు 1968–69లో పొన్నూరు పంచాయతీ సమితి కుటుంబ నియంత్రణ విషయంలో ప్రశంసనీయమైన ప్రగతి సాధించినందుకు, ఆ సమితి ప్రెసిడెంటు శ్రీ యం హనుమంతరావుకు కలెక్టరు రూ 300ల నగదు బహుమతిని, ఒక ట్రోఫీని బహూకరించారు

జిల్లా పరిషత్తు అధ్యక్షులు శ్రీ యం నాగేశ్వరరావు కూడా ప్రసంగించారు

కుటుంబ నియంత్రణ తీవ్రతర ప్రచారం

చిత్తూరు జిల్లా మదనపల్లి బ్లాకులో అసిస్టెంటు కలెక్టరు శ్రీ ఎస్ కె పచౌరి యిటీవల కుటుంబ నియంత్రణ, ప్రణాళికా ప్రచారం గూర్చిన తీవ్రతర ప్రచార కార్యక్రమానికి ప్రారంభోత్సవం చేశారు బి కొత్తకోట, కురబాలకోట, కోసువారిపల్లి, చిన్న తిప్ప సముద్రం, రెడ్డివారిపల్లి పంచాయతీ సమితులలో యీ ప్రచార కార్యక్రమాన్ని అమలు జరుపుతున్నారు కడపలోని

క్షేత్ర ప్రచార డైరెక్టరేటు విభాగం నిర్వహించే కుటుంబ నియంత్రణ సమాచారాభివృద్ధి విషయాలపై ఉద్ధృత కార్యక్రమం కూడా యిందులో ఒక భాగం.

శాసనసభ్యుడు శ్రీ ఎ. నర్సింగరావు ప్రసంగిస్తూ, ప్రభుత్వం అమలు జరుపుతున్న వివిధ అభివృద్ధి పథకాల ద్వారా ప్రయోజనం పొందాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

బెస్తల కాలనీకి శంకుస్థాపన

తూర్పు గోదావరి జిల్లా కలెక్టరు ఆగస్టు 18 న ఉప్పాడ గ్రామంలో జాలరుల కాలనీకి శంకుస్థాపన చేశారు. తుపాను బాధితుల సహాయార్థం, జాలరుల కొరకు ఇక్కడ ఇండ్లు నిర్మించబడుతాయి.


ఉప్పాడ తీర ప్రాంతంలో 270 ఇండ్లు నిర్మించబడుతాయని కలెక్టరు చెప్పారు. ప్రతి ఇల్లుకూ రూ. 1,000 ఖర్చు అవుతుంది తుఫాను బాధితుల సహాయ నిధినుంచి ఒక్కొక్క ఇంటికి రూ. 500 లు ఇవ్వబడుతాయి. మిగిలిన మొత్తం స్వచ్ఛంద సేవాసంస్థలు సేకరించిన నిధినుంచి ఇవ్వబడుతుందని ఆయన తెలిపారు. శ్రమదానంచేసి ఇండ్ల నిర్మాణం పూర్తిచేయవలసిందని కలెక్టరు జాలరులకు విజ్ఞప్తి చేశారు ఈ సందర్భంలో ఏర్పాటైన బహిరంగ సభకు కాకినాడ లయన్సు క్లబ్బు అధ్యక్షులు శ్రీ డి. వి. రామారావు అధ్యక్షత వహించారు.

శాసన సభ్యులు శ్రీ సి. హెచ్. వెంకటరత్నం ప్రసంగిస్తూ, జిల్లాలో సంక్షేమ కార్యక్రమాల అమలు జరపడానికి కలెక్టరు చొరవతీసుకొని కృషిచేస్తున్నందుకు ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు. తీర ప్రాంతంలో కమ్యూనికేషనులను అభివృద్ధిపరచినట్లయితే సముద్రచేపల రవాణా సులభమవుతుందని ఆయన కలెక్టరుకు చెప్పారు.

విద్యుచ్ఛక్తి సరఫరాకు ప్రారంభోత్సవం

చేనేత శాఖామంత్రి శ్రీ ఏ. భగవంతరావు ఇటీవల దొడ్డేరు గ్రామంలో వీధి లైట్లకు ప్రారంభోత్సవం జరుపుతూ శ్రీశైలం జలవిద్యుచ్ఛక్తి ప్రాజెక్టు పూర్తిఅయిన తరువాత రాష్ట్రంలో 60 గ్రామాలకు విద్యుచ్ఛక్తి సరఫరా చేయడం జరుగుతుందని చెప్పారు. వ్యవసాయోత్పత్తికి విద్యుచ్ఛక్తిని వినియోగించాలని ఆయన ఉద్బోధించారు. ప్రజలు తరలి వెళ్ళకుండా గ్రామాల్లోనే వృత్తి పనులు కొనసాగించడానికి గాను ప్రభుత్వం సౌకర్యాలు కల్పించేందుకు ప్రయత్నం చేస్తున్నదని తెలిపారు. శాసనసభ్యులు శ్రీ జి. రామస్వామి రెడ్డి ప్రసంగిస్తూ గ్రామాభ్యుదయానికి ప్రజలు ఐక్యతతో కృషిచేయాలని విజ్ఞప్తి చేశారు.

రాజుపాలెం సమితి అధ్యక్షులు శ్రీ వై. నాగిరెడ్డి ఈ సభకు అధ్యక్షత వహించారు.



అనంతపురం జిల్లా, ధర్మవరం తాలూకా కునుతూరు గ్రామంలో ఆగస్టు నెలలో, హైదరాబాదులోని సంచార ఆహార, పోషక పదార్థ విభాగంవారు ప్రదర్శన ఏర్పాటు జేశారు.

రెంటచింతలలో సహకార చక్కెర ఫ్యాక్టరి


ఇటీవల చేనేత, సహకార చక్కెర మిల్లుల శాఖామంత్రి శ్రీ ఏ. భగవంతరావు సత్తెనపల్లిలో జరిగిన బహిరంగ సభలో మాట్లాడుతూ రెంటచింతలలో త్వరలో ఒక సహకార చక్కెర ఫ్యాక్టరీ ఆరంభించబడుతుందని, దానికి కేంద్ర ప్రభుత్వ మంజూరీ లభించిందని తెలిపారు.

గ్రామీణ గృహనిర్మాణ ప్రాజెక్టు క్రింద ఇండ్లు నిర్మించడానికి కేంద్ర ప్రభుత్వం రూ. 36 కోట్లు ఖర్చు పెడుతుందని మంత్రి చెప్పారు. మన రాష్ట్రానికి కేంద్ర ప్రభుత్వం 12,400 పవర్ మగ్గాలు మంజూరీ చేసింది. ఈ పవర్ మగ్గాలు మహారాష్ట్ర, కేరళ, మద్రాసు రాష్ట్రాలలో సక్రమంగా పనిచేస్తున్నాయి. మన రాష్ట్రంలో కూడా వీటిని లాభసాటిగా ఉపయోగించాలని మంత్రి చెప్పారు. అమ్ముడుపోని చేనేత వస్త్రాల నిలవలకు రాష్ట్ర ప్రభుత్వం రూ. 30 లక్షల సబ్సిడీ మంజూరు చేసిందనీ, ఇదివరకే రూ. 16 లక్షలు విడుదల అయినాయనీ ఆయన తెలిపారు. ఫిరంగిపురం, రాజుపాలెం సమితి అధ్యక్షులు కూడా ప్రసంగించారు.

చిత్తూరులో భూముల పంపిణీ

భూమి పంపిణీ తీవ్రతర పథకం క్రింద చిత్తూరు జిల్లాలో యింతవరకు 73,210 ఎకరాల భూమిని 28,468 మందికి పంపిణీ చేశారు.

జిల్లాలోని అనేక తాలూకాలలో పంపిణీ నిమిత్తం 58,552 ఎకరాల భూమి లభ్యమవుతుంది.



మహిళా సంక్షేమ, యాత్రికశాఖ మంత్రిణి శ్రీమతి రోడా మిస్త్రీ ఆగస్టు 23న లేపాక్షి దేవాలయం సందర్శించారు.

యని చెప్పారు. బ్యాంకులు జాతీయం చేయబడిన ఫలితంగా వ్యవసాయదారులకు, లఘుపరిశ్రమదారులకు చాల సహాయం లభిస్తున్నదనీ, ముఖ్యంగా బీదప్రజలకు ఈ బ్యాంకులు చాలా సహాయకారిగా వుంటున్నాయనీ చెప్పారు.

క్షేత్ర ప్రచారశాఖ ప్రాంతీయ అధికారి శ్రీ బి.యస్. మూర్తి ఈ చర్చాగోష్టికి అధ్యక్షత వహించారు.

గిరిజనులకు ఇండ్లస్థలాల కేటాయింపు

మహబూబునగర్ జిల్లా కలెక్టరు శ్రీ అసదుల్లా సయీద్ 56 హరిజన కుటుంబాలు, నాలుగు వెనుకబడిన తరగతులకు చెందిన కుటుంబాలకు ఇండ్లస్థలాల క్రింద 4023 ఎకరాల భూమిని పంచిపెట్టారు. 60 కుటుంబాలకు గృహనిర్మాణ సహాయంక్రింద ఒక్కొక్కదానికి రూ. 100 లు కూడా ఆయన పంచిపెట్టారు.

ఈ సందర్భంలో ఏర్పాటైన బహిరంగసభలో జిల్లాపరిషత్తు అధ్యక్షులు శ్రీ కె. కె. రెడ్డి ప్రసంగిస్తూ పిల్లలను సక్రమ మార్గంలో పెంచే విషయమై తలిదండ్రులు, ఉపాధ్యాయులు నిర్వహించవలసిన పాత్రను గురించి చెప్పారు.

చీపురుపల్లిలో 14000 ఎకరాల పంపిణీ

శ్రీకాకుళం జిల్లా, చీపురుపల్లి తాలూకాలో తీవ్రతర కార్యక్రమంక్రింద 14,000 ఎకరాల బంజరు భూమికి చెందిన 12,969 పట్టాలను పంపిణీ చేశారు. అందులో 2,953 మంది హరిజనులకు 3,146 ఎకరాలు, 191 మంది గిరిజనులకు 295 ఎకరాలు, 12 మాజీ సైనికులకు 38 ఎకరాలు, మిగతా 10,623 ఎకరాలు 9,813 మంది భూమిలేని పేదలకు పంపిణీ చేశారు.

1,600 ఎకరాల భూమి 1938 మంది ధనవంతులైన భూస్వాముల స్వాధీనంలో ఉండగా భూముల అక్రమ స్వాధీనం చట్టంక్రింద చర్యలు తీసుకొని పంటను వేలంవేసి రు. 2,476/- లను సేకరించారు. అంతేగాక ఆ భూమిని ప్రభుత్వం తిరిగి స్వాధీనం చేసుకుంది.

పబ్లిక్ స్కూలుకు గిరిజన బాలుర ఎన్నిక

1970 సంవత్సరంలో తెలంగాణా ప్రాంతంనుంచి 6 మంది గిరిజన బాలురను ఎన్నికచేసి వారిని హైదరాబాదు పబ్లిక్ స్కూలులో చేర్చడం జరిగింది. వీరిలో ఇద్దరు బాలురు (శ్రీ డి. యెర్రయ్య, శ్రీ వి. పి. రామనర్సయ్య) ఖమ్మం జిల్లా సూదిమళ్ళ పంచాయతీలోని జఫ్రాబాదు గ్రామానికి చెందినవారు. వీరు పబ్లిక్ స్కూలులో 6 వ తరగతిలో చేర్చుకోబడినారు.


ఈ ఇద్దరు బాలుర ప్రవేశం రుసుము ఇతర ఖర్చులకుగాను పంచాయతీ సమితి రూ. 3900 లు మంజూరు చేసింది. వీరు పబ్లిక్ స్కూలులో చదువు పూర్తి చేసేంతవరకు వారికయ్యే ఖర్చులన్నింటిని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ గిరిజన సంక్షేమశాఖ భరిస్తుంది.

బాపూజీ హరిజన కాలనీకి ప్రారంభోత్సవం

ఒంగోలుజిల్లా కలెక్టరు శ్రీ పి. కె. దొరైస్వామి ఇటీవల తంగుటూరులో బాపూజీ హరిజన కాలనీకి ప్రారంభోత్సవం చేశారు.

ఈ సందర్భంలో ప్రసంగిస్తూ ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాలను అమలుపరచడంలో సహకారం ఇవ్వవలసిందని హరిజనులను అభ్యర్థించారు. కాలనీలలో పారిశుద్ధ్యపుఏర్పాట్లు వుండాలనీ, స్థానిక స్కూలును అభివృద్ధి పరచాలనీ చెప్పారు.

కాలనీలలో 67 ఇండ్లు నిర్మించబడినాయి. వీటి నిర్మాణం కొరకు రూ. 96,000 ఖర్చు చేయడం జరిగింది. వరద బాధితులకు సహాయం క్రింద ప్రభుత్వం ఇచ్చిన గ్రాంటుతో ఈ గృహనిర్మాణ కార్యక్రమం అమలుపరచబడింది. ఇక్కడ స్కూలు భవనం కొరకు పంచాయతీ సమితి రూ. 15,000 లు ఖర్చుపెట్టింది.



రెవిన్యూ శాఖామాత్యులు శ్రీ పి. తిమ్మారెడ్డి ఆగస్టు 19 న నెల్లూరు జిల్లాపరిషత్‌హాల్లో జరిగిన లూరుజిల్లా రైతు మహాసభలో ప్రసంగించారు.

నగరంలో

ఉపాధ్యాయ అధ్యయన గోష్ఠికి ప్రారంభోత్సవం

విద్యాశాఖ డైరెక్టరు శ్రీ బి ప్రతాపరెడ్డి మలక్‌పేటలో ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఉపాధ్యాయ అధ్యయన గోష్ఠికి ప్రారంభోత్సవం జరుపుతూ రాష్ట్రంలో విద్యాపరిస్థితిని గూర్చి సమీక్షచేస్తూ వివరించి చెప్పారు అక్షరాస్యత ప్రగతి, విద్యా ప్రమాణాలు అసంతృప్తికరంగా వున్నవని చెప్పారు దారిల విద్యవిషయంలో ముఖ్యంగా ఉన్నత విద్యాస్థాయిలో రాష్ట్రం చాల వెనకబడివుందని ఆయన అన్నారు.

ఉపాధ్యాయులకు వసతి సౌకర్యాలు, పరికరాలు తగినంత సిబ్బంది లేకపోవడంవల్ల ఆయన సానుభూతి తెలిపారు. ఈ సమస్యలు రాష్ట్రమంతటికి సంబంధించినవి ఇట్టి సంస్థలను ప్రోత్సాహించిన ప్రజలు తగిన సహాయం చేయకపోవడం వల్ల ఇలాంటి సమస్యలు ఉత్పన్నమవుతున్నాయని విద్యాశాఖ డైరెక్టరు అన్నారు.

రిఫ్రెషర్ కోర్సులవంటి కార్యక్రమాల ద్వారా ఉపాధ్యాయులు మంచి జ్ఞానం సంపాదించుకోవాలని శ్రీ ప్రతాపరెడ్డి ఉద్బోధించారు విద్యా కార్యక్రమాలు విజయవంతంగా అమలు జరగాలంటే, ఉపాధ్యాయులు వహించేపాత్ర చాల ప్రధానంగా వుండగలదని ఆయన అన్నారు. ప్రభుత్వోద్యోగులతో పోల్చినట్లయితే ఉపాధ్యాయుల పరిస్థితి కొంత మెరుగ్గా వున్నదనీ, అన్ని స్థాయిలలో విద్యారంగంలో గురుతర బాధ్యతలు వహించడానికి తాను సదా సిద్ధంగావున్నాననీ ఆయన చెప్పారు.

ఈ గోష్ఠికి సమాచార, పౌరసంబంధ, యాత్రిక విషయాల శాఖ డైరెక్టరు శ్రీ పి. వామనరావు అధ్యక్షత వహించారు. ఈసందర్భంలో ఆయన ప్రసంగిస్తూ యువతరంవారి భవిష్యత్తును తీర్చిదిద్దడానికి ఉపాధ్యాయులు గురుతరబాధ్యత వహిస్తున్నారని చెప్పారు. నేడు ఉపాధ్యాయులకు గౌరవం కొంత తక్కువగా వున్నప్పటికి సత్ప్రవర్తన, విజ్ఞానముగల వ్యక్తిగత ఉపాధ్యాయులకు సంఘంలో గొప్ప గౌరవం వుంటున్నదని ఆయన అన్నారు ఉపాధ్యాయులు తాముచేస్తున్న కృషిలో పురోగమించాలంటే వారు నిరంతరం అధ్యయనం చేస్తూవుండాలి. ఈసందర్భంలో ఉపాధ్యాయ అధ్యయనగోష్ఠి చాల ఉపకరించగలదని ఆయన తమ ఆశాభావం వెల్లడించారు.

ఉపాధ్యాయ దినోత్సవాల సందర్భంలో జరిగిన పోటీలలో గెలుపొందినవారికి శ్రీమతి సుగుణా ప్రతాపరెడ్డి యోగ్యతాపత్రాలు పంచిపెట్టారు

హైస్కూలు విభాగంలో పిల్లల వ్రాతప్రతులు సంచికను శ్రీమతి సుశీలా వామనరావు ప్రారంభోత్సవంచేశారు.

సభా కార్యక్రమాలు ఆరంభంకావడానికి పూర్వం ప్రిన్సిపాలు శ్రీమతి యస్.రాజ్యలక్ష్మి అతిథులకు స్వాగతం చెబుతూ నివేదికచదివారు

అమూల్యమైన వ్రాతప్రతులను మైక్రో ఫిల్మ్ తీయడానికి రాష్ట్ర ప్రభుత్వ యోచన


విద్యాశాఖ మంత్రి శ్రీ పి వి నరసింహారావు, రాష్ట్ర పురాతత్త్వ సంచయన శాఖ డైరెక్టరు శ్రీ పి. సీతాపతితో పాటు ఆగస్టు 17 న తంజావూరులోని సరస్వతీ మహల్ గ్రంథాలయాన్ని సందర్శించారు. ఆ గ్రంథాలయ గౌరవ కార్యదర్శి శ్రీ కందస్వామి పిళ్లె మంత్రికి ప్రాచీన గ్రంథాలయ విశేషాలను చూపించారు

గ్రంథాలయంలో వున్న అముద్రితమైన విలువైన వ్రాత ప్రతులను సంపుటీకరించి ప్రచురించే విషయమై మంత్రి తంజావూరు పండితులతో వివరంగా చర్చలు జరిపారు. హైదరాబాదులోని ప్రాచ్య వ్రాత ప్రతుల గ్రంథాలయంలో పరిశోధనలు జరుపడానికి వీలుగా సరస్వతీ మహల్ గ్రంథాలయంలో వున్న సంస్కృత గ్రంథాలను, తెలుగు గ్రంథాలను మైక్రోఫిల్మ్ తీయడానికి తక్షణం చర్యలు తీసుకోవలసిందని మంత్రి శ్రీ సీతాపతికి సూచనలిచ్చారు.

మంత్రికి గౌరవ కార్యదర్శి గ్రంథాలయ ప్రచురణల కేటలాగ్‌ను బహూకరించారు.

రాష్ట్ర పురావత్ర సంచయన శాఖ డైరెక్టరు మద్రాసులోని ప్రభుత్వ ప్రాచ్య వ్రతుల గ్రంథాలయాన్ని దర్శించి అముద్రితమైన తెలుగు వ్రాత ప్రతులనూ ప్రచురితమైన వాటినీ పరిశీలించారు. మెకంజీ, బ్రౌన్ దొరలు సేకరించిన విలువైన అనేక అముద్రిత తెలుగు సంస్కృత ప్రతులు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి ఇంతవరకు బదిలీ కాలేదని ఆయన కనుగొన్నారు. అమూల్యమైన ఈ ప్రతులను పరిరక్షించి ప్రచురించడానికి వాటిని మైక్రో ఫిల్మ్ తీయడానికి అవసరమైన చర్యలు తీసుకుంటున్నారు.

PUBLISHED BY THE DIRECTOR OF INFORMATION AND PUBLIC RELATIONS, ANDHRA PRADESH, HYDERABAD AND
PRINTED BY THE DIRECTOR OF PRINTING GOVERNMENT OF ANDHRA PRADESH AT THE GOVERNMENT CENTRAL PRESS- HYDERABAD-24



Reg. No. H. 133

